నూతన సంవత్సర శుభాకాంక్షలు 2018

ఆంధ్రప్రభ

Estd. 1938

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 60 • సంచిక: 357 •సోమవారం 1 జనవరి 2018 • విజయవాడ * పేజీలు: 22 • వెల: 5.00 •Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: శుద్ధ చతుర్దశి, ఉ. 11.16 వరకు, అనంతరం పూర్ణిమ; నక్షత్రం: మృగశిర మ. 3.15 వరకు, అనంతరం ఆరుద్ర; అమృతకాలం: ఉ. 6.55 నుండి 8.25 వరకు; తె. 4.10 నుండి 5.40 వరకు, వర్జ్యం: రా. 11.02 నుండి 12.31 వరకు, దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12, తదుపరి మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: సా. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు

ప్రతిక్షణం ప్రజలకే అంకితం



ప్రగతి నా ధ్యాస... సంక్షేమమే శ్వాస

సోదరీ, సోదరులారా..

మీ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. కాల గమనంలో కొత్త మజిలీకి చేరాం. ప్రభుత్వ పగ్గాలు చేపట్టి మూడున్నరేళ్లు. 2018కి స్వాగతం చెప్పే ఇంత మంచి తరుణంలో నా ఆలోచనలను మీతో పంచుకుందామని మీకు ఈ లేఖ రాస్తున్నాను.

ఈ 42 మాసాలూ ఒక మహాక్రతువు జరిపాం. మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని మిషన్‌మోడ్‌తో పనిచేయించాం. అనితర సాధ్యమైన ఫలితాలు సాధించాం. అనేక అంశాలలో ఈ రాష్ట్రాన్ని దేశానికే ఒక ఉత్తమ నమూనాగా నిలిపాం. మొన్ననే భారత రాష్ట్రపతి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూసి ఆశ్చర్యపోయి మనల్ని ప్రశంసించి వెళ్లారు. దేశంలోనే ప్రప్రథమంగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నెట్ కనెక్టివిటీ అందించే ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టును వారి సువర్ణ హస్తాలతో ప్రారంభించుకున్నాం. ఇవాళ ఆంధ్రప్రదేశ్ అంటే ఒక 'హ్యాపెనింగ్ స్టేట్'. ఇప్పుడు మన రాష్ట్రం ప్రపంచంలో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మనతో కలిసి పనిచేయడానికి అనేక దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడానికి భూమి నలుచెరగుల నుంచి పెట్టుబడిదారులు వెల్లువలా వస్తున్నారు. మన 'అమరావతి' గురించి ప్రపంచం ఎదురుచూస్తోంది.

కాలచక్ర భ్రమణంలో ఒకసారి వెనక్కి చూసుకుంటే 1996 నుంచి 2004 వరకు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి మనం బలమైన పునాదులు వేసుకున్నాం. దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదిగాం. ఆ తరువాత వచ్చిన పదేళ్ల కాలం దగా పడ్డ దశాబ్దం. అది చరిత్రకొక చెరగని మచ్చగా నిలిచిపోయింది. 2014లో సహేతుకత లేకుండా సాగిన రాష్ట్ర విభజనతో కుదేలయ్యాం. 60 ఏళ్లుగా శ్రమించి నిర్మించుకున్న సంస్థలను, సంపాదించుకున్న సంపదను కోల్పోయి, రాజధాని ఎక్కడో తెలియని పరిస్థితులలో, కట్టుబట్టలతో, అప్పుల భారంతో దిక్కుతోచకుండా బయటకొచ్చాం.

ఆనాడు అశాస్త్రీయంగా జరిపిన రాష్ట్ర విభజనతో తల్లడిల్లిపోయాం. పెను సంక్షోభంలో పడ్డాం. ఐతే, ఆ సంక్షోభంలోనే అవకాశాలను వెతుక్కున్నాం. ఒక ఉద్యమస్ఫూర్తితో రాష్ట్రాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసుకుంటున్నాం. మనకు దక్కిన అరుదైన అవకాశంగా భావించి ప్రపంచశ్రేణి రాజధానిని నిర్మించుకుంటున్నాం. రూ.16 వేల కోట్ల బడ్జెట్ లోటు, చిన్నాభిన్నమైన పాలనావ్యవస్థ, రాజధాని ఎక్కడో తెలియని అనిశ్చితి, అంతటా అయోమయం ఉన్న సంక్షోభ సమయంలో పగ్గాలు చేపట్టి రాష్ట్రాన్ని పట్టాలపైకి ఎక్కించడం అంత సులభమని అనుకోలేదు. ఎదురైన సంక్షోభాన్ని ఎవరైతే సదవకాశంగా మలుచుకుంటారో వారే అంతిమంగా విజేతలవుతారు. ఏనాడైతే కాంగ్రెస్ పాలకులు మన గుండెల్లో కరకు కత్తులు దింపారో ఆనాడు ఒకే ఒక లక్ష్యాన్ని మన ముందుంచుకున్నాం. కసితో కలిసికట్టుగా కృషిచేసి ఈ రాష్ట్రాన్ని ఇతర రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నాం. దానికి అవసరపడే కార్య ప్రణాళికల్నిరూపొందించుకుని ముందుకు అడుగులు వేశాం. సుస్థిర ఆర్థికవృద్ధి లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు మహా సంకల్పం చెప్పుకున్నాం. దాన్ని అడుగడుగునా గుర్తుచేసుకునేందుకు ఏటా నవ నిర్మాణదీక్ష చేపడుతున్నాం.

మనకు ఎదురైన ప్రతి కష్టాన్ని మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్నాం. ఆరోజు ఆర్థికంగా ఎంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా రైతు రుణభారాన్ని భుజానికెత్తుకుని ఉపశమనం చేశాం. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పింఛన్లను ఐదురెట్లు చేశాం. అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టడమే కాకుండా స్వల్పకాలంలోనే మిగులు విద్యుత్ సాధించి, నిరంతర వెలుగులు అందించే రాష్ట్రంగా నిలబడ్డాం. ప్రాథమిక రంగానికి ➪ 7వ పేజీలో...



ఆ ఆరుగురికి ఒకేరోజు
16 సార్లు హ్యాపీ న్యూ ఇయర్!

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు మొదలయ్యాయి. అయితే ఏ దేశంలోనివారైనా ఈ వేడుకల్ని ఒకేఒకసారి నిర్వహించుకోగలుగుతారు. ఒకసారే ఆదివారం అర్ధరాత్రి 12గంటల సమయం వస్తుంది. కానీ ప్రపంచంతో ప్రస్తుతం ఎలాంటి సంబంధంలేని ఆరుగురు వ్యక్తులు మాత్రం ఏకంగా 16సార్లు నూతన సంవత్సర వేడుకల్ని నిర్వహించుకోనున్నారు. అదికూడా ఒకేరోజు. వారికి 16సార్లు అర్ధరాత్రి 12గంటల సమయం రానుంది. ఇందులో ఎలాంటి ఆశ్చర్యం లేదు. ప్రస్తుతం నాసా పంపించిన అంతర్జాతీయ అంతరిక్షకేంద్రంలో ఆరుగురు వ్యోమగాములున్నారు. వీరు రోజూ 16సార్లు భూమిని చుట్టేస్తున్నారు. ఇలా ఆదివారం అర్ధరాత్రి నుంచి కూడా 24గంటల్లో వీరు 16సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఈ సందర్భంగా 16చోట్ల వీరికి అర్ధరాత్రి 12గంటలు, సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు ➪ 3వ పేజీలో...





యజ్ఞంలా ప్రకృతి సేద్యం

• ప్రకృతి నామ సంవత్సరంగా 2018 • అమరావతిలో ప్రకృతి వ్యవసాయ వర్సిటీ • ఆశాజ్యోతిగా సుభాష్ పాలేకర్ • ప్రకృతి సేద్యానికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్ • శిక్షణకు 13 వేల మంది తెలుగు రైతులు • ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పల్లెల్లో నవక్రాంతి
• రేపటి నుంచి జన్మభూమి మా ఊరు 3

అమరావతి, ఆంధ్రప్రభ: సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ 2018 సంవత్సరాన్ని 'ప్రకృతి సేద్య సంవత్సరం'గా నామకరణం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ ఆవరణలో వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ నేతృత్వంలో జరిగే ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని సీఎం ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయాన్ని పవిత్రయజ్ఞంలా భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఒకప్పుడు అందరూ సమజ వ్యవసాయం చేసేవారన్నారు. ప్రస్తుతం లాభాలకోసం విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూసారం తగ్గడంతోపాటు వాతావరణ కాలుష్య పెరుగుతోందన్నారు. అంతేకాకుండా ఈ ఉత్పత్తులు తిన్న ప్రజలు క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన ➪ 7వ పేజీలో...

రైతుకు వరం.. ప్రకృతి సేద్యం
• పద్మశ్రీ సుభాష్ పాలేకర్ 3

కాషాయ నీడలో రజనీ?!

• రాజకీయాల్లోకి సిద్ధమన్న సూపర్‌స్టార్
• వెనువెంటనే వెల్లువెత్తుతున్న ఊహాగానాలు
• బీజేపీ, ఆరెస్సెస్‌లపై అనుమానాలు
• 'తలైవా'కి దైవభక్తి మెండు
• ఆధ్యాత్మిక పాలన అందిస్తానని ప్రకటన
• బలపడుతున్న కాషాయ ప్రమేయ వాదనలు



(చెన్నై, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

పరిశీలకుల విమర్శల్ని పటాపంచలు చేస్తూ తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తాను రాజకీయాల్లోకొస్తున్నట్లు నిర్ద్వంద్వంగా ప్రకటించారు. త్వరలోనే రాజకీయ పార్టీ పెట్టనున్నట్లు తేల్చిచెప్పారు. వచ్చే ఎన్నికల్లో మొత్తం 234అసెంబ్లీ స్థానాల్నుంచి తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. రానున్న సంగ్రామంలో తమసైన్యం తలపడుతుందని స్పష్టంచేశారు. ఇప్పటికిప్పుడు పార్టీ పేరు, ఆవిర్భావ తేదీలపై ఇతమిద్ధంగా తేల్చిచెప్పకపోయినా సుమారు 20ఏళ్ళుగా రాజకీయ ప్రవేశంపై ఊగిసలాటకు పాల్పడ్డ ఆయన ఎట్టకేలకు సానుకూలంగా స్పందించారు. రజనీ ఇలా రాజకీయ ప్రవేశంపై స్పష్టత ఇచ్చారో లేదో అప్పుడే తమిళ రాజకీయాలపైఅనేక ఊహాగానాలు మొదలయ్యాయి. రజనీ వెనుక బిజెపి హస్తముందా అన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. నేరుగా తమిళనాట పోటీ చేయగల పరిస్థితి తమకు లేదని బిజెపికితాజా ఉప ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. ఈదశలో ఏదొక ప్రాంతీయ పార్టీతో పొత్తెట్టుకోవడమే మేలన్న ఆలోచనకు ఆ పార్టీ అధిష్టానమొచ్చినట్లు సమాచారం. ఎఐడిఎమ్‌కెతో పొత్తు కష్టం. డిఎమ్‌కెతో కలిసెళ్తే నష్టం తప్పదు. ఈ దశలో ప్రత్యామ్నాయ మార్గంగా రజనీని బిజెపియే బరిలో దింపుతున్నట్లు ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రయత్నం వెనుక బిజెపి రాజకీయ దిక్సూచి ఆర్ఎస్ఎస్, విహెచ్‌పిల ప్రమేయముందని కూడా భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా హిందూ రాజ్యస్థాపనే ఈ మత సంస్థల లక్ష్యం. వాస్తవానికి ➪ 3వ పేజీలో...

పుల్వామాలో ఉగ్ర దాడి
• ఐదుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్ల వీరమరణం
• 14 గంటల భీకర పోరు
• ముగ్గురు ముష్కరుల హతం 5

ట్రాన్స్‌ట్రాయ్‌పై గడ్కరీ అసంతృప్తి

• బ్యాంకులకు రుణాల ఎగవేతపై ఆగ్రహం
• నివేదికలు తెప్పించుకున్న కేంద్రమంత్రి
• బీజేపీ నేతల నుంచి కూడా నివేదికలు
• పోలవరంపై సవివర సమీక్షకు నిర్ణయం
• 2న కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీసింగ్ రాక



అమరావతి, ఆంధ్రప్రభ : ట్రాన్స్‌స్ట్రాయ్ వ్యవహారం వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో కేంద్ర జలవనరుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్ర పర్యటనకు త్వరితగతిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. తాజాగా ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ దివాలా తీసినట్లుగా ప్రకటించి, కార్పొరేట్ దివాలా ప్రక్రియను సత్వరమే ప్రారంభించాలని కెనరా బ్యాంక్‌తో పాటు మరికొన్ని బ్యాంకులు హైదరాబాద్‌లోని జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన నేపథ్యంలో నితిన్ గడ్కరీ రాష్ట్ర పర్యటన ప్రాధాన్యత సంతరించుకుందంటున్నారు. వాస్తవానికి నితిన్ గడ్కరీ గత నెల 22నే రాష్ట్ర పర్యటనకు రావాల్సి ఉంది. కానీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆయన పర్యటన వాయిదా పడుతూ వచ్చింది. రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ పర్యటన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విదేశీ పర్యటనతోపాటు ఇదే సమయంలో పార్లమెంట్ సమావేశాలు కూడా ప్రారంభంకావడంతో గడ్కరీ రాష్ట్ర పర్యటనను జనవరి నెలకు వాయిదా వేశారంటున్నారు. చివరికి ఈ నెల రెండో వారంలో నితిన్ గడ్కరీ రాష్ట్రానికి వస్తున్నట్లు సమాచారం. ఆరోజు ఆయన ఢిల్లీ నుంచి ➪ 7వ పేజీలో...

ఔరా..!



కొత్త జోష్!

నేతల భవితవ్యం

కొత్త ఏడాది...కాలచక్రంలో మరో పన్నెండు నెలలు..ఏడాదికేడాది రావడం కొత్త కాకపోయినా..ప్రజాజీవితం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. ప్రజాజీవితాలను ప్రభావితం చేసేది పాలకులు. వారి ఆలోచనలు వారి నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. అవి వారి పాలనారీతుల మంచిచెడుల్ని చెబుతాయి. ఒక ప్రధానమంత్రి..ఒక ప్రతిపక్ష నాయకుడు... ఒక ముఖ్యమంత్రి.. ఇలా ప్రజాస్వామ్య వ్యవస్థలోని ప్రతి కీలక నాయకుడూ జన జీవితాల్ని తమ నిర్ణయాల ద్వారా శాసిస్తారు. మరి వారిని ఎవరు ప్రభావితం చేస్తారు? వారి వ్యవహారశైలి..వారి ఆలోచనా దృక్పథం బట్టే వారి నిర్ణయాలుంటాయి. పుట్టిన రోజుని బట్టి గ్రహాల కదలికలు..ఆ కదలికలను బట్టి ఆలోచనలు..వాటిని బట్టి నిర్ణయాలు..ఇలా ఒకదానికొకటి అనుసంధానమై ప్రజల జీవితాలపై ప్రభావం చూపిస్తాయి. అందుకే ప్రధాని మోదీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త సంవత్సరంలో ఎలాంటి ప్రభావాలతో ఎంతటి ప్రతిభావంతులుగా ప్రజల మీద ప్రభావం చూపిస్తారన్నది ప్రముఖ ఆస్ట్రో-సైకాలజిస్టు డాక్టర్ ఎస్వీ నాగనాథ్ అందించిన విశ్లేషణాత్మక కథనం.!



ఏదేమైనా.. విజేయుడే!

✦ కొత్త ఏడాదిలోనూ అదే పరంపర ✦ మారనిమనిషిగానే అదే ముద్రతో...

✦ వైఫల్యాలకు వెరవని నేతగా ముమ్ముందుకు... ✦ తానను కున్నది చేస్తూ విజయతీరాలవైపు...

కొత్త సంవత్సరంలో ప్రధాని మోదీ రాజకీయ తరాజు ఆయన్ని ఆకాశంలో ఉంచుతుంది. అగుడుడిగుల్లకు ఆస్కారమే లేదు. సంచలనాలబాట.. నోట్లరద్దు, జీఎస్టీ.. అదేబాట.. అదేనీతి.. వ్యవస్థలో ఆగుతున్నట్టు కనిపిస్తూ.. సాగిపోవడం.. విమర్శలను విననట్టు కనిపిస్తూనే.. తీవ్రతనుబట్టి వ్యూహాలు మారుస్తూ.. ఇదే ఆయన కొత్త ఏడాది కర్తవ్యంగా ఉంటుంది. ఉత్తమ విద్యార్థి అనిపించుకోవాలని ఉంటుంది. అంతరంగంలోని ఆధిపత్య ధోరణిని లోలోన అణచుకునే ప్రయత్నం చేసినా.. నడతలో.. పాలనలో కనిపిస్తూనే ఉంటుంది. ఖరీదైన నిరాడంబరుడిలా కనిపిస్తారు. తనకు గుర్తింపు తెచ్చిపెట్టే విజయాలను ఎక్కువ ప్రచారాన్ని ఆశించే నేత. ప్రశంసలంటే పడదు అన్నట్టు కనిపిస్తారు. కానీ తనని పొగడని వారి పొడ గిట్టదు. అన్నిరంగాల్లో నూతన ఆవిష్కరణలు అమలవ్వాలని కోరిక. అవన్నీ తనవేనే ప్ర భావంగా ఉండాలని అభిలషిస్తారు. దాచినా దాగని అహంభావం. భావోద్వేగాల మెండు. జీవితంలో ఏదీ శాశ్వతం కాదనుకునే తత్వం. ఆశావహ దృక్పథాన్ని విశ్వసిస్తారు. విస్తృతిన్న వ్యవహారాలను నిశితంగా పరిశీలిస్తారు. సూక్ష్మ నిర్ణయాల ఇతని శైలి. దేనినైనా ప్రారంభిస్తే దానికి అంకితమౌతారు. ఎదుటి వారిలోనూ ఇదే అంకితభావం ఉండాలని ఆశిస్తారు.

సూర్యుడు కన్యారాశిలోకి రవి ప్రవేశం వల్ల నాయకుడిగా సామాజిక అంశాలపై పోరాడే స్ఫూర్తి సిద్ధిస్తుంది. ఈ క్రమంలో తన స్వభావాన్ని డామినేట్ చేసే అనేక అంశాల్లో అర్థవర్ధన పడతారు. ప్రజాస్వామ్య వ్యవహారాల నిర్వహణలో అప్రమత్తత అవసరం. ఇప్పటిదాకా వేరు. ఇకపైనా అతి అభిలాషల్ని దరిచేరనీయ కూడదు. లేదంటే దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మానసిక శక్తిని విరివిగా వాడటం వలన అలసటకు గురవుతారు. గత అనుభవాలు వ్యక్తిత్వంపై బలమైన ముద్రవేస్తాయి. ఆ ముద్రలే ప్రధానిగా మోడీకి ఒక్కోసారి శాపంగా మారే ప్రమాదం ఏర్పడుతుంది. భావోద్వేగాల కారణంగా సోషలిస్టు అన్న భావన కలుగుతుంది. మేథస్సు, ఆలోచనలు, శక్తిని స్వార్థానికి కాకుండా సమాజహితానికి ఉపయోగిస్తారు. వ్యక్తిత్వం, భోవోద్వేగాలే తన సామాజిక దృష్టికి కారణం. సూర్యుడు కన్యారాశి ప్రవేశం వలన, దీర్ఘకాలంలో పేరుప్రతిష్టలు, అధికారం నిసుస్తాయి. అనుచరగణం పెరుగుతుంది. మరోవైపు బలమైన వ్యతిరేక పవనాలు కూడా వీస్తుంటాయి. ఇలాంటప్పుడే, తాను మిగతా వారికంటే గొప్పవ్యక్తిగా నిరూపితం అవుతుంది. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే క్రమంలో 2018 సవాల్‌గా నిలుస్తుంది. ముఖ్యంగా ఉద్యోగ వనరుల అంశంలో ప్రతిబంధకాలు ఎదురౌతాయి. ఏప్రిల్-సెప్టెంబర్ మాసాల్లో చమురు, విద్యుత్ ధరల్లో మార్పులు ఆందోళన కలిగిస్తాయి.



నరేంద్ర మోడి
పుట్టిన తేది
17-09-1950
రాశి: వృశ్చికం

చంద్రుడు వృశ్చికరాశిలోకి ప్రవేశిస్తాడు. దీని ప్రభావంగా భావోద్వేగాలు పెరుగుతాయి. గత అనుభవాలపై నియంత్రణ, పూర్వ అనుభవాలకు సంబంధించిన ఆలోచనలపై తన బృందాన్ని ఒప్పించాల్సి ఉంటుంది. తన ఆలోచనలకు మద్దతిచ్చే దీర్ఘకాలిక సహచరులు, స్నేహితులను గుర్తించడం కష్టమౌతుంది. పొరపాట్లనుంచి పాఠాలు నేర్చుకునే తత్వం కన్నా పొరపాట్లను గుర్తించే తత్వం ఉంది. కానీ, వాటినుంచి పాఠాలు నేర్చుకునే తత్వం తక్కువ. అంతర్మథనంలో తనకితాను అంగీకరించుకున్నా, బైటికి మాత్రం భిన్నంగా వ్యవహరించేశైలి. ఇది ఒకకంగా ఆయనకు ఆభరణంగా కూడా పనిచేస్తుంది. పదేపదే తప్పులు చేస్తూ, సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తుంటారు. సామాజిక జీవితం సంతృప్తిగా, విజయవంతంగా సాగుతుంది. అయితే, అసంతృప్తితో కూడిన వ్యక్తిగత జీవితం కారణంగా తాత్వికంగా ఉంటారు. బుధగ్రహం తిరోగమన దశ వల్ల తటస్థంగా ఉంటారు. స్థూలంగా తనను తాను వినూత్నంగా భావిస్తారు. కొత్త సంవత్సరం (2018) సానుకూలంగా ఉంటుంది. పేదలకు చేరువ అవుతారు.

కుజుడు జన్మ రాశిలోకి కుజుడి ప్రవేశం శుభాలకు సంకేతం. కుజ ప్రభావంతో అమితమైన శక్తి, ధృడసంకల్పం, పోటీతత్వం, స్పష్టత, అప్రమత్తత వంటి లక్షణాలు అలవడుతాయి. సమాజాన్ని, వ్యవస్థను మార్చగల గుణాలు బలమైన, ప్రజా నాయకుడిగా నిలబెడతాయి. కుజుడి నాయకత్వ ప్రభావంతో పేదల సంక్షేమానికి ఎక్కువగా కృషిచేస్తారు. కార్పొరేట్ల కంటే సామాన్యుల అవసరాలు తీర్చడం అవశ్యమని నమ్ముతారు. కుజుడు దిశ మారేక్రమంలో సెప్టెంబర్ తర్వాత మరింత శక్తివంతం అవుతారు. ఆర్థిక, పెట్టుబడుల నిర్ణయాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వగలుగుతారు. కొత్త సంవత్సరం ప్రథమార్థంలో అనుకున్న లక్ష్యాలు నెరవేరతాయి. దీంతో తదుపరి ప్రయత్నాలకు కొండంత ఆత్మవిశ్వాసం లభిస్తుంది. తన ఉద్దేశాలను చాటడంలో సఫలీకృతం అవుతారు. కేవలం నాయకత్వ లక్షణాలే కాదు, సౌమ్యమైన, మేథోపర గుణాలతో ప్రపంచానికి తన సందేశాన్ని నేరుగా ఇవ్వగలుగుతారు. పరిస్థితులకు అనుగుణంగా ఎప్పుడు గులాబీ పట్టుకోవాలో, ఎప్పుడు ఆయుధం చేబట్టాలో మార్స్ సూచిస్తుంది. ఇచ్చిపుచ్చుకునే సమయాల్లో మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతారు. ప్రజల కోసం ఏదైనా ఇవ్వడం అనేది మోడీకి గర్వకారణం అవుతుంది. అదే సమయంలో తన పాలనకు మెప్పుగా ప్రజల నుంచి పూలహారం పొందడం గౌరవసూచకం.

బుధుడు కన్యా రాశిలోకి బుధుడి ప్రవేశం మూలంగా మోడీ విశిష్ట వ్యక్తిగా కనిపిసారు. సామాజిక అంశాలను మదింపు చేయడంలోనూ, క్షేత్రస్థాయి అవసరాలు తెలుసుకోవడంలో తనదైన ప్రత్యేకతను ప్రదర్శిస్తారు. నాయకుడి వ్యూహాల్లో బలాలు, బలహీనతలను బహిర్గతం చేయడం బుధుడి లక్షణం. ఎలాంటి అనుకూల పరిస్థితుల్లోనైనా ప్రతి అవకాశాన్ని సమతూకం చేసుకోగల సమర్థత మోడీ సొంతం. వ్యవస్థలతో పనిచేసే సమయంలో శారీరక దృఢత్వం, మానసిక అప్రమత్తతతో వ్యవహరిస్తారు. అనూహ్య పరిణామాలను నియంత్రించేందుకు ఇది తోడ్పడుతుంది. సామాన్యుడి మేథస్సును నిగూఢశక్తి, ఊహాశక్తితో ప్రేరేపితం చేయగల ప్రత్యేకత బుధగ్రహానిది. అందువల్ల ఇతర నాయకుల్లాగా మోడీని సులువుగా అంచనా వేయడం కుదరదు. బుధుడిని మిడిమిడి జ్ఞానిగా పేర్కొంటారు. కానీ, మోడీ విషయం ఇందుకు భిన్నం. దేశభవిష్యత్తు, లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో ఉంటారు. స్వచ్ఛభారత్, విద్య, వైద్యం, టెక్నాలజీ, చరిత్రను బలపరచడం, వృద్ధుల సంక్షేమం వంటి పథకాలకు ఈ యేడాది మరింత ప్రాధాన్యం లభిస్తుంది.

బృహస్పతి కుంభ రాశిలోకి గురుడు చేరుకోవడం మిశ్రమ ఫలితాలను ఇస్తుంది. ఈ దశలో మోడీ క్రమశిక్షణతో వ్యవహరిస్తారు. ఆలోచనలను, భావోద్వేగాలను నియంత్రించుకునేందుకు ప్రయత్నిస్తారు. మానవ జీవితం లో ధనం, దాని ప్రాధాన్యతను గుర్తించడంలో విఫలం అవుతారు. తనపాలనలో అవినీతికి తావులేకుండా జాగ్రత్త వహిస్తారు. గురుడి ప్రతికూల ప్రభావం నేపథ్యంలో సామాజిక, రాజకీయ నిబంధనలను అనుసరించడం సాధ్యంకాదు. వైఫల్యాలను అంగీకరిస్తూ, హక్కుల కోసం పోరాడే తత్వంతో మోడీ తనను తాను లక్ష్య సాధకుడిగా చాటుకుంటారు. ఇతరుల ఛాయలో ఉండేందుకు ఎంత మాత్రం అంగీకరించరు. అదేమాదిరి ఇతరుల ఆదేశాలకు బద్ధుడిగా ఉండటాన్నీ ఇష్టపడరు.

శుక్రుడు ప్రతికూల దశ ప్రారంభం. సింహరాశిలోకి శుక్రుడు ప్రవేశించడం మోడీ జాతకంలో చెడు పరిణామం. మంచి ఆలోచనలు, ఆకస్మిక భావోద్వేగాల నియంత్రణ లక్షణాలు పెంపొందుతాయి. సామరస్యంగా ముందుకు వెళ్తారు. మానసిక ధృడచిత్తం సాహసోపేత నిర్ణయాలను ప్రేరేపిస్తుంది. ఇతరులను ఒప్పించ గలుగుతారు. శుక్రదశలో ఒకవైపు పేరు ప్రఖ్యాతులు, ఇంకొకవైపు వ్యక్తిత్వంపై విమర్శలు వెల్లువెత్తుతాయి. శుక్రుడు శాంతిని కోరుకునే గ్రహం. గ్రూపులతో సాహచర్యం విషయంలో భావోద్వేగ బంధాలు అస్థిరతకు దారితీస్తాయి. ఇలాంటి సమయంలో ప్రశాంతత అవసరం. మెరుగైన భవిష్యత్ ప్రణాళికలకు సమయం కేటాయించాల్సి ఉంటుంది.

శని సింహరాశిలోకి అడుగుపెడతాడు. సూర్యుడి కుమారుడే అయినప్పటికీ వీరిద్దరు బద్ధశత్రువులు. సామాజిక పరిణామాలకు అధినాయకుడైన శని అనుకూలత వల్ల, ఎంతటి విమర్శలు, అణచివేతనైనా ఎదుర్కోగలుగుతారు. తాను అనుకున్నది సాధిస్తారు. తన ఆలోచలను విస్తరించగలరు. సింహరాశిలోకి శని ప్రవేశంతో మే 2018లో మతపర వివాదాలు తలెత్తే ప్రమాదంఉంది. ఈ యేడాదిలో కొన్ని అంశాల్లో న్యాయ పరిష్కారం లభిస్తుంది. భవిష్యత్ తరానికి మోడీ మార్గదర్శకుడిగా నిలుస్తారు. మార్పులను శని ప్రభావితం చేస్తుంది. మచ్చలేని పాలన ప్రయత్నం విజయవంతం అవుతుంది.

వ్యూహాత్మక బాటసారి

✦ అనుభవాల బాటలో వ్యూహాత్మక అడుగులు ✦ కొత్త ఏడాదిలో సానుకూల ఫలితాలతో...

✦ పాలనాదక్షతే ఆశీర్వచనంగా ముందడుగు ✦ కాలచక్ర గమనంలో సరికొత్త ఆలోచనలతో...

సూర్యుడు ఆత్మశక్తికి ప్రతీక అయిన సూర్యుడు మేషరాశిలో ఉచ్ఛ స్థితిలో ఉంటాడు. అసాధారణ పరిపాలన లక్షణాలతో అధిక శక్తివంతుడిగా ఉంటారు. కొన్నిసార్లు ఆలోచనలను మదింపు చేసుకునేందుకు మొండిగా వ్యవహరించాల్సి ఉంటుంది. స్వీయ విశ్వాసం, దీక్షాదక్షత, మార్పులకు త్వరగా అలవాటు పడటం వంటి లక్షణాలు గొప్ప నాయకుడిగా నిలబెడతాయి. ప్రజలు వారి వారి ఆకాంక్షలతో, అహాలతో, కోరికలతో అస్థిర పరిస్థితులకు కారణమైనప్పుడు విస్మయం చెందుతారు. ఆ సమయాల్లో మీమీద మీరు విశ్వాసంతో వ్యవహరించాలి. సూర్యుడి ప్రభావంతో అప్రమత్తంగా ఉండే శక్తి లభిస్తుంది. ఈ కోణంలో చూసినప్పుడు అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబుకి సానుకూలంగా ఉన్నదల్లా.. మెత్తని వ్యవహారశైలితో కూడిన కఠిన హృదయం. అవసరాన్నిబట్టి రెండడుగులు వెనక్కివేసే తత్వం. రాజకీయ వ్యూహచతురత ఆయన్ని పాలనాదక్షుడిగా నిలుపుతాయి.

చంద్రుడు మనసుపై ఆధిపత్యం చెలాయించేది చంద్రుడు. చంద్రబాబుకు మహత్తర స్థితిని కలిగించడంలో మూన్ కీలకంగా ఉంటాడు. చంద్రబాబు గుర్తింపు కోసం కాకుండా, మానసిక సంతృప్తి కోసం తపించే వ్యక్తి. నాయకుడిగానే కాక, మార్గదర్శకుడిగా యువతరానికి ఆదర్శంగా నిలవాలని భావించే వ్యక్తి. తెలివైన వారి మధ్య ఉత్పాదక కార్యసాధనను ఇష్టపడతారు. ఉచ్ఛస్థితిలోని చంద్రుడు, ఇతరుల నుంచి శక్తిని, నైపుణ్యాన్ని పొందడంలో గొప్ప అవకాశాన్ని కలిగివుంటాడు. ప్రతిభా వంతులైన ప్రజలను ఇష్టపడతారు. నాణ్యతకు, ఫలితానికి మధ్య వారధిగా ఉంటారు. తనచుట్టూ జరుగుతున్న వాటిని గోప్యంగా పరిశీలిస్తుంటారు. తన దృక్పథాన్ని చాటేందుకు ఇది మంచి సమయం. కొత్త సంవత్సరంలో ఆయన ఎంత ఆశావహంతో ఉన్నారో.. అదేస్థాయిలో ఆయన మీద రాష్ట్ర ప్రజలు ఆశలు పెట్టుకుని ఉన్నారు.


చంద్రబాబు
పుట్టినతేదీ
20-04-1950
నక్షత్రం: కృత్తిక

కుజుడు ఈ గ్రహం కన్యారాశిలో సంచారం చేస్తుంది. జాతకం ప్రకారం ఇది విశిష్ట లక్షణాలను ప్రస్ఫుటం చేస్తుంది. ప్రతీ అంశం మీద స్పష్టత, కచ్చితమైన క్రమశిక్షణ, అపరిమిత దృక్పథంవంటి లక్షణాలు కార్యసాధనకు, మేథో ఆధారిత చర్యలకు పరివర్తనం చెందుతాయి. ఆరంభం అట్టహాసంగా ఉంటుంది. ప్రతిఒక్క అడుగూ తన పర్యవేక్షణలోనే జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటారు. కుజ ప్రభావం కలిగిన వ్యక్తుల్లో నియంత పోకడలు ఉంటాయన్నది సాధారణ అభిప్రాయం. అంతేకాదు స్వయం సంతృప్తిని పరిగణనలోకి తీసుకోకుండా పరిపూర్ణతక ు, ఉత్పాదకత ఆధారిత శీఘ్ర ఫలితాన్ని చేకూర్చే గ్రహంగా దీనిని పేర్కొంటారు. చంద్రబాబు నిరాటంకంగా అధికారంలో కొనసాగేందుకు ఈ గ్రహస్థితి చాలా అనుకూలం. విపక్షాల వ్యూహాన్ని తన శక్తియుక్తులతో సమర్థవంతంగా ఎదుర్కొంటారు. అధికారాన్ని అనుభవించడం కోసమని కాకుండా, అహరహం శ్రమించడం కోసమని విశ్వసించే అరుదైన నాయకుడిగా కొత్త సంవత్సరంలో గుర్తింపు తెచ్చుకుంటారు.

బుధుడు చంద్రబాబు జాతకం ప్రకారం బుధుడు మేషరాశిలోకి సంక్రమణం చేస్తాడు. బుధుడు తెలివైన వాడు. వేగంగా ఆలోచిస్తాడు. కొంచెం అవకాశం లభించినా పరిస్థితులను తనవైపు తిప్పుకునే నేర్పరి.ఈ గ్రహ ప్రభావం తో చంద్రబాబు మానసికంగా ధృడంగా ఉంటారు. తను ఎంత సమర్థుడో 2018 నిర్ణయిస్తుంది. సముచితంగా, చమత్కారంగా మాట్లాడ గలిగే లక్షణాలు అలవడుతాయి. నూతన సంవత్సరంలో నూతనోత్సాహంతో వేగంగా అడుగులు వేస్తారు. ఈ లక్షణం ఆయన పాలనాభిప్రాయానికి సరికొత్త నిర్వచనాన్ని ఇస్తుంది.

బృహస్పతి ఇది కుంభరాశిలోకి ప్రవేశిస్తుంది. జోతిష్యం ప్రకారం బృహస్పతిని అదృష్టానికి ప్రతీకగా పేర్కొంటారు. అయితే, ఈసారి గురుడు వ్యతిరేక రాశిలో ఉంటున్నాడు. 2018 ఒక నాయకుడిగా చంద్రబాబుకు చోదక శక్తిగా నిలుస్తుంది. దగ్గరి వ్యక్తులు, నమ్మకస్తుల పట్ల కాస్తంత అప్రమత్తంగా ఉండాలి. వైరి వర్గంతో సమానంగా స్వపక్షం వాళ్లతో సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితులు దాపురిస్తాయి. పదవులు, హోదాల విషయంలో అసంతృప్తితో ఉన్న వ్యక్తులపై సెప్టెంబర్ వరకు ఒకకన్నేసి వుంచాలి. కుజుడితో కలిసి గురుడు కుంభరాశిలో ఉండటం జోతిష్యం ప్రకారం కీలక పరిణామం. లక్ష్యాలను ఢీకొనడంలో కుజగ్రహం ఏవిధమైన లాజిక్కులు, కారణాలు చూసుకోదు. కేవలం భావోద్వేగం, మొండితనం అంశాలకే ఇది అనుసంధానం అయి వుంటుంది. ఇలాంటి మిశ్రమ గ్రహస్థితి చాలా ప్రమాదకరం. స్వపక్షం నుంచి ఏ సమయంలోనైనా నష్టం వాటిల్లవచ్చు. కుజుడితో చంద్రబాబుకు ఇబ్బంది లేదు. కానీ, బృహస్పతితో కలసి ఉండటం వల్లే సమస్యలు.

శుక్రుడు ఆకాంక్షలను రగిల్చి, కోరికలతో పరుగెత్తించడం శుక్రుడి లక్షణం. ఈయేడాది ఇది కుంభరాశిలో ఉంటుంది. చంద్రబాబు మనసులోని ఆలోచనలను శుక్రుడు ప్రతిబింబిస్తాడు. తన రాష్ట్ర పౌరుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కావలసిన ప్రేరణ పొందుతారు. ఇతరుల ఆలోచనల నుంచి స్వతంత్రంగా ఉంటారు. మంచి అభిప్రాయాలు కలిగివున్నప్పటికీ, గొప్ప పరిపక్వత ప్రదర్శించేందుకు శుక్రుడు సహకరిస్తాడు. 2018 లో ఉషా కిరణాలు ఏపీ ముఖ్యమంత్రి మరింతగా తన నిష్పాక్షికతను, పెద్దరికాన్ని పెంపొందించుకుంటారు. ఆయన నాయకత్వ శైలిలో ప్రతిబింబించాలి. కొత్తరాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, మతపర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి రావొచ్చు.



శని ఇది సింహ రాశిలో ఉంటుంది. కర్మలకు అధిపతిగా ఉండే శని ప్రభావం చాలానే ఉంటుంది. గోచారఫలం ప్రకారం వృషభరాశిలో శని ఎనిమిదో పాదంలో ఉంటాడు. దీని ప్రభావంగా ఆరోగ్యం, వ్యాధులు, అస్తిరతలు, అపకీర్తి వంటి సమస్యలు ఎదురవుతాయి. అకస్మాత్తుగా కొన్ని ఎత్తుపల్లాలు చోటు చేసుకుంటాయి. కఠిన సమయాల్లో మీ శక్తిసామర్థ్యాలను పరీక్షించుకోవాల్సి ఉంటుంది. చంద్రబాబు జాతకం ప్రకారం ఈ యేడాది సామాజిక ముఖచిత్రం, కుటుంబ అంశాలను శని లక్ష్యంగా చేసుకుంటాడు. అయితే, సూర్యుడు ఉచ్ఛస్థితిలో ఉండటం వల్ల చంద్రబాబుపై ఎలాంటి దుష్ప్రభావాలు పడవు. ఎలాంటి ఇబ్బందులు ఉండవు. వివిధ ప్రతికూలతల నుంచి సూర్యుడు రక్షిస్తాడు. తన రాశి ఫలాన్ని ఎనిమిదో పాదంలోని శని ప్రభావితం చేస్తున్నా, చంద్రబాబు అదృష్టానికి ఢోకా ఉండదు. పెత్తనానికి, ప్రామాణికతకు, శక్తికి, అధికారానికి ప్రమాదం వాటిల్లదు.

రాజకీయ లబ్ధికోసం ప్రత్యర్థులు మునుపటి అంశాలపై ఆందోళన చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా సంక్షేమం, అభివృద్ధి సంబంధిత విషయాలపై రాజకీయ లబ్ధికి పోరాటం చేయొచ్చు. అయినప్పటికీ, తన ప్రతిష్టను నిలుపుకోవడంలో చంద్రబాబుకు 2018 సంవత్సరం సానుకూలం గానే ఉంటుంది.

సుదీర్ఘ రాజకీయ పయనం.. అందలాలు.. ఆటుపోట్లు.. రాటుదేలిన నాయకత్వం.. అయినా మళ్లీ పరీక్షే. కొత్తరాష్ట్రం.. కొత్త రాజధాని.. కొత్త వాతావరణం.. మళ్లీ సరికొత్తగా తన నాయకత్వానికి పదును పెట్టుకోవాల్సిన చారిత్రక అవసరం. అన్నింటినీ తట్టుకుంటూ.. ఆంధ్రుల ఆశలను సజీవంగా నిలుపుతూ.. కాలగర్భంలో మూడున్నరేళ్లు అయిపోయాయి. కొత్తసంవత్సరం రానే వచ్చింది. కాల చక్రం పరుగిడుతున్నట్టే ఉంటుంది. ఇదే ఏపీ సీఎం చంద్రబాబుకి ఒకరకంగా ఉత్ప్రేరకం. బలాల విషయానికొస్తే చంద్రబాబు సర్వస్వతంత్రుడు.. మంచి ఆలోచనాపరుడు. ఉదారస్వభావి.. ఉత్సాహవంతుడు.. ఆశావహ దృక్పథం.. అవిశ్రాంత కృషీవలుడు.. అదేసమయంలో భావాలు వేగంగా మారడం.. వ్యక్తీకరణలో వెనుకబాటుతనం. స్వీయ ప్రమేయం.. ఇతరుల పనితీరుపై ఉద్రేకం.. నిర్లక్ష్యానికి గురైనప్పుడు అసహనం ఆవహించడం.. తనస్థాయిలోనే ఇతరులూ పనిచేయాలన్న అత్యాశ. రాష్ట్రం త్వరగా మారిపోవాలన్న ఆత్రుత వంటి లక్షణాలు బలహీనతలుగా పేర్కొనవచ్చు.

నిరంతర ఆశావహుడు!

✦ ఎగుడుదిగుళ్ల బాటలో స్వయంకృషితో... ✦ అలుపెరగని నేతగా కొత్తపాత్రలో అప్రతిహతంగా...

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కీలక నేతలు. ప్రస్తుతం ఈ రెండు పదవుల్లో నరేంద్ర మోడీ, రాహుల్ గాంధి ఉన్నారు. చమత్కారం ఏమిటంటే.. ఆహార్యం దగ్గర్నుంచి ఆలోచనల దాకా.. ఇద్దరూ పరస్పరం భిన్నమైన శైలిని ఆవాహనం చేసుకున్నారు. అంటే రాహుల్ లక్షణాలను మోడీ ఆపాదించుకోవాల్సి ఉండగా, మోడీ లక్షణాలనురాహుల్ పుణికిపుచ్చుకోవాల్సింది. అప్పుడు ప్రధానిగా మోడీ, ప్రతిపక్ష నేతగా రాహుల్ చక్కగా ఆయా పదవులకు అతికిపోయేవారు. ఇప్పటిదాకా వారికెదురైన సమస్యలు, విమర్శలకు చిక్కుముడి వీడేది. వారివి కాని పాత్రల్లో వారిద్దరూ ఒదిగిపోయిన ఫలితమిది. కొత్త ఏడాదిలో రాహుల్ గాంధీ మరింతగా ఆ పాత్ర నుంచి బైటికొచ్చే అవకాశాలున్నాయి. అదే అతని రాజకీయ ప్రస్థానానికి ఉత్తమ కొలమానం.

సూర్యుడు జాతకంలో బృహస్పతి, సూర్యుడు మిథున రాశిలో ఉండటం శుభపరిణామం. వీటి ప్రభావం చేత మంచి పోటీదారుగా నిలుస్తారు. బృహస్పతి మూలంగా సహజసిద్ధ స్వభావంతో దూకుడుగా, వాస్తవ సామర్థ్యానికి అతీతంగా తన గుర్తింపు కోసం ప్రయత్నిస్తారు. ఒకసారి బృహస్పతి మిథునంలోకి రాగానే, అదృష్టం వరిస్తుంది. పార్టీలోనూ, ముఖ్య నేతల వద్ద బాధ్యతాయుత నాయకుడిగా తన పాత్రను మలచుకుంటారు. ఈ ప్రభావం 2018 నవంబర్ వరకు ఉంటుంది. సూర్యుడి శక్తితో లక్షలాది రాజకీయ, వ్యక్తిగత ప్రతిబంధకాలను అధిగమించగలరు. ఒకవేళ తనను తాను ప్రధానిగా అనుకుంటే, అందుకు తగినట్లుగానే వ్యవహరిస్తారు. దీనిమూలంగా రాహుల్ సక్సెస్ సాధిస్తారు. ఎవరి జీవితంలోనైనా సూర్యుడి ప్రభావం ఈస్థాయిలోనే ఉంటుంది. ఆత్మసంకల్పం అవసరం రానున్న రోజుల్లో ఇది ప్రబలశక్తిగా రూపాంతరంచెందే అవకాశాలున్నాయి.

చంద్రుడు వృశ్చికరాశిలోకి చంద్రుడు చేరుకున్నందున పరిస్థితులు కాస్తంత బలహీనంగా ఉంటాయి. ప్రపంచానికి తన ఆలోచనలను పరిచయం చేసే సమయంలో మానసిక దుర్బలత్వం. సాపేక్షత కోల్పోవడం, సంధానలోపం ప్రతిబంధకాలుగా మారతాయి. కానీ సంఘటిత భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. బాహ్యాకోణంలో కాకుండా, తన కోణంలో ఈ ప్రపంచం తనను గుర్తించాలని, అర్థం చేసుకోవాలని కోరుకుంటారు. చంద్రుడి గ్రహస్థితి కారణంగా చిన్నపిల్లాడి మనస్తత్వాన్ని ప్రదర్శిస్తారు. వృశ్చికరాశిలోకి చంద్రుడి ప్రయాణం రాహుల్‌కు వ్యతిరేక ప్రభావాన్నిస్తుంది. నిరుత్సాహం, అస్పష్ట ఆలోచనలతో ఇబ్బందులు. అయితే కాలక్రమేణా ఈ బలహీనతలు తొలగుతాయి. రాహుల్‌కు ఏలినాటి శని రెండో దశ నడుస్తోంది. మొత్తం ఏడున్నరేళ్ల శనిలో తొలిదశ రెండున్నరేళ్లు గడిచాయి. ఈ క్రమంలో రాహుల్ జాతకం ప్రకారం శని చాలా బలహీనంగా ఉన్నాడు.

కుజుడు స్వతహాగా వృద్ధిలోకి రావడం, మిగతా వారికంటే భిన్నంగా ఉండేందుకు ప్రయత్నించడం, అధికారం, గుర్తింపు పట్ల మక్కువ కలిగివుండటం వంటివి కుజగ్రహ లక్షణాలు. రాహుల్ జాతకంలో ఈ కుజగ్రహం మిథునరాశిలోకి ప్రవేశించడం వలన మంచే జరుగుతుంది. అత్యంత బలహీన స్థానం నుంచి కఠిన పరిస్థితుల్లోనూ ఫలితాలు భిన్నమైనవిగా మారతాయి. 27 జనవరి 2017 నుంచి రాహుల్‌కు గడ్డుకాలం నడుస్తోంది. 2019 మధ్యస్థం వరకు ఈదశ ఉంటుంది. ఈ పీరియడ్‌లో జాతకం మంచి దశలో ఉన్నపుడు, తనదైనశైలిలో ప్రపంచాన్ని కమ్యూనికేట్ చేయడానికి అతను ధైర్యంతోను, పారదర్శకతతోను వ్యవహరిస్తారు. ఈ క్రమంలో కొంతవరకు విజయం సాధిస్తారు. చీకటి వెలుగుల చక్రభ్రమణంలో చీకటిదశ నుంచి ఆయన వెలుగుల్లోకి పయనిస్తున్న జాడలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది ఆయన నాయకత్వానికి, కాంగ్రెస్ పార్టీకి మంచి పరిణామం.

బుధుడు ఈ గ్రహం వృషభరాశిలోకి ప్రవేశిస్తుంది. దీని ప్రభావంగా మిడిమిడిగా, గుంభనంగా, గందరగోళంగా కనిపిస్తారు. రాహుల్ వ్యక్తిత్వంలో చిన్నపిల్లల తరహా భావోద్వేగాలు అధికం. నిన్నమొన్నటి దాకా బాధ్యతల స్వీకారం పట్ల అయిష్టతకు ఈ లక్షణమే కారణం. భావోద్వేగ పూరిత పరిష్కారాలు గుర్తించడంలో మేటి. కానీ కార్యాచరణ అంశాల్లో వెనుకబడి పోతారు. బహుళ ఆలోచనలు కలిగివుంటారు. అవి పూర్తయ్యాయా? లేదా? అన్నది పట్టించుకోరు. వాటి ఫలితాల కోసం దీర్ఘకాలం వేచిచూడరు. వాస్తవాలను బేరీజు వేసుకునే బదులు, సొంత అభిప్రాయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అధికారం, హోదా కోసం పరితపించని రాజకీయ సన్యాసిగా తనను పరిగణించాలని అనుకుంటారు. అతనిలో ఒవ్వరికీ కనిపించని మేధోగుణం దాగివుంది. అడపా దడపా అదే ఆయన్ని వెలుగులోకి తెస్తున్నది. పరిపూర్ణ నాయకునిగా పరిణామం చెందేదశ వైపు ఆయన్ని గ్రహరాశులు నడిపిస్తున్నాయి.



రాహుల్ గాంధీ
పుట్టిన తేది 19-6-1970
రాశి: వృశ్చికం
నక్షత్రం: జ్యేష్ట

బృహస్పతి ప్రత్యర్థికి నివాస స్థానమైన తులారాశిలోకి బృహస్పతి ప్రవేశిస్తాడు. అభద్రతా భావానికి గురై, ఆ దశకు చేరినప్పుడు సంబంధిత వ్యక్తులకు సంక్లిష్ట పరిస్థితులు గోచరిస్తాయి. ఇలాంటి సమయాల్లో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి. దేశానికి ప్రత్యామ్నాయ నాయకుడిగా కనిపించేందుకు పరస్పర ప్రయత్నాలు కొనసాగించాలి. ఇందుకు తానొక్కడే ముందు వరుసలో ఉండి, తన అనుయాయుల్ని నడిపించడం ద్వారా నాయకత్వ లక్షణాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. రాహుల్ ఎంపిక చేసుకున్న రంగంలో ఎక్కువ గౌరవ మన్ననలు పొందేలా బృహస్పతి సహకరిస్తాడు. ఇక తులారాశికి అధిపతి అయిన శుక్రుడు కర్కాటక రాశిలోకి చేరడం వల్ల తన పార్టీలో కొంత అస్థిరత నెలకొంటుంది. తనపై విమర్శలు వచ్చినా, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని అంతే దూకుడుగా బలవంతుడిగా నిలదొక్కుకుంటారు. ఇప్పటికే ఈ ప్రక్రియ మొదలైంది. కొత్త సంవత్సరంలో ఇది మరింతగా రాణిస్తుంది. రోజులు గడుస్తున్న కొద్ది ఆశ్చర్యపోవడం విమర్శకుల వంతవుతుంది.

శుక్రుడు పరిస్థితులకు అనుకూలంగా ఆలోచనలు, నడవడిక మార్చుకుంటారు. కర్కాటక రాశిలోకి శుక్ర పయనంతో ఈవిధమైన ప్రభావం కనిపిస్తుంది. వ్యక్తిగత అహాన్ని నిర్మూలించేందుకు సిద్ధంగా ఉంటారు. ఇతర నేతలకు ఈ మార్పు కష్టతరం. రాహుల్‌లో ఎప్పటికి ఎలా ఉండాల్సి వస్తే, అప్పటికి అలా ఉండగల మరో మనిషి ఉన్నాడు. ఇదే అతనికి ప్లస్ పాయింట్. మంచిది అనుకుంటే ఆ కార్యాన్ని వెంటనే అమలు చేయగలరు. అయితే, ప్రజలకు స్వతహాగా మార్గదర్శకం చేయలేని స్థితి అతనికి ప్రతిబంధకంగా ఉంది. ప్రజల కనీస అవసరాలు, సౌకర్యాలను బాగా అర్థం చేసుకోగలడు. నిరాడంబరంగా ఉంటారు. మౌనంగా, ప్రశాంతంగా ఉండే లక్షణాలతో ఈ యేడాది ద్వితీయార్థంలో రాణిస్తారు. మహిళల సామాజిక, ఆర్థిక, విద్యా విషయాలపై రాహుల్ చేసే పోరాటం, అతని రాజకీయ భవిష్యత్‌కు అద్భుతమైన మద్దతును అందిస్తుంది. జనాకర్షణ అంశంలో సీనియర్ల సలహాలు అంతగా పట్టించుకోరు. సామాజిక, రాజకీయ విషయాలను ఔపోసన పట్టేక్రమంలో ఒకరిని అనుకరించడానికి ఇష్టపడరు. సొంతంగానే ముందడుగు వేస్తారు. ఏదైనా అంశాన్ని తక్షణమే, సహజసిద్ధంగా చేపట్టగలరు.

శని మేష రాశిలో ఉండే శని, నీచ స్థానంలో సంచరిస్తుంటాడు. దీంతో భావోద్వేగ నియంత్రణ లోపిస్తుంది. చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించడం ద్వారా రాహుల్ కొత్త విషయాలను నేర్చుకుంటారు. అంతే తప్ప తండ్రినుంచి సంక్రమించిన సామాజిక కోణం నుంచి కాదు. అధికార పార్టీకి గట్టిపోటీ ఇచ్చేందుకు కొత్త సంవత్సరం రాహుల్‌కు చక్కని అవకాశం కల్పిస్తుంది. పార్టీని, అనుచరులను నడిపించడంలో ఇమేజీ కొత్తకోణం లో ఆవిష్కృతం అవుతుంది.



- డా. ఎస్వీ.నాగ్‌నాథ్
ఆస్ట్రో-సైకాలజిస్టు

S & D

కాషాయ నీడలో రజనీ?!



(మొదటిపేజీ తరువాయి)

దేశ విభజన లక్ష్యం కూడా ఇదే. బ్రిటీషీయులు భారత్‌కు స్వతంత్రాన్నిస్తూ రెండుగా విభజించారు. అప్పటి పరిస్థితుల్లో హిందూ, ముస్లింల మధ్య సఖ్యత కొనసాగే అవకాశంలేదని నిర్ణయించుకున్నారు. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్ని పాకిస్థాన్ పేరిట ప్రత్యేక దేశంగాఏర్పాటు చేశారు. మిగిలిన భారత్‌ను హిందూరాజ్యంగానే పరిగణించాలని సూచించారు. అక్కడున్న హిందువుల్ని ఇటువైపు రావాల్సిందిగా, అలాగే ఇక్కడున్న ముస్లింలను అటు వెళ్ళాల్సిందిగా ఆదేశించారు. విభజన నేపథ్యంలోకోట్లాదిమంది సరిహద్దుల్ని దాటి అటూ ఇటూ ప్రయాణం చేశారు. ఈ ప్రక్రియలో వేలాదిమంది ప్రాణాలు కూడా కోల్పోయారు. పాకిస్థాన్ ప్రాంతంలోని హిందువులు తమ ఆస్తుల్ని వదులుకుని కట్టుబట్టల్తో భారత్‌లోకొచ్చి స్థిరపడ్డారు. అయితే ఇక్కడింకా కోట్లాదిమంది ముస్లింలు మిగిలిపోయారు. వారంతా రాజ్యాంగ బద్ధంగా ఓట్లు పొందారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో కూడా భారత్‌ను సర్వసత్తాక సార్వభౌమత్వ ప్రజాస్వామ్య వ్యవస్థగానే పేర్కొన్నారు. రాజ్యాంగం రచించిన సమయంలో లౌకికపదాన్ని చేర్చలేదు. కానీ ముస్లింల్తో పాటు అల్పసంఖ్యాక వర్గాలను ఆకర్షించాలన్న ఓట్ల రాజకీయం నేపథ్యంలో కమ్యూనిస్ట్ సిద్ధాంతకర్తల ప్రోత్సాహంతో కాంగ్రెస్ పాలకులు రాజ్యాంగ సవరణ చేసి లౌకికపదాన్ని చేర్చారు. ఇప్పుడిదే పదాన్ని తిరిగి తొలగించాలంటూ కేంద్రమంత్రి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా వివిదాన్ని రాజేశాయి. లౌకికవాదాన్ని తమ సిద్ధాంతంగా ప్రకటించుకునే పార్టీలు దీనిద్వారా అల్పసంఖ్యాక వర్గాల్ని హిందుయేతరలను రెచ్చగొట్టి తమకనుకూలంగా మార్చుకోవాలన్న ఆతృత ప్రదర్శిస్తున్నాయి. ఈ దశలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో బలమైన శక్తులుగా ఎదిగి అధికారాన్ని చేజిక్కించుకున్న బిజెపి దేశవ్యాప్తంగా తన రాజ్యస్థాపనకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

యూపి ముఖ్యమంత్రి యోగేంద్రనాథ్ తనకుతాను హిందూ సాధువుగా ప్రకటించుకున్నారు. కాషాయ వస్త్రాల్తోనే విధులు నిర్వహిస్తున్నారు. సర్వసంగ పరిత్యాగిగానే కొనసాగుతున్నారు. గతంలో ఎన్‌టిఆర్ కూడా ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాషాయ వస్త్రాల్ని ధరించి ఆధ్యాత్మిక భావాల్తో పాలన సాగిస్తానని ప్రకటించారు. దీర్ఘకాలం పాటు అదే వస్త్రధారణ కొనసాగించారు. ఉమాభారతి, సాధ్విరితంబర తదితరులు ఇప్పటికీ కాషాయవస్త్రధారణలోనే పార్లమెంట్‌కు



హాజరౌతున్నారు. శివసేన వ్యవస్థాపకులు బాల్‌థాకరే నిత్యం కాషాయ వస్త్రాల్తో హిందుత్వానికి ప్రతీకగా వ్యవహరించేవారు. రజనీకాంత్‌ది కూడా దాదాపు ఇలాంటి మానసికస్థితే. పేరుకు ఆయన దేశంలోనే అతిపెద్ద స్టార్. మరెవరికీ లేనంతమంది అభిమానులు ఆయనకు సొంతం. కానీ ఒక్కసారి మేకప్‌తీసేస్తే చెరిగిపోయిన జుట్టు, మాసిపోయిన గెడ్డంతో సాదాసీదాగా ఓ వృద్ధుడిగా ఆయన కనిపిస్తారు. చిత్రానికి చిత్రానికి మధ్యలో హిమాలయాలకెళ్ళి సాధుసంతల సాంగత్యంలో ఆధ్యాత్మిక జీవనాన్ని గడుపుతారు. ప్రత్యేక భావ వ్యక్తీకరణతో ప్రేక్షకుల్ని కేరింతలు కొట్టించే రజనీకాంత్ ఆకస్మాత్తుగా తెల్ల లుంగీ పైకెత్తికట్టుకుని హిమాలయాలసానువు ప్రాంతదారుల్లో రోడ్డుపక్క బడ్డీల్లో టి తాగుతున్న ఫోటోతో అభిమానులకు ఆశ్చర్యాన్ని కల్పిస్తారు. తాను దైవాజ్ఞతోనే సినిమాల్లోకొచ్చానని ఆయన విశ్వసిస్తారు.

ఇప్పటి జీవన విధానం మొత్తం భగవత్‌సంకల్పంగానే భావిస్తారు. దైవాన్ని నమ్మండి.. మీకంతా మంచే జరుగుతుందంటూ అభిమానులకు ఉద్బోధిస్తారు. ఈలక్షణాల్ని పరిగణనలోకితీసుకునే ఆర్‌ఎస్ఎస్, విహెచ్‌పిలు భావి తమిళనేతగా రజనీకాంత్‌ను తెరపైకి తెచ్చినట్లు భావిస్తున్నారు. రాజకీయ ప్రవేశప్రకటనతో పాటే రజనీకాంత్ తానధికారంలోకి రాగానే ఆధ్యాత్మిక భావాల్తో ప్రజారంజక పాలన చేస్తానంటూ పేర్కొనడం ఈ వాదనకు మరింత బలం చేకూరుస్తోంది. ఇప్పటికే దేశంలో అరుణాచల్‌ప్రదేశ్, అస్సోం, చత్తీస్‌ఘడ్, గోవా, గుజరాత్, హర్యాన, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో బిజెపి సొంతంగా రాజ్యాలేలుతోంది. ఆంధ్రప్రదేశ్ పాలనలో భాగస్వామ్యముంది. బీహార్‌లో బిజెపి మద్దతుతోనే జెడియు అధికారం సాగిస్తోంది. జమ్మూకాశ్మీర్‌లో పిడిపితో కలసి అధికారంలో ఉంది. నాగాలాండ్‌లో ఎన్‌పిఎఫ్‌కు మద్దతిస్తోంది. సిక్కింలో అధికారంలో ఉన్న డెమోక్రటిక్ ఫ్రంట్ బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉంది. ఇక కర్ణాటక, కేరళ, మేఘాలయ, మిజోరాం, పంజాబ్, తమిళనాడు, త్రిపుర, తెలంగాణా, పశ్చిమబెంగాల్, ఢిల్లీ, పుదుచ్చేరి రాష్ట్రాలపై దృష్టిపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంతో పొత్తెట్టుకుంది. తెలంగాణాలో సొంతంగా పోటీకి ప్రయత్నాలు ప్రారంభించింది. కర్ణాటకలో ఈ సారి గెలుపు తమదేనన్న ధీమాలో ఉంది. కేరళలో ఇప్పట్లో అవకాశాల్లేవని తేలిపోయింది. ఇక దక్షిణాదిన అత్యంతకీలకమైన తమిళనాట తమ అనుకూల ప్రభుత్వాన్ని స్థాపించడానికి రజనీకాంత్ ఉపకరిస్తారన్న ఆశాభావంతో ఉన్నట్లు తెలుస్తోంది.

అధికారం కోసం కాదు

తనకు 45ఏళ్ళప్పుడే రాజకీయాల్లోకి రావాలంటూ ఆహ్వానాలందాయి. అప్పుడే అధికారంపై ఆశలేదు. 68ఏళ్ళప్పుడు ఎలా ఉంటుందంటూ రాజకీయ ప్రవేశ ప్రకటన చేసిన రజనీకాంత్ పేర్కొన్నారు. తాను అధికారం కోసం రాజకీయాల్లోకి రావడంలేదన్నారు. అలా వస్తే తన ఆధ్యాత్మికత వాదానికి విలువుండదన్నారు. కులమతాలకు సంబంధంలేని రాజకీయాలందించడమే తన లక్ష్యంగా చెప్పారు. వచ్చే పార్లమెంటరీ ఎన్నికల నాటికి పార్టీని సంసిద్ధం చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సమయం తక్కువగా ఉందన్నారు. దేశ రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయన్నారు. వాటిని ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గతంలో రాజులు పరాయిదేశాలపైదండయాత్రచేసి దోచుకునేవారన్నారు. ఇప్పుడు రాజకీయపార్టీలు ప్రజలపైనే దోపిడీ సాగిస్తున్నాయన్నారు. అవినీతిని అంతం చేయడమే తన లక్ష్యంగా చెప్పారు. మార్పు కోసమే తానీ నిర్ణయం తీసుకున్నానన్నారు.

ఆ ఆరుగురికి ఒకేరోజు 16 సార్లు హ్యాపీ న్యూ ఇయర్!

(మొదటిపేజీ తరువాయి)

కనిపిస్తాయి. భూమిని చుట్టే క్రమంలో ఒక్కో ప్రాంతంలో మొదలయ్యే నూతన సంవత్సర వేడుకల్ని ఆస్వాదించడం వారికి మాత్రమే సాధ్యమౌతుంది. అలాగే భూ ప్రదక్షిణల సందర్భంగా సంవత్సరం తొలిరోజున ఒక్కో ప్రాంతంలో నెలకొన్న వాతావరణాన్ని కూడా వారు అంచనాలేస్తారని నాసా స్పష్టం చేసింది.

భారత్‌కంటే సుమారు ఏడుగంటల ముందుగానే న్యూజిలాండ్‌లో నూతన సంవత్సర వేడుకలు మొదలయ్యాయి. ఆక్లాండ్‌లో నూతన సంవత్సరం 2018 భారతకాలమాన ప్రకారం ఆదివారం సాయంత్రం 4.32గంటలకు ప్రవేశించింది. ఆ తర్వాత న్యూజిలాండ్‌లోని వెల్లింగ్టన్, సువా, నుకౌలఫా నగరాల్లోకి నూతన సంవత్సరం వచ్చింది. ఈ సందర్భంగా ఆయా నగరాల్లో దేదీప్యమైన విద్యుత్ కాంతులు, బాణాసంచా కాల్పుల్తో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. వాస్తవానికిఆక్లాండ్ కంటే సుమారు గంటముందుగానే కొన్ని దీవుల్లోకి నూతన సంవత్సరం ప్రవేశించింది. భారత కాలమాన ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 3.48గంటలకు సామోవా, క్రిస్మస్ ఐలాండ్‌ల్లోకి నూతన సంవత్సరమొచ్చింది. మరో 13నిమిషాల్లో న్యూజిలాండ్ సమీపంలోని ఛార్థామ్ దీవుల్లోకి నూతన సంవత్సరం విచ్చేసింది. కాగా న్యూజిలాండ్ తర్వాత రష్యాలోని అనాడైర్, పునాఫుటీ, యారైన్, తరావా, మజూరో నగరాల్లోకి 2018 ప్రవేశించింది. అక్కడ్నుంచి ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, కాన్‌బెర్రా, హోనియారా, నగరాలకు వరుసగా విచ్చేసింది. మరో అరగంటలోగా ఆస్ట్రేలియాలోని ఆడిలైడ్, బ్రోకెన్‌హిల్, సెడూనా, సాయంత్రం 7.30గంటల సమయంలో క్వీన్స్‌ల్యాండ్, బ్రిస్‌బేన్, పోర్ట్‌మోర్స్‌బై, హగర్తనా నగరాల్లోకొచ్చింది. రాత్రి 8గంటలకు ఆస్ట్రేలియాలోని డార్విన్, అలైస్ స్ప్రింగ్స్, టెర్నాంట్ క్రీకల మీదుగా రాత్రి 8.30గంటల సమయంలో జపాన్‌లో కెళ్ళింది. టోక్యో మీదుగా దక్షిణ కొరియాలోని సియోల్ నగరంలో నూతన సంవత్సరం వికసించింది. రాత్రి 9గంటల సమయంలో ఉత్తరకొరియా రాజధాని ప్యోంగ్‌యాంగ్, హమ్‌హంగ్, చొంఘింఘ్, నాంపో నగరాల్లోకి వచ్చిన 2018 భారత కాలమాన ప్రకారం సరిగ్గా రాత్రి 9.31గంటలకు చైనాలోని బీజింగ్ మీదుగా హాంకాంగ్, మనిల్లా, సింగపూర్‌లకుచేరింది.

అక్కడ్నుంచి జకార్త, బ్యాంకాంగ్, హనోయిల కెళ్ళింది. రాత్రి 11గంటల సమయంలో మయన్మార్ సమీపంలోని యాంగాంగ్, నైపిడో, మండాలే, బంటాంగ్‌ల మీదుగా బంగ్లాదేశ్‌లోని ఢాకా, ఆల్మటి, ఢిష్కిక్, కింపులకు చేరింది. సరిగ్గా 11.47గంటలకు నేపాల్‌లోకి ప్రవేశించింది. 11.49గంటలకు ఖాట్మాండ్‌లోకొచ్చింది. పొఖారా, బిరాట్‌నగర్, ధారన్‌ల మీదుగా సరిగ్గా అర్ధరాత్రి 12గంటలకు భారత్ దేశంలో నూతన సంవత్సరం ప్రవేశించింది. తొలుత భారత్‌లోని కలకత్తా మీదుగా ఢిల్లీ, ముంబయ్‌ల్లో నూతన సంవత్సరం ఆవిర్భవించింది. ఇక్కడ్నుంచి తాష్కంట్, ఇస్లామాబాద్, లాహోర్, కరాచీ, కాబూల్, కాందహార్, మజారీషరీఫ్, హెరట్, అజర్‌బైజాన్, దుబాయ్, అబుదాబి, మస్కట్, టెహ్రాన్, మాస్కో, అంకారా, బాగ్దాద్, బ్రెసెల్స్, మేడ్రీడ్‌ల మీదుగా భారత కాలమాన ప్రకారం ఉదయం 5.30గంటలకు లండన్ చేరుకుంది. ఈ రోజు మధ్యాహ్నం 10.37గంటలకు న్యూయార్క్, 39నిమిషాలకు వాషింగ్టన్, 41నిమిషాలకు డెట్రాయిట్, 11.30గంటలకు మెక్సికోలలో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్నాయి.

ఆదర్శంగా ఇం'ధన' పొదుపు

- ప్రతి ఇంటినీ విద్యుత్ సామర్థ్య గృహంగా మార్చాలి
- స్టార్ రేటెడ్ గృహోపకరణాలను వాడండి
- 30 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలతో ప్రపంచ రికార్డు సాధిస్తాం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అంతా మంచే జరగాలని, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆకాంక్షించారు. ఆదివారం ముఖ్యమంత్రి విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు, ఐటీ, కమ్యూనికేషన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్, ఇతర అధికారులతో కలిసి రాష్ట్రంలో ఇంధన సంరక్షణకు చేపడుతున్న, చేపట్టబోయే ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, 2018న సుస్థిర ఇంధన సామర్థ్య సంవత్సరంగా ప్రకటించారు. విద్యుత్ పొదుపులో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికిప్పుడే దేశంలో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. ఇంధన సామర్థ్యంలో గృహోపకరణాల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. స్టార్ రేటెడ్ ఉపకరణాలను వాడటం వల్ల 30 నుండి 40 శాతం మేర విద్యుత్ ఆదా అవుతుందన్నారు. రాష్ట్ర విద్యుత్ రంగంలో ఏపీ ట్రాన్స్‌కో, జెన్ కో, డిస్కంలు, నెడ్ క్యాప్, సోలార్ పవర్ కార్పొరేషన్ గత మూడేళ్ళలో దాదాపు 20 ప్రతిష్టాత్మక అవార్డులు సాధించడం మన పనితీరుకు నిదర్శనమన్నారు. జాతీయ ఇంధన సంరక్షణ అవార్డులన్నింటినీ రాష్ట్ర ప్రజలకు అంకితం ఇస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు.

ప్రతిష్టాత్మక ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సృష్టించిందంటూ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కితాబివ్వడం మనకెంతో గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు సహా ప్రతి ఇంటికీ ఇంటర్నెట్‌ను అందించడం ద్వారా ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవనుందని రాష్ట్రపతి పేర్కొనడం మనకు లభించిన అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేసేందుకు అధికార యంత్రాంగం అహర్నిశలూ కృషిచేయాలన్నారు. గ్రామ పంచాయతీలన్నింటిలో 30 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలను అమర్చడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. దీనివల్ల గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడటమేకాకుండా ఏటా 333 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఆదా అవుతుందని, ఫలితంగా దాదాపు రూ. 200 కోట్లమేర ఆర్థిక లబ్ది చేకూరుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

ఇంధన సంరక్షణలో ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుందన్నారు. ఒక అంచనా మేరకు 1800 మిలియన్ యూనిట్లు విద్యుత్ పొదుపు చేయడం ద్వారా రూ.900 కోట్లు ఆదా అయ్యాయని, 4.5 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్‌డైఆక్సైడ్ ఉద్గారాలను తగ్గించగలిగామని వెల్లడించారు. అమెరికా ప్రభుత్వం భవనాలు, రవాణా, పారిశ్రామిక రంగాల్లో సమర్థ ఇంధన సంరక్షణ విధానాలను అవలంభించడం ద్వారా 2030 నాటికి 327 బిలియన్ డాలర్లు ఆదాచేయాలని, 400 మెట్రిక్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అలాగే మన రాష్ట్రంలోనూ మరిన్ని లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సీఎం సూచించారు. విద్యుత్ రంగంలో అమెరికాలాంటి అగ్ర దేశాల్లో వినియోగిస్తున్న ఆధునిక మౌలిక సదుపాయాలను ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అమరావతిలో అంతరాయంలేని, నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలన్నారు. ఇందుకోసం దాదాపు రూ. 16,383 కోట్లు వ్యయం కాగల ప్రణాళిక సిద్ధమైందన్నారు. ప్రపంచ శ్రేణి గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా నిర్మిస్తున్న అమరావతిలో ఎక్కడా ఓవర్ హెడ్ విద్యుత్ లైన్లు కనిపించడానికి వీల్లేదని, భూగర్భంలోనే లైన్లు వేయాలని సూచించారు.

సభ్యత్వ నమోదు ప్రారంభించిన జనసేనాధిపతి పవన్ కల్యాణ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్‌లోని పరిపాలన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలి సభ్యత్వాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం పార్టీలోని ముఖ్యు లకు ఆయన సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. సభ్యత్వ నమోదు కార్య క్రమం కోసం రూపొందించిన సాఫ్ట్ వేర్‌పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. త్వర లోనే రెండు రాష్ట్రాలలో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. గత పదేళ్ళకు పైగా తనను అనుసరిస్తున్న వారితో గత మూడు రోజులుగా విడతల వారిగా ఇష్టాగోష్టి సమావేశాలను పవన్ కల్యాణ్ నిర్వహించారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను వారికి వివరించారు. దీనితో పాటు రానున్న రోజులలో జనసేన నిర్వహించనున్న శిక్షణ శిబిరాల గురించి కూడా ఆయన చర్చించారు. జనసేన పార్టీకి స్పీకర్స్, కంటెంట్ రైటర్స్, అనలిస్టులు, సమన్వయకర్తలుగా పనిచేయ డానికి ముందుకు వచ్చిన వారిలో తొలత మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని నిర్ణయించారు. జనవరి మాసంలో ఈ వర్క్‌షాప్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలని ఈ సందర్భంగా తలపెట్టారు.

రేపటి నుంచి జన్మభూమి - మా ఊరు

పల్లెల్లో నవక్రాంతి

- 11 రోజుల అతి పెద్ద పండుగ
- స్వగ్రామాలకు తరలిరండి
- పుట్టిన నేల రుణం తీర్చుకోండి
- రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు



అమరావతి, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండుగ కంటే ముందుకు వస్తున్న నవక్రాంతి జన్మభూమి - మా ఊరు కార్యక్రమమని , ఇది 11రోజులపాటు కొనసాగే అతిపెద్ద పండుగగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. సంక్రాంతి పండుగ మూడు రోజుల సంబరమైతే , ఇది 11రోజుల వేడుకని, ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ వాసులు ఎక్కడున్నా తమ తమ స్వగ్రామాలకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దేశ, విదేశాలలోని తెలుగు వారందరికి ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రవాసాంధ్రులు పుట్టిన నేల రుణం తీర్చుకోని పల్లెల్లో నవకాంతులు నింపేందుకు కృషి చేయాలని కోరారు. రూ. 16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో 42నెలల క్రితం నవ్యాంధ్ర ప్రయాణం మొదలైందని, ఎన్నో దశాబ్దాలుగా నినాదంగా ఉన్నా నదుల అనుసంధానాన్ని దేశంలో తొలిసారి చేపట్టిన ఘనత సాధించామన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. కృష్ణానది ఎగువన ఉన్నా ప్రాజెక్టుల నుండి క్రిందకు చుక్క నీరురాని పరిస్థితుల్లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను ప్రకాశం బ్యారేజీకి తరలించామన్నారు. దీంతో కృష్ణా డెల్టాలో రూ. 18వేల కోట్ల విలువైన పంట ఈ మూడేళ్ళలో రైతుల ఇంటికి చేరిందన్నారు. సారవంతమైన గోదావరి జలాలతో కృష్ణా డెల్టా రైతులు అధిక దిగుబడులు సాధించారన్నారు. నదుల అనుసంధానం చేయడం వల్ల రైతాంగంలో ఎంతో ఆనందం కనబడిందని, ప్రకాశం బ్యారేజీ 60 ఏళ్ళ ఉత్సవంలో పాల్గొన్నందుకు తాను గర్విస్తున్నానన్నారు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉందని, అయితే తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్ల 3నెలల్లో సాధా రణ పరిస్థితికి వచ్చిందన్నారు. ఏడాది కాలంలో మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరించి దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. అశాస్త్రీయ విభజన వల్ల ఆరు దశాబ్దాల కష్టం వృథా అయిందని, అయినా మొక్కవోని ధైర్యంతో ఒక్కొక్క కష్టాన్ని అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పదాన నడుపుతున్నామన్నారు. ఏడాదిన్నర లోగానే తాత్కాలిక సచివాలయాన్ని నిర్మించడమే కాకుండా ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకువచ్చి సొంత గడ్డపై నుండి పరిపాలన ప్రారం భించిన అంశాన్ని గుర్తుచేశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రైతుల నుండి 33వేల ఎకరాలు భూ సమీకరణ ద్వారా చేశామని, రైతుల త్యాగం మరువలేనన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలో నెంబర్ వన్‌గా నిలిచిందని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ నెట్ కనెక్టివిటీ అందించాలన్న సంకల్పంతో ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టును ఇటీవల రాష్ట్ర పతి రామ్‌నాద్ కోవింద్ చేతుల మీదుగా ప్రారంభిం చిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రం లోటు బడ్జె ట్‌లో ఉన్నప్పటికీ తన పాదయాత్రలో రైతులకు ఇచ్చిన హామీకి అనుగుణంగా రుణమాఫీ చేశామని , అంతేకాకుండా 45లక్షల మందికి ఫించన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పారిశ్రామికంగా రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం తాను నిరంతరం శ్రమిస్తున్నానని, పటిష్ఠమైన వ్యూహం, కార్యాచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. తమ సంకల్పానికి, లక్ష్యానికి ప్రజలు సహకరించి ఆశీర్వదించాలని ముఖ్య మంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా కోరారు.

రైతులకు వరం... ప్రకృతి సేద్యం

- పద్మశ్రీ సుభాష్ పాలేకర్



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రకృతి వ్యవసాయం రైతుకు వరం లాంటిదని, సహజ వ్యవసాయంతో రైతుల పెట్టుబడులు తగ్గంతోపాటు దిగుబడుటు పెరిగి, ఆదాయం రెట్టింపు కావడంతోపాటు సమాజానికి ఎన్నో లాభాలున్నాయని ప్రకృతి వ్యవసాయ పితామహుడు పద్మశ్రీ సుభాష్ పాలేకర్ చెప్పారు. ఆదివారం వర్శిటీ ఎదురుగా ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయ శిక్షణా సదస్సుకు నేతృత్వం వహిస్తున్న పాలేకర్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా దేశంలోని వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ప్రపంచంలోనే ఇలాంటి సదస్సును ఏపీలో నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఏపీ ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. ప్రకృతి సేద్యం ఎన్నో ఒడిదుడుకులను అధిగమించిందన్నారు. ఈ వ్యవసాయం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. మానవ జీవితంలో కూడా మార్పులు తీసుకురానుందన్నారు. క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధులను నివారించవచ్చన్నారు. పాశ్చాత్య సంస్కృతి, వ్యవసాయం కారణంగా సాంప్రదాయ వ్యవసాయంతోపాటు మన సంస్కృతి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం ద్వారా భూసారం క్షీణించడంతోపాటు ఏడాదికేడాది ఖర్చులు పెరిగి దిగుబడులు క్రమేణా క్షీణిస్తున్నాయని వివరించారు. ప్రకృతి విపత్తులను తట్టుకొని ప్రకృతి వ్యవసాయం నిలుస్తుందన్నారు. ఉదాహరణకు ఈ ఏడాది బీటీ కాటన్ గులాబీ తెగులుతో పంట దెబ్బతిందన్నారు. అదే ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పత్తికి ఎలాంటి తెగుళ్లు సోకకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. దేశంలో జనాభా పెరిగిపోతోందని ఐతే అందుకు తగ్గట్టుగా ఉత్పత్తులు పెరగడం లేదన్నారు. రెట్టింపు ఉత్పత్తులను సాధించడంలో శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగాలు ఫలించక చేతులెత్తేశారన్నారు. ఈ తరుణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఉత్పత్తులు రెట్టింపు కావడంతోపాటు నాణ్యమైన పంటలతో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రకృతి సేద్యం చేస్తోన్న అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ దిగుబడులు పెరిగాయన్నారు. ఒంగోలు, పుంగనూరు తదితర జాతి ఆవు ద్వారా 30 ఎకరాల సేద్యాన్ని చేయవచ్చని చెప్పారు. ప్రకృతి సేద్యానికి అవసరమయ్యే ఆవులు ఇక్కడ లభించకపోతే వాటిని సరఫరా చేసేందుకు రాజస్థాన్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవచ్చన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా తక్కువ పెట్టుబడితోపాటు నీటి వినియోగం కూడా తగ్గుతుందని తెలిపారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 7 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆత్మహత్యల నివారణకు ప్రకృతి వ్యవసాయమే మార్గమన్నారు. సహజ సిద్ధమైన పంటలు ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుంటాయన్నారు. ప్రతి మండలానికి ఒక బీజ గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడ ఉత్పత్తి అయిన విత్తనాలను మండలంలోని గ్రామాల రైతులకు పంపిణీ చేసి తద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించవచ్చని వివరించారు. సహజ నీటి వనరుల వినియోగం పెరగాలని సూచించారు. జడ్బీఎన్ఎఫ్ చాలా పెద్ద అంశమనీ, శిక్షణ పొందడానికి వచ్చిన వారు క్రమశిక్షణతో వ్యవహరించి ఈ 9 రోజుల శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పాలేకర్ సూచించారు. ప్రపంచంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి సేద్యంపై ఆసక్తి కనబర్చడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పుల వలన ప్రకృతి సేద్యం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి రైతు ప్రకృతి సేద్య విధానాన్ని అమలు చేస్తే రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ సేద్యంలో ఆదర్శంగా నిలుస్తుందని పాలేకర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలేకర్‌ను రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ సలహాదారునిగా ప్రకటించి శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.

ప్రకృతి సేద్యంతో భారీ దిగుబడి

- మారిషస్ హై కమిషనర్ జగదీశ్వర్ గోవర్ధన్



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రకృతి వ్యవసాయం రైతులకు జీవనాధారం వంటిదని మారిషస్ హై కమిషనర్ జగదీశ్వర్ గోవర్ధన్ అన్నారు. వర్శిటీ ఎదురుగా ఆదివారం జరిగిన ప్రకృతి వ్యవసాయ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెగా శిక్షణా శిబిరం ప్రపంచానికే ఆదర్శమన్నారు. వ్యవసాయం రంగంలో మార్పు దేశానికి, రాష్ట్రానికి శుభ సూచకమన్నారు. శూన్య పెట్టుబడి ప్రకృతి వ్యవసాయం కంటే మించింది ప్రపంచంలో ఎక్కడాలేదన్నారు. తాను కూడా రైతుననీ, అరెకరంలో జడ్బీఎన్ఎఫ్ ద్వారా రెండు మిలియన్ల ఆదాయాన్ని సంపాదిస్తున్నామన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా చెరకు అలాగే వ్యవసాయ ఉత్పత్తులు, దిగుబడులు ఆశించిన స్థాయి కంటే భారీగా ఫలితాలు వచ్చాయని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకృతి సేద్యాన్ని రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరడగమే కాకుండా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండే అవకాశాలున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఆత్మహత్యలు అరికట్టవచ్చని సూచించారు. మహాత్మాగాంధీ, వినోభావే వంటి మహనీయులు గోఆధారిత వ్యవసాయాన్ని ఎప్పుడో సూచించడం జరిగిందన్నారు. ఒక్క ఆవుతో వచ్చే మూత్రం, పేడ తదితరాలతో 30 ఎకరాలను సేద్యం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం గురించి అగ్రికల్చర్ బీఎస్సీ చదివిన వారికి కూడా తెలియకపోవడం విచారకరమన్నారు. మారిషస్‌లో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆర్థికాభివృద్ధి రెట్టింపు అయిందన్నారు. జీడీపీ 300 నుంచి 10 వేలకు పెరిగిందని చెప్పారు. ఆవు కామధేనువు లాంటిదనీ, గోవును పూజించడం ద్వారా సర్వత్రా క్షేమకరమని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. ఆవులను ప్రేమించండి, సేవ చేయండి, సంపన్నులు కాండంటూ పిలుపునిచ్చారు.

పాలేకర్ సూచించిన విధానమే వ్యవసాయ రంగానికి దిక్సూచి లాంటిదన్నారు. మారిషస్ నుంచి ప్రకృతి వ్యవసాయం శిక్షణ పొందేందుకు యూపీకి రావడం జరిగిందన్నారు. 150 ఏళ్ల క్రితం తమ కుటుంబం ఆంధ్రప్రదేశ్ నుంచి మారిషస్ వ్యవసాయం నిమిత్తం వలస వెళ్లి, అక్కడ స్థిర పడినట్లు గత స్మృతులు నెమరు వేసుకున్నారు. దక్షిణాఫ్రికాలో ప్రకృతి సేద్యాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో మారిషస్ ముందంజలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సేద్యం అమలైతే భారత్‌లోనే ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేసిన రాష్ట్రంగా నిలుస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని ఈ సందర్భంగా అభినందించారు.

రైతు సంక్షేమానికి రూ.3 వేల కోట్లతో కార్పస్ ఫండ్

- ప్రజా సంకల్ప పాదయాత్రలో జగన్



తిరుపతి, ప్రభ న్యూస్‌బ్యూరో: రాష్ట్రంలోని రైతాంగానికి అన్నివిధా లా ఆసరాగా నిలిచేందుకు తమపార్టీ అధికారంలో రాగానే రైతుల సంక్షేమానికి రూ. 3 వేల కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్ తన పాదయాత్రలో ఆదివారం రైతాంగానికి హామీ ఇచ్చారు. చిత్తూరు జిల్లాలో కొనసాగిస్తున్న ప్రజా సంకల్ప పాదయాత్రను మూడో రోజు కూడా తంబళ్లపల్లె నియోజక వర్గంలోనే కొనసాగించారు. ఉద యం మూలపల్లె క్రాస్ వద్ద ప్రారంభించిన యాత్రను ఎద్దులవారిపల్లె వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన జగన్ రామిగానిపల్లె, తిమ్మయ్యగారిపల్లెల మీదుగా ముదివేడు వరకు దాదాపు 20 కిలోమీటర్ల కొనసాగించారు. తొలి రెండు రోజులు లాగే తంబళ్లపల్లె ప్రాంత ప్రజలు విశేష సంఖ్యలో జగన్ పాదయాత్రకు స్వాగతం పలికారు. కన్నెమడుగు, దారంవారిపల్లె, ముదివేడులలో జగన్ పార్టీ వర్గా లు ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించి నివాళులర్పిం చారు. కస్తూర్బా పాఠశాలల ఉద్యోగులు మూలపల్లెలో జగన్‌ను కలిసి ఏళ్ల తరబడి పనిచేస్తున్నా తమను రెగ్యులర్ చేయడంలేదని వాపోయారు. అక్కడున్న రైతులందరూ టమోటో పంట కు సంబంధించిన సమస్యలను వివరించారు. దాదాపు 20 కిలోమీటర్ల దూరం కొనసాగిన మూడో రోజు ప్రజా సంకల్ప పాద యాత్రలో జగన్‌తో పాటు తంబళ్లపల్లె నియోజక వర్గ పార్టీ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి ద్వారక నాథరెడ్డి తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఇక జనవరి 1వ తేదిన నాలుగో రోజు పాదయాత్రలో భాగంగా ఉదయం నల్లగుట్టపల్లె గుండా మదనపల్లె నియోజకవర్గంలో ప్రవేశించనున్న జగన్ మధ్యాహ్నం పైన సిటిఎం క్రాస్ రోడ్ వద్ద బహి రంగ సభ నిర్వహించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

చిత్తూరు జిల్లాలో వైకాపాకు భారీ షాక్

- సీఎం చంద్రబాబుతో మాజీ జడ్పీ చైర్మన్ సుబ్రహ్మణ్యం భేటీ
- టీడీపీలో చేరేందుకు సుముఖత

అమరావతి, ఆంధ్రప్రభ: చిత్తూరు జిల్లాలో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన మాజీ జడ్పీ చైర్మన్, వైకాపా నేత సుబ్రహ్మణ్యం తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై కుప్పం నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా మూడుసార్లు పోటీ చేసి ఓడిపోయిన సుబ్రహ్మణ్యం అధికార పార్టీ గూటికి చేరాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. జనవరి 13 నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబంతో సహా సంక్రాంతి సంబరాలు జరుపుకునేందుకు నారా వారి పల్లె వెళ్ళనున్నారు. ఈ పర్యటనలో సుబ్రహ్మణ్యం తన ముఖ్య అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం


మరో సంవత్సరం

గత సంవత్సరంలో ఏమీ చేయనందుకు
కాలదేవతకు క్షమాపణ చెప్పాలి
గత చరిత్ర, పునాది
ఎడారి ఇసుకలో నడుస్తున్నట్లు
సడలిపోతున్నాయి
చెప్పేవారి మాటలు వినం
పెద్దలు చూపే మార్గం కనం
అంతా నిర్గమం
అన్ని హక్కులూ కావాలి
బాధ్యతలు మనకెందుకని
ఎన్నాళ్ళు మనగలం
ఇన్నాళ్లూ ఏ దేవుడో మోసుకొచ్చాడు.
ఇకనైనా నా కాళ్లమీద నిలబడి
వడివడిగా కృషీవలుణ్ణి అవుతాను
సంస్కారమంటే తోటి మనిషిని
గౌరవంగా చూడడం, సాయపడడం
అవి యికనైనా నేర్చుకుంటా.
నావంతు శ్రమను అభివృద్ధి యజ్ఞానికి
సమిధగా సమర్పిస్తాను.
క్రొత్త ఘడియ క్రొత్త వెలుగుకు
నాంది పలకాలి
స్వర్ణ భారత సంస్కృతి
దేశమంతా వుప్పొంగాలి.
ఏ మతమైనా ధర్మ ప్రపంచాన్ని తీర్చిదిద్దాలి.
నూతన సంవత్సరమా
ఇదే నా ప్రతిజ్ఞాపూర్వక స్వాగతం
సుస్వాగతం
అందరికీ శుభం శుభం.

- ఎ.ఎస్. ప్రభాకర్
9963887346



2017 సాహితీ వీచికలు



అనంత ప్రవాహంలా సాగిపోయే కాలవాహినిలో మరో వత్సరం కరిగిపోయింది. నిన్నలలో కలిసిపోయింది. కొన్ని మధుర జ్ఞాపకాలను, కొన్ని దు:ఖ సందర్భాలను మిగిల్చి వెళ్లిపోయింది. తెలుగు సాహిత్యపరంగా అవలోకిస్తే 2017లో కూడా అలాంటి సంఘటనలే తారసిల్లాయి. ఏ కాలంలోనైనా సాహిత్యం పురోగమన దిశగానే కదులుతుంది. కొండకచో అధ్యయన లోపాల వల్లనైతేనేమి, మరోకారణం చేతనైతేనేమి కొంత గాఢత తగ్గిన కోణాలు దర్శనమిస్తే ఇవ్వవచ్చునుగాక. దానిని అలా వదిలేస్తే సంక్షుభిత వేగవంత సమాజంలో సదవగాహన కలిగించే సాహిత్యం మెండుగానే వెలువడిందని చెప్పవచ్చు. అట్లని అంతా పూర్తి పరిణతి చెందిన సాహిత్యమే తెలుగులో వెలువడిందని బల్లగుద్ది చెప్పే ధైర్యం లేదు. కాని, సమకాలీన సంక్లిష్టతను, పోటీ ప్రపంచాన్ని, మానవీయ విలువల్ని, విశ్వమానవ తాత్వికతను, అర్థం చేసుకోవడానికి కొంతవరకు ఉపకరించే సాహిత్యం 2017 సంవత్సరంలో తెరమీద నిలిచిందనటంలో ఎట్టి సందేహం లేదు. కదిలే కాలమెప్పుడు చీకటి వెలుగుల సందోహం. ఇట్టికాలంలో కలిసి నడిచేదే పాఠక మన్ననలను చూరగొనే సాహిత్యంగా భావించవచ్చు. 2017వ సంవత్సరంలో సాహిత్యంలోని సంఘటనా పరంపరలను ఒకసారి పరిశీలిస్తే అనేకానేకం మనముందు ఆవిష్కృతమవుతాయి.


కాలచక్రంలో ఓ పేజీ

మూగబోయిన కలం గళాలు




డా॥సి.నారాయణరెడ్డి

సాహితీశిఖరం. కవిత్వాన్ని శ్వాసగా పీల్చిన మహాకవి తుదిశ్వాస విడిచింది 12.6.2017న. విశ్వంభర తత్త్వాన్ని వెలువరించి జ్ఞానపీఠమెక్కిన సినీపాటల రేడు, సి.నా.రె. చివరి పుస్తకం (కవిత్వం) ''కలం అలిగింది''. ఇందులో ''మృత్యువు కోరుకున్న కౌగలింతల అనే కవితలో ''కొన్నాళ్లుగా/నన్ను కౌగిలించుకోవాలని ఉందని/ మృత్యువు కబురు పంపుతున్నది/ సుదీర్ఘ కాల జీవన పథగామిగా/ జీవించవలసిన నేను/ మృత్యువు కపట కాంక్షను/ కాదనకుండా ఎట్లా ఉంటాను'' అంటారు. అప్పుడే గ్రహిస్తాడు కవి ''కలం/ నాకరతలం మీద అలిగింది/వారం, పదిరోజులుగా/ కరాంగుళులు/తనను ముట్టుకోవటం లేదనీ/...లేఖిని/ నాచేతివేళ్లలోనికి చొరబడి/ చిరాకును ప్రదర్శించింది'' అంటారు. కవిత రాయకపోతే నిద్రపట్టని కవి. మృత్యుచ్ఛాయల్ని ముందుగానే పసిగడతాడు. కవిత్వం ధారాళంగా వచ్చేది ఆగిపోతుందంటే తన శ్వాస ఆగిపోవడానికి ఎంతోకాలం లేదనే సత్యాన్ని కవి గ్రహిస్తాడు. తనను తాను తెలుసుకున్న ప్రపంచాన్ని లోతుగా అవగాహనించుకొన్న మహాకవి సి.నా.రె. నిత్యనూతనంగా ఉండే తన సాహిత్యాన్ని తెలుగు పాఠక లోకానికి అందించి వెళ్లారు.




చిత్తజల్లు వరహాలరావు

ప్రముఖ రచయిత సి.వి. అనబడే ''చిత్తజల్లు వరహాలరావు'' నవంబరు నెల 8వతేదీ కన్ను మూశారు. ఈయన శాస్త్రీయ సామ్య వాద కవి. సాంఘిక విప్లవకారుడు. పరిశోధ కుడు, సాహిత్య విమర్శకుడు. ఈయన మన ప్రజా స్వామ్యాన్ని అధిక్షేపించిన విధం''ఆధునిక ప్రజాస్వామ్య మొక పొద్దుతిరుగుడు పువ్వు/ఆధునిక ప్రజాస్వామ్య మొక సానిదాని నవ్వు/ ఆధునిక ప్రజాస్వామ్యమొక ప్రాస్టిట్యూట్/ ఓటుదాని గేటుకి చెల్లించే రేటు'' అంటూ ప్రజాస్వామ్యం డబ్బున్నవాళ్ల చుట్టంగా అభివర్ణించారు''.



డా ॥వి. చంద్రశేఖరరావు

కథను రూపసౌందర్యంగా, మార్మిక శక్తిగా, సమకాలీనంగా ప్రాచీనస్మృతిగా, వినిర్మాణ రూపంగా మార్చుకొని సత్యాన్వేషణను గురించిన ఒక ఎరుకను చెప్పేందుకు ప్రయత్నించిన కథకుడు, పోస్ట్‌మోడ్రనిస్ట్ నవలగా ఐదు హంసలు, రాసిన నవలా రచయిత, జూలై ఎనిమిదవతేదీ 2017లో మరణించడం తెలుగు సాహిత్య రంగానికి పెద్దలోటుగా భావించారు.



ధేనువకొండ శ్రీరామమూర్తి

కవిత్వాన్ని జీవితానికి అన్వయింపజేసి ఒక గొప్ప తాత్విక ప్రపంచాన్ని ఆవిష్కరింపజేసిన కవి ధేనువకొండ శ్రీరామమూర్తి. తెలుగు సాహిత్యలోకానికి కన్నీరు మిగిల్చి, కవితా సామాగ్రిని తన సాహితీవారసులకప్పగించి వెళ్లిపోయిన కవి ధేనువకొండ.

ఖాదర్ షరీఫ్

''మనసులు విచ్చుకున్న మనుషులు కావాలి/ పరవశంగా పాడుతూ తిరుగాడుతున్నవాళ్ళు/ హృదయం మొత్తం ప్రేమని నింపుకుని/ అక్కడా ఇక్కడా ఎక్కడా అనిలేదు/ ఎక్కడపడితే అక్కడ మనుషులుగా పాతబడిన వాళ్లైనా పర్వాలేదు/శరీరాన్ని హాయిగా ధైర్యంగా తేలికగా/ విసర్జించి నవ్వుతూ ఎగరగలిగినవాళ్లు కావాలి/ అంటూ'' మానవ ప్రపంచం కోసం కవిత రాసిన యువకవి ఖాదర్ షరీఫ్ ఈ నెల 25న అకాలమరణం చెందడం ఎందరో సాహితీవేత్తల్ని కలసివేసింది.

2017 సాహిత్యరంగంలో లక్ష్యశుద్ధి, మార్గశుద్ధి గల మేధావులైన కవుల్ని కొందర్ని కాలగర్భంలో కలిపి కన్నీటిని మిగిల్చింది. ఇదొక చీకటి కోణం. అట్లాగే తెలుగు సాహితీవేత్తలు భారతదేశం స్థాయి అవార్డులు పొంది తెలుగు పాఠకలోకానికి ఆనందాన్ని చేకూర్చారు. ఇదొక వెలుగుకోణం.

తెలుగు సాహిత్యరంగంలో ఈసంవత్సరం ఆనందం వెదజల్లే సంగతులు లేకపోలేదు. ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారికి మూర్తిదేవి పురస్కారం రావడం, ప్రముఖ కవి కె.శివారెడ్డికి కబీర్ సమ్మాన్ పురస్కారం, గంగాధర్ మోహన్ అవార్డు రావడం, దేవిప్రియకు కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం కవిత్వానికి రావడం,

కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహిత రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ''విశ్వనరుడు జాషువా'', యన్.గోపి సాహిత్య అనుశీలన, గ్రంథాలను వెలువరించారు. ఆచార్య జి.ఎన్.రెడ్డి పీఠికలు గ్రంథానికి సంపాదకత్వం వహించారు. ప్రజాశక్తిబుక్ హౌస్ వారు ప్రచురించిన వేమన మీద రాసిన వ్యాసాలకు సంపాదకత్వం నెరిపారు. వేమన మీద ఎన్నో పుస్తకాలు వెలువరించిన ప్రజాశక్తి బుక్‌హౌస్‌వారు అభినందనీయులు. డా॥సి.నారాయణరెడ్డిగారి మీద దాదాపు 13వ్యాసాలు రాశారు. మార్క్సిస్టు దృక్పథంతో వ్రాసే వీరి విమర్శ సగటు పాఠకుల్లో సైతం ఆలోచనలను రేకెత్తిస్తాయి.

డా॥ పాపినేని శివశంకర్ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. ఈయన మంచి కవి, కథకుడు, విమర్శకుడు. త్రిగుణ సమ్మిళితమైన వీరి ఆలోచన ధారతో మారుతున్న కాలానికి అనుగుణమైన నూతన ధార్మిక నైతిక విలువలను ప్రతిపాదిస్తూ ఉదాత్త లక్ష్యంతో ముందుకు సాగుతున్న సాహితీవేత్త శివశంకర్. వీరి కవిత్వంలోను, కథ ల్లోను స్త్రీ గౌరవానికి పెద్దపీట వేశారు. వారి స్వేచ్ఛను ఆకాంక్షించారు.

డా॥కత్తి పద్మారావు దళితవాదమే తన నినాదంగా కలం పట్టినవాడు. మడమ తిప్పని పోరాటాలకు మారుపేరైనవాడు. ''ఈ యుగం మాది'' అంటూ దళిత మహాకావ్యాన్ని వాసిగా రాసినవారు. దళిత ఉద్యమ కేకకు నాంది ప్రస్తావనైనవాడు. అణగారిన ప్రజల మూగభాషను కవిత్వంగా ఉక్కునాలికతో సంభాషిస్తూ, వారికి, సామాజికంగా, సాంస్కృతికంగా తాత్త్వికంగా నాయకత్వం వహించే శక్తినిచ్చే కవిత్వానికి అంకురార్పణ చేస్తూ ''ఈ యుగం మాది'' అనగలిగాడు.

కవిత్వం సమాజానికి అద్దం పట్టినట్లు రాసే కవుల్లో ఒకరుగా పేర్కొనదగినవారు శిఖామణి. దళిత నేపథ్యంతో సామాజిక స్థితిగతుల్ని పీడిత తాడిత జనాల ఆక్రందనల్ని అర్థం చేసుకుంటూ వారిని చైతన్యపరచి కనువిప్పు కలిగించే కవిత్వం రాస్తున్నవారు శిఖామణి. వీరు కవిగా, విమర్శకులుగా, పత్రికా సంపాదకునిగా ఎంతో అనుభవం గడించారు. కవిత్వంలో ఎక్కడో వోచోట ''నాస్టాల్జియా'' రాస్తూ కవిత్వాన్ని పండించే కవీయన.

''ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్'' ''సాహిత్య ప్రకా శము'' అనే వ్యాస సంపుటిని విడుదల చేశారు. ఇందులో ఉన్న వ్యాసాలన్నీ నిర్ధారిత వాస్తవాలుగా చూపెట్టారు రచయిత. వారి వాదనకు దగ్గ ఆధారాలు కూడా ఎత్తి చూపడానికి యత్నించారు తనదైన భావజాలానికి దగ్గరగా ఈ వ్యాసాలు మలచుకున్నారు శివప్రసాద్‌గారు.



హైదరాబాద్‌లో ఈమధ్య జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు ఏభైకోట్ల బడ్జెట్టుతో అట్టహాసంగా జరిగాయి. వేలమంది సభికులు, వందలమంది కవులు పాల్గొన్నారు. సాహిత్య సంబరాలకు వేదికగా హైదరాబాదు నిలిసింది. రాష్ట్రం నుండి రాష్ట్రేతర ప్రాంతాల నుంచి ప్రేక్షకులు హాజరయ్యారు. ఇతర దేశాల నుంచి కూడా వక్తుల, ప్రేక్షకులు వచ్చారు. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 'ప్రపంచ తెలుగు మహాసభలు' ముఖ్యమంత్రి కె.సి.ఆర్ అనుకున్న రీతిలో జరిగాయి.

కవి శిరోమణి ఆచార్య రావికంటి వసునందన్ ''విశ్వకవి సినారె స్మృతిలో...అనే తన జ్ఞాపకాల సంపుటిని వెలువరించారు. సి.నా.రెకు తనకు గల పరిచయాన్ని ఎత్తిచూపారు. అట్లే ''అమ్మవ్వ- గోడ గూచి'' అనే పద్యకావ్యం వెలువరించారు. ఇందులో అమ్మగొప్పతనాన్ని అద్భుతంగా ఛందోబద్ధ పద్యంలో ఆవిష్కరించారు.

'యక్కలూరి (వై) శ్రీరాములు' కలం నుండి 'ఐదు గంటల వాన' జాలువారింది. ఇందులో రైతు వెన్నుతో దిగిన కరువు కోరలు కైతలుగా మారాయి.

కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి సాహిత్య విమర్శనా వ్యాసాలు పలు పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ''హాలికుల పక్షాన అక్షరసేద్యం''సేద్యం క్షతగాత్రమయిన విధం చెప్పింది. వ్యవసాయాన్ని పాలకులు ఏవిధంగా సంక్షోభంలోకి నెట్టివేస్తుందో ఇందులో చర్చించడం జరిగింది. అట్లే వీరి కలం నుండి ''వాకిలి తెరవనివాన'' కవితా సంపుటి వెలువడింది.

ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు బి.హనుమారెడ్డి ''రెడ్డి వైభవం''అ నే పుస్తకాన్ని ''రిజర్వేషన్లు అనే పుస్తకాన్ని ప్రచురించారు. రెడ్లలో వున్న యోధుల్ని, సంఘసంస్కర్తల్ని, రాజకీయ ప్రముఖుల్ని, సేవాప్రముఖుల్ని, దాతృత్వ ప్రముఖుల్ని, సాహిత్యరంగ ప్రముఖుల్ని విద్యారంగ ప్రముఖుల్ని, సినిమారంగ ప్రముఖుల్ని, పత్రికారంగ ప్రముఖుల్ని, కళారంగ ప్రముఖుల్ని, అవధూతగా మారినవారిని ఎత్తిచూపారు.

ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నమ్ గారు ''ముందడుగు'' అనే కవితా సంపుటిని వెలువరించారు. ఇందులో 60 కవితలున్నాయి.

ప్రతి సంవత్సరం సాలు తప్పకుండా కవితా సంపుటిని ప్రచురించే అక్షరజ్వాల ఆశారాజు. వీరికవిత్వం బహుళంగానే పత్రికల్లో ప్రచురితమౌతుంటాయి. వీరు నిశ్శబ్దంగా ప్రవహించే నిండునదిలాంటి కవి. భావగర్భితమైన పదబంధాలు కోకొల్లలుగా వీరి కవిత్వంలో కనిపిస్తాయి.

మహారాష్ట్రతెలుగు రచయితలసంఘం ముంబయి వారు 'మాకు మేమే'' అనే కవితల, కథల సంకలనాన్ని తెచ్చారు. ది బొంబాయి ఆంధ్ర మహాసభ అండ్ జింఖానా వారి ఆధ్వర్యంలో సంగినేని రవీంద్ర గైడ్‌లైన్స్‌తో పుస్తకం ప్రచురించారు. ఇందులో తెలుగు భాషను బతికించుకునేందుకు పొరుగు రాష్ట్రంలో స్థిరపడ్డ తెలుగువారి ఆవేదన, ఆరాటం, పోరాటం కనిపిస్తూ కవితలు కథలు నడిచాయి.

సి.హెచ్.వి. బృందావనరావు ''కాలాన్నై ప్రవహిస్తూ'' అనే కవితా సంపుటిని ప్రచురించారు. లోకానుభవం గల బృందావనరావుగారికి జీవితం పట్ల స్పష్టత కనిపిస్తుంది. కవిత్వాన్ని సంబంధించిన క్షేత్రజ్ఞానం, కళాదృష్టి వీరిలో మెండుగా ఉంది. మంచి కవిత్వం రాశారు. ''సాహితీ సుగంధం'' వ్యాస సంపుటి వెలువరించిన డా॥పి.వి.సుబ్బారావు గొప్ప విమర్శకులు. ఈతకోట సుబ్బారావు, పెరుగు రామకృష్ణ అద్భుతమైన కవిత్వాన్ని సృష్టిస్తున్నారు. పుస్తకాలుగా వెలువరిస్తున్నారు.

ఒరిస్సా బరంపురంలో వుండే విజయచంద్ర ''ఊదారంగు కలలు'' అనే కవితా సంపుటిని వెలువరించారు. వీరు మార్క్సిస్టు దృక్పథంలో కవితలల్లుతారు.

బరంపురంలో నివసించే కవయిత్రి డా॥తుర్లపాటి రాజేశ్వరి. ఈమె బరంపురం తెలుగు కవుల సమాచారాన్ని నాటకంగా రాశారు. ఈమె కలం నుండి కవిత్వం, విమర్శ, అనువాదం, కథలు వెలువడ్డాయి. ఒరిస్సాలో తెలుగుకు ఎనలేని సేవలందించేవారిలో ఈమె ఒకరుగా పేర్కొనవచ్చును. వ్యంగ్య కథలు రాస్తున్నవారిలో జంధ్యాల రఘుబాబు నేడు ప్రధానంగా కనిపి స్తున్నారు. వీరి మంచి కవి కథకుడు. ''మల్లెతీగ'' పత్రికలో కాలమిస్టుగా వీరు వ్యంగ్య కథలు రాస్తున్నారు. చుండూరి శ్రీనివాసరావు ''కవితాకెరటాలు'' చిక్కని కవిత్వాన్ని అందించింది.

పొరుగురాష్ట్రమైన చెన్నైలో వుంటూ డా॥తూమాటి సంజీవరావు తెలుగుకు ఎంతో సేవ చేస్తున్నారు. వీరు ''చెన్నై తెలుగు ప్రకాశం మాసపత్రిక నడుపుతున్నారు. ముఖ్యంగా వీరు ఒక బృహత్ కావ్యం ఈ సంవత్సరం నిర్వహించారు. ''తెలుగు సాహిత్యంలో దేశభక్తి'' (స్వాతంత్ర్య సప్తతి-నవతి వ్యాససంపుటి) ని దాదాపు 90మంది రచయితల వ్యాసాల సంకలనంగా తీసుకొచ్చారు సంజీవరావు. వీరిలో 27మంది రచయిత్రులు ఉన్నారు. 800 పేజీల గ్రంథమిది. దీనిని డా॥సి.నారాయణరెడ్డి గారి స్మృతికి అంకితం చేశారు.

కెంగార మోహన్ మంచి కవి, వ్యాస రచయిత. వీరి వ్యాసాలు సాహిత్య ప్రస్థానంలో వస్తుంటాయి. వీరి వ్యాసాల్లో నిశిత పరిశీలన, వస్తు సాంద్రత తీవ్రంగా ఉంటుంది. సాబిర్ కవిత్వం ''ఒక దేశద్రోహి ప్రేమకథ'' కొత్త పుంతలు తొక్కింది.

సాకం నాగరాజు, కోట పురుషోత్తం సంపాదకీయంలో 'నల్లారన్న'' జీవితచరిత్ర వెలువడింది. కళారంగంలో అవిరామకృషి చేస్తున్న ఉద్యమ కళాకారుడు నల్లూరి వెంక టేశ్వర్లు. వీరి జీవితం కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకమైన వ్యక్తిగా కొనసాగుతుంది. వీరు మంచితనానికి మారుపేరు. అందుకే వీరిని అంతా ''అన్నా'' అని పిలుస్తారు. అందుకే వీరి జీవిత విశేషాలకు ''నల్లారన్న'' అనే పేరు పెట్టారు.

కథకులు ఓల్గా, శిలాలోలిత, నల్లూరి రుక్మిణి, పెళ్లకూరి జయ ప్రద, వి. ప్రతిమ, సత్యవతి, చిల్లర భవానీదేవి, సునీత గంగ వరపు, జ్వలిత, కథలు కథానికలు వెలువడ్డాయి. అన్నీ స్త్రీల అణచివేతను వ్యతిరేకిస్తూ చైతన్యాన్ని పురి గొల్పేవి గానే ఉన్నాయి. నేటి స్త్రీ ఏవిధంగా మార్పు చెందాలో వీరి కథలు ఆవిష్కరిస్తాయి. శాంతి వనం మంచికంటి గబ్బగీతిక నవల మట్టి మనుషులను గూర్చి, వారి నిత్య జీవిత సంఘ ర్షణలను గూర్చి, వారి వలసల గూర్చి సవివ రంగా విశదపరుస్తుంది.

''శ్రీరామకవచం సాగర్'' నవల 'అవస్థ' ఆధునికానంతర వాదాన్ని ఎత్తిచూపే నవల. ఇది సీరియస్‌గా ''నవమల్లెతీగ'' మాసపత్రికలో ప్రచు రితమౌతుంది. డా॥రాధేయ రాసిన ''అవగాహన'' 10మంది వర్తమాన కవులను గూర్చి చర్చించింది. డా॥యం.బి.డి.శ్యామల ''రెండు సంధ్యల నడుమ'' కవితా సంపుటి 55 కవితలతో వెలువడింది.


''చెదరని శి(థి)లాక్షరాలు'' మంజు కవిత్వాలు క్లుప్తంగా లోతైన భావాలతో ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి. ''ఇలా రువ్వుదామా రంగులు అనే కవితా సంపుటిలో ''విజయ్ కోగంటి'' నూతన అభివ్యక్తికి దారులు వేశాడు. కొత్తవస్తువు, కొత్తభాష, కొత్త అభివ్యక్తి ఇందులో గమనించవచ్చు. ''చివుళ్లతో పూసిన ఆ అడవికి తయారీ రంగుల పిట్ట 'కూవూ' అని పేరు పెట్టింది అంటారు ఒక కవితలో.

బొర్రా గోవర్ధన్ ''అంకురం'' అద్భుతమైన బౌద్ధవ్యాసాల సమాహారం. సభ్యులు కన్వీనర్ దిగిపోయి 2018 నుండి 2022 వరకు కేంద్రసాహిత్య అకాడమీ సభ్యులుగా కొత్తవారిని నియమించడం జరిగింది. ఉభయ రాష్ట్రాలలో మొత్తంమీద ఐదుగురు సభ్యులు ఎన్నుకోబడ్డారు. 1. వాసిరెడ్డి నవీన్, 2. డా॥రాచపాళెం చంద్రశేఖరరెడ్డి 3. బన్న ఐలయ్య, 4. శ్రీయస్.వి. రామారావు 5. కె. శివారెడ్డి. వీరు తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యాభివృద్ధికి తోడ్పడతారు.

ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు ముగ్గురు మాత్రమే సభ్యులు ఉండేవారు. కాని ఇప్పుడు రెండు రాష్ట్రాల మీద ఐదుగురు సభ్యుల్ని నామినేట్ చేశారు. వీరి పదవీకాలం ఐదు సంవత్సరాలుఉంటుంది. ఈ నిర్ణయాన్ని 20-12-2017న ఢిల్లీలో జరిగిన కేంద్ర సాహిత్య అకాడమి సాధారణమండలి సమావేశంలో తీసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఐక్యతతో ఉంటే భాషాభివృద్ధి అంత చక్కగా జరుగు తుంది. ఉభయ రాష్ట్రాల్లో సంఘాలు, సమావేశాలు ఈ సంవత్సరం ఎక్కువగానే జరిగాయి. తెలంగాణా రచయితల సంఘం, తెలంగాణలో ఏర్పడితే, ఆంధ్రా రచయితల సంఘం ఆంధ్రాలో వెలిసింది. అట్లే ప్రభుత్వాలు ఉభయ రాష్ట్రాల్లో సాహిత్యానికి కొన్ని సేవలు అందిస్తున్నాయి. ఇంకా ఎందరో వారి కవిత్వాన్ని, కథల్ని, వ్యాసాల్ని, సంపుటాలుగా తీసుకు వచ్చారు. ''అన్నింటిని పరిశీలించే, సమీక్షించే వీలు దొరకలేదు. నా దగ్గర ఆ పుస్తకాలు లేవు గనుక. ఏది ఏమైనా 2017 సంవత్సరం సాహిత్య రంగంలో ఘననీయమైన ఎదుగుదలను తెచ్చింది. కవులు రచయితలు చాలా సువిశాలమైన దృక్పథంతో, ఆలోచిస్తూ సమసమాజ నిర్మాణం కోసం పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాబోయే 2018 సాహిత్యలోకానికి ఎనలేని ఎదుగుదలను ప్రసాదిస్తుందని ప్రపంచ సాహిత్యంతో మన తెలుగు సాహిత్యం పోటీకి నిలబడే విధంగా కవులు, రచయితలు వారి రచనలు చేస్తారని ఆశిద్దాం.

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
9948774243

పురస్కారాల ఆణిముత్యాలు



కొలకలూరి ఇనాక్

కవి, కథకుడు, ప్రముఖ విమర్శకుడు కొలకలూరి ఇనాక్ ''విశాల శూన్యం'' అనే కవితలో చెట్లను నాశనం చేయడం వలన కలిగే అనార్థాలను ఎత్తి చూపుతూ ''చెట్లను రంపం, ముక్కలు చేస్తే/ గుట్టలుగా శవాలు/ అంత్యక్రియలు చూడలేక/ మబ్బులు ముఖం తిప్పుకొంటే/నింగినీరవమైతే/నేలమొక్క పాదులో దాక్కొంది/ ప్రాణి నిశ్వాసను పీల్చి/ ఉచ్ఛ్వాసనిచ్చే/చైతన్యం నశిస్తే/ కల్తీగానే దిక్కు/మునుపు చెట్టుండే చోట/ ఇప్పుడు పెద్దబయలు ఉండి/ విశాల శూన్యం/పైగా మరణం వంటి నిశ్శబ్దం/ఎలా భరించడం!'' అంటారు.




డా॥యన్.గోపి

నేడు సాహిత్యరంగంలో నిత్యం కవిత్వం రాసేకవి డా॥యన్.గోపి. ప్రతివారము ఏదో ఒక పత్రికలో వీరి కవిత కనిపిస్తూనే ఉంటుంది. వీరి కవిత్వానికి ఈ సంవత్సరం బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ స్ఫూర్తి అవార్డు వచ్చింది. ఇది తెలుగు రెండు రాష్ట్రాల్లో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు. ఈ అవార్డు సందర్భంగా ఎన్.గోపి సాహిత్య స్ఫూర్తి అనే వ్యాసమాలిక వెలువరించబడింది. ఇందులో సీతారం, కొండ్రెడ్డి, సి.భవానీదేవి, అన్నవరం దేవేందర్, డా॥ఎన్.రఘు, కాటూరు రవీంద్ర, త్రివిక్రమ్, సుంకిరెడ్డి, మెట్టా నాగేశ్వరరావు, ఎం.నారాయణ శర్మ వ్యాసాలు ఉన్నవి. అద్భుతమైన అభివ్యక్తితో సరళమైన పదజాలంతో లోతైన భావాలతో కవిత్వం రాయడం వీరి నేర్పు.



కె. శివారెడ్డి

కె. శివారెడ్డి ''దేవులాట'' కవితలో ఖాళీ కుర్చీలో ''నా పూర్వీకుడెవడో అదృశ్యంగా/అందులో ఆశీనుడై రహస్య/సంభాషణ జరపొచ్చుగా / ...అస్తిత్వం వున్న ప్రతిదీ ప్రాణే... దేవులాడుకుంటున్నామా/తొడపాశంకోసం అల్లలాడుతున్నామా/ ఏం మార్పు/ నన్ను నేను ఆ కుర్చీలో కూచో బెట్టి/ మాట్లాడవచ్చు/ఖాళీ కుర్చీ ఎప్పుడూ/ ఖాళీగా వుండదు'' అంటూ జీవితంలో దేనికోసమైనా దేవులాట అవసరం అంటారు. లోతైన భావనా సంపద వీరి సొత్తుగా పేర్కొనవచ్చును''.



దేవిప్రియ

ఆధునిక తెలుగు కవిత్వానికి వో కొత్తదనాన్ని, ఆత్మీయతను, అభివ్యక్తిని, అందించిన దేవిప్రియ ఈ సంవత్సరం ''ఇంకొకప్పుడు'' అనే కవితా సంపుటిని వెలువరించారు. ఎప్పుడూ కవిత్వంలో నూతనత్వాన్ని వెతుకుతు, పాఠకుణ్ణి మంత్రముగ్ధుల్ని చేసే భావచిత్రాల్ని వేస్తూ, తనదైన ముద్రను ప్రదర్శిస్తున్న కవి దేవిప్రియ. ఈయన కన్నీటి చుక్క బరువు ఎరిగిన వాడు. గుండెల్లో గూడుకట్టుకున్న విషాదాన్ని ఎట్లా పారబోసుకోవాలో తెల్సినవాడు. ''ఆత్మకవిత''లో ''ఎందుకీ పరుగు/ ...ఎక్కడికి ఈ ఉరుకు/...నువ్వు ఇంకెప్పుడు వస్తావని/ ఆ పావలా బిళ్ళంత బొట్టు/ నిట్టూరుస్తూ యెదురుచూసే క్షణాలు/ అమూర్తంగా గుమ్మానికి ఎండు మామిడాకుల్లా/ఎప్పుడైనా రాలడానికి సిద్ధంగా వేలాడుతున్నాయిగా అంటూ విషాదాన్ని ఆవిరి చేసే తత్త్వమెరిగిన కవి దేవిప్రియ అనిపించుకున్నాడు.



వల్లభరావు

విజయవాడకు చెందిన వల్లభరావుకి సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం రావడం తెలుగు సాహిత్య రంగానికి కమ్మతెమ్మెరలాంటి చల్లని సంతోషదాయకమైన వార్తలు. అనువాదకుడిగా ప్రసిద్ధుడైన వెన్నా వల్లభరావు తెలుగు నుండి హిందీలోకి ఏడు పుస్తకాలను అనువదించారు. అలాగే హిందీ నుండి తెలుగులోకి ఎనిమిది పుస్తకాలననువదించి ప్రతిభ చాటు కున్నారు. అనువాద ప్రక్రియలో ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఆయన్ను వరించింది.

సాహిత్య వార్తలు

తెలంగాణ సినిమా దశ దిశ ఆవిష్కరణ

వారాల ఆనంద్ రచించిన తెలంగాణ సినిమా దశదిశ పుస్తకాన్ని కల్వకుంట్ల తారక రామారావు 5వ తేదీ ఉదయం 10.30 ని.లకు సెక్రెటేరియట్ లోని తన కార్యాలయంలో ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమానికి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అతిథిగా హాజరవుతారు. ఈ కార్యక్రమంలో దేశపతి శ్రీనివాస్, వఝుల శివకుమార్ తదితరులు పాల్గొంటారు.

కవితాసంపుటాలకు ఆహ్వానం

సుప్రసిద్ధ కవి కీ.శే.నాగభైరవ కోటేశ్వరరావు పేరుమీద ఇస్తున్న నాగభైరవ పురస్కారం-2017 (ద్వితీయ నాగభైరవ అవార్డు కోసం) కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. 2016, 2017ల్లో వెలువరించిన వచన కవితా సంపుటాలను జనవరి 30, 2018 లోగా ఈ క్రింది చిరునామాకు పంపించవలసిందిగా కోరుతున్నాము. ఉత్తమ కవితా సంపుటికి రూ.5000/- నగదు సత్కారం, ఫిబ్రవరి 2018లో జరుగు నాగభైరవ అవార్డు సభలో సత్కారం ఉంటుంది. కవితా సంపుటాలు పంపించాల్సిన చిరునామా: చిన్ని నారాయణరావు, ప్రధాన కార్యదర్శి, 'శ్రీ కేతనమ్' ఆదిత్యనగర్, చిల్డ్రన్స్ పార్క్‌రోడ్, నెల్లూరు-524003. సంప్రదించవలసిన ఫోన్ నెం. 9440202942

- చిన్ని నారాయణరావు, ప్రధానకార్యదర్శి

కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం -2018

కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం-2018 కొరకు జనవరి 2015 నుంచి డిసెంబర్ 2017 వరకు ముద్రితమైన తెలుగు నాటకాలు/ నాటికా సంపుటులు పురస్కారానికి పరిశీలింపబడతాయి. ఇందుకోసం రచయితలుగానీ, ప్రచురణ కర్తలుగానీ మూడేసి ప్రతులు పరిశీలనార్థం పంపగోరుతున్నాము. ఒకే రచయితవి నాటకాలు/నాటికా సంపుటులు ఎన్నయినా పంపవచ్చును. పురస్కారంగా రూ.10,000/-నగదు, శాలువా,మెమొంటో ప్రదానం చేస్తాం. చివరి తేదీ. 18-1-2018. పంపవలసిన చిరునామా: డా. కొలకలూరి సుమకిరణ్, ప్రొఫెసర్, ఆంగ్లశాఖ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి-517502. ఆంధ్రప్రదేశ్.

- డా॥ కొలకలూరి సుమకిరణ్
9963564664

కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారం-2018

కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారం -2018 కొరకు జనవరి 2-15 నుంచి డిసెంబర్ 2017 వరకు ముద్రితమైన పద్య/గేయ/వచన కావ్యాలు/ సంకలనాలు (ఒక్క రచయిత గ్రంథమే వివిధ కవులు సంకలనాలు కాదు) ఈ పురస్కారానికి పరిశీలించబడతాయి. పురస్కారం రచయితకు మాత్రమే ఇవ్వ బడుతుంది. రచయితలు గానీ/ ప్రచురణ కర్తలుగానీ మూడేసి ప్రతులు పరిశీలనార్థం 18-1-2018లోగా పంపగోరుతున్నాము. పురస్కారంగా రూ.10,000/- నగదు, శాలువ, మెమెంటో ప్రదానం చేస్తాం. ప్రతులు పంప వలసిన చిరునామా: ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ఆంధ్రాచార్యులు, తెలుగు శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి-517502, ఆంధ్రప్రదేశ్,

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
9441923172

కవిత్వ విశ్లేషణ కార్యక్రమం

తెలంగాణ సాహిత్య సమాఖ్య ఆధ్వర్యంలో 7వతేదీ ఉదయం 10.30 ని.లకు స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, హెరిటేజ్ బిల్డింగ్, అఫ్జల్ గంజ్ నందు వినూత్న కవిత్వ విశ్లేషణ కార్యక్రమం ధ్వని (కవిత్వలయ) పేరుతో నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో కవులు సిద్ధార్థ, ఏనుగు నరసింహారెడ్డి, శోభాభట్, గుడిపాటి పాల్గొంటారు.

- వఝుల శివకుమార్, బెల్లంకొండ సంపత్‌కుమార్
వేముగంటి మురళీకృష్ణ, తెలంగాణ సాహితీ సమాఖ్య

కొత్త ఏడాదికి గ్రాండ్‌గా వెల్‌కమ్










ఈ గణతంత్రం ఎంతో ప్రత్యేకం

• ఆసియాన్ ప్రతినిధులంతా ముఖ్య అతిథులే • దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు • నవ భారత్ నిర్మాణంలో యువతరం కీలకం• ట్రిపుల్ తలాక్ నుంచి ముస్లిం మహిళలకు విముక్తి • 2017 చివరి మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2017 చివరి మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 2017 ఏడాదిలో మీరు, నేను ఎన్నో ఆలోచనలను పరస్పరం పంచుకున్నామని గుర్తుచేశారు. 2018 జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలు దేశ చరిత్రలో ప్రత్యేకంగా నిలవబోతున్నాయని చెప్పారు. ఈ వేడుకలకు ఆసియా దేశాల ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరు కాబోతున్నారని మోడీ ప్రకటించారు. ఒకరు.. ఇద్దరు కాదు... ఈసారి గణతంత్ర వేడుకలకు 10 మంది (ఆసియాన్ ప్రతినిధులు) ముఖ్య అతిథులు హాజరవుతున్నారు. 2018 గణతంత్ర వేడుకలు తరతరాలకు గుర్తుండిపోతాయి. 2017 సంవత్సరం ఆసియాన్, ఇండియాలకు ప్రత్యేకమైనది. ఆసియాన్ ఆవిర్భవించి 50 ఏళ్లు అవుతోంది. అదే సమయంలో ఈ కూటమిలో భారత్ భాగస్వామ్యానికి పాతికేళ్లు నిండుతున్నాయి. పది దేశాలకు చెందిన అతిథులు తరలిరావడం, గణతంత్ర పరేడ్‌లో పాల్గొనడం భారతీయులందరికీ గర్వకారణం అని ప్రధాని చెప్పారు. గతేడాది ప్రజల నుంచి వచ్చిన సూచనలు ఎంతో విలువైనవి అని అభిప్రాయపడ్డారు. కులతత్వం, మతతత్వం, అవినీతి వంటి విష సంస్కృతి నుంచి నవ భారత్ విముక్తి పొందుతోంది. పేదరిక నిర్మూలన దిశగా నవభారత్ పయనిస్తోందని పేర్కొన్నారు. మన్ కీ బాత్ ద్వారా గురు గోవింద్ సింగ్‌కు నివాళులర్పించారు. ఎన్నో తరాల వారిని గురు గోవింద్ సింగ్ ప్రభావితం చేశారని తెలిపారు. నవ భారతంలో అందరికి సమాన అవకాశాలు ఉంటాయని, ప్రతి పౌరుడి ఆకాంక్షలు, ఆశయాలు నెరవేరతాయని భరోసా ఇచ్చారు. శాంతి, ఐకమత్యం, సద్భావనల స్థాపనే లక్ష్యమని చెప్పారు.

21వ శతాబ్దపు కొత్త ఓటర్లకు స్వాగతం

21వ శతాబ్దం ఆరంభంలో జన్మించిన ప్రతీ ఒక్కరూ 2018, జనవరి 1 నుంచి ఓటు హక్కుకు అర్హత సాధిస్తారు. అలాంటి వారందరికీ ప్రత్యేక అభినందనలు. భారత ప్రజాస్వామ్యం కొత్త ఓటర్లను స్వాగతిస్తోంది. యువతరం నవ భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా శక్తిమంతమైనదని, దేశ రూపురేఖలనే మార్చేసే సత్తా ఓటుకు ఉంటుందని వ్యాఖ్యానించారు. కాబట్టి దేశ భవిష్యత్తు నవ భారత యువతరం చేతుల్లోనే ఉందని అన్నారు. జన ఉద్యమంతో దేశాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలనే దానిపై జిల్లాల్లో మాక్ పార్లమెంటు కార్యక్రమాలను నిర్వహిస్తామని, కాబట్టి దేశ పురోగతి విషయంలో నవతరం ముందుండి నడిపించాలని సూచించారు. ఆగస్టు 15ను పురస్కరించుకుని దేశ రాజధానిలో మాక్ పార్లమెంట్ నిర్వహించబోతున్నాం. ప్రతి జిల్లా నుంచి ఒక్కొక్కరు చొప్పున ప్రతినిధులుగా హాజరవుతారు. వచ్చే ఐదేళ్లలో నవ భారత్ నిర్మాణం ఏవిధంగా చేపట్టాలో వీరు సూచిస్తారు. దీనికంటే ముందు ప్రతిజిల్లాలో మాక్ పార్లమెంట్ నిర్వహించడం జరుగుతుంది అని మోడీ వివరించారు. అదేవిధంగా కొత్త సంవత్సరంలో ప్రజలంతా ప్రగతిశీల భారత్ కోసం నిర్మాణాత్మక అడుగులు వేయాలని సూచించారు.

బషీర్‌ఖాన్ జీవితం యువతకు స్ఫూర్తి

మనసుల్లో ప్రతికూల ఆలోచనలు లేకుండా సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలన్న మోడీ.. అంజుమ్ బషీర్ ఖాన్ ఖటక్ ఉదంతాన్ని వివరించారు. కాశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ పరీక్షలో టాపర్‌గా నిలిచిన అంజుమ్ బషీర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.తీవ్రవాదం, విద్వేష భావజాలం నుంచి బయటకు వచ్చిన అతను కాశ్మీర్ అడ్మి నిస్ట్రేటివ్ పరీక్షలో టాపర్‌గా నిలిచాడు.

4000 నగరాల్లో స్వచ్ఛ సర్వే

2014 అక్టోబరు 2న గాంధీ జయంతి నాడు.. ఆయన తపించిన 'స్వచ్ఛభారత్'ను ప్రారంభించామని, దానిని జనాల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఎన్నో చర్యలు చేపట్టామని మోడీ వివరించారు. దేశ పరిశుభ్రత కోసం 2018లో జనవరి 4 నుంచి మార్చి 10 వరకు సర్వే నిర్వహిస్తున్నామని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సర్వేగా ప్రధాని ప్రకటించారు. 4వేల నగరాల్లో, దాదాపు 40 కోట్ల మంది ప్రజలు ఈ సర్వేలో పాల్గొంటారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పరిశు భ్రతకు తీసుకోవాల్సిన చర్యలను సర్వే ద్వారా తెలుసుకుం టామని చెప్పారు. పరిశుభ్రత విషయంలో పట్టణాలు, గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యం గొప్ప మార్పుగా పేర్కొన్నారు.

ముస్లిం మహిళలకు విముక్తి

ట్రిపుల్ తలాక్ వల్ల ఎన్నో ఏళ్ల నుంచి ముస్లిం మహిళలు బాధలు పడ్డారు. కానీ ట్రిపుల్ తలాక్ నుంచి చాలాకాలం తర్వాత ముస్లిం మహిళలకు విముక్తి లభించిందని తెలిపారు. హజ్‌యాత్రకు పురుష సంరక్షకులు తోడులేకుండా మహిళలను ఒంటరిగా వెళ్లేందుకు అనుమతి ఇవ్వడంపైనా ప్రధాని స్పష్టత ఇచ్చారు. ముస్లిం మహిళలు హజ్ యాత్రకు వెళ్లాలనుకుంటే వారి కూడా ఓ 'మెహ్రమ్ (మగ తోడు)' ఉండాలని, మగతోడు లేకుండా ఆమెను ప్రయాణించబోనివ్వరని, దానిని మార్చామని ఆయన వివరించారు. 1300 మంది మహిళలు మగతోడు లేకుండా హజ్ యాత్రకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారని, వారి అభ్యర్థన మేరకు అనుమతి ఇవ్వడం జరిగిందని ప్రధాని మోడీ తెలిపారు.


పుల్వామాలో ఉగ్రదాడి



శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. సీఆర్పీఎఫ్ బెటాలియన్ లక్ష్యంగా మెరుపుదాడి చేశారు. అయితే భారత జవాన్లు ఉగ్రవాదులకు దీటుగా బదులిచ్చారు.14 గంటల పాటు జరిపిన ఎదురుకాల్పుల్లో దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ భీకరపోరులో ఐదుగురు జవాన్లు అమరులయ్యారు. ఒక జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం ఉదయం 2గంటల ప్రాంతంలో పుల్వామా జిల్లా అవంతిపురాలోని లెత్‌పొరా 185 బెటాలియన్‌పై పాకిస్తాన్ కు చెందిన జైషే -ఈ - మహ్మద్ ఉగ్రవాదులు ప్రతీకార దాడులకు దిగారు. భద్రతాబలగాలపై గ్రనేడ్లతో దాడి చేసి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. శిక్షణా శిబిరం నుంచి ఆరుగురు జవాన్లు సురక్షితంగా బయటపడ్డారు. మృతుల్లో కానిస్టేబుల్ సైఫుద్దీన్ సాజ్ ఉన్నట్లు సీఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

దేవుడు శాసించాడు రాజకీయాల్లోకి వస్తున్నా

• వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా కొత్త పార్టీ స్థాపన • సత్యం, కార్యం, అభివృద్ధి ఇవే పార్టీ సిద్ధాంతాలు • 234 స్థానాల్లో పోటీచేస్తాం..రాజకీయాలు కొత్తేం కాదు • అభిమానులతో సమావేశంలో రజనీకాంత్ ప్రకటన



చెన్నై: తమిళ తలైవర్ రజినీకాంత్ పొలిటికల్ ఎంట్రీపై సస్పెన్స్‌కు తెరదించారు. ఏళ్ల తరబడి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రాజకీయ ఆరంగేట్రంపై స్పష్టత ఇచ్చారు. అభిమానులను సంబరంలో ముంచెత్తుతూ 'రాజకీయాల్లోకి వస్తున్నా' అంటూ ప్రకటన చేశారు. గత కొద్దికాలంగా తమిళ రాజకీయాలలోనే కాదు.. యావత్ దేశ రాజకీయాల్లో కూడా రజనీ రాజకీయ ప్రవేశం గురించి విపరీతంగా చర్చ జరుగుతుంది. రాజకీయా ల్లోకి ఎప్పుడు వస్తారు? అని అడిగినప్పుడల్లా ఆయన చెప్పే సమాధానం.. 'దేవుడు శాసిస్తే..' అంటూ చేతులు ఆకాశానికి చూపుతుండేవారు. కానీ 2017 చివరి రోజు తన రాజకీయ రంగ ప్రవేశం ప్రకటనతో అభిమానుల్లో కొత్త జోష్ నింపారు.

రాఘవేంద్ర హాలులో అశేషాభిమానుల సమక్షంలో రజినీ చేసిన ప్రకటనతో అభిమానులు కొత్త సంవత్సరం వేడుకలను ముందుగానే మొదలుపెట్టారు. తొలుత తనదైన స్టైలుతో అభిమానులకు రెండు చేతులతో అభిమానులకు అభివాదం చేస్తూ వేదికపైకి వచ్చిన రజనీ, కొద్దిసేపు ధ్యానముద్రలో ఉన్నారు. అనంతరం 'కర్మణ్యే వాధికారస్తే' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. 'రాజకీయాల్లోకి వస్తున్నా' అంటూ ప్రకటించారు. త్వరలో సొంత పార్టీ పెడతానని, 234 సీట్లకు పోటీ చేస్తామన్నారు. డబ్బు, హోదా కోసం రాజకీయాల్లోకి రావడంలేదని, ప్రజలకు మంచి చేసేందుకే రాజకీయాల్లోకి వస్తున్నానని తెలిపారు. తనకు రాజకీయాకు కొత్త కాదని చెబుతూనే, రాజకీయాల్లోకి ఎందుకు వస్తున్నానో, ఏమి చేయాలను కుంటున్నానో టూకీగా చెప్పారు. ప్రజలకు మంచి చేయడమే తమ ఉద్దేశమని, ఆధ్యాత్మికత, నిజాయితీనే మన నినాదాలని అన్నారు. 'మంచి చేయడమే నా ఉద్దేశం. ఆధ్యాత్మికత, నిజాయితీ మన నినాదాలు. ఇవాళ రాజకీయాలు దిగజారాయి. ప్రజాస్వామ్యం కునారి ల్లుతోంది. వ్యవస్థలో మార్పు తీసుకురావాలి. అందుకే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నాను' అని తెలిపారు. సత్యం, కార్యం, అభివృద్ధి (ట్రూత్, వర్క్, గ్రోత్).. తమ పార్టీ మూల సూత్రాలుగా ఉంటాయని అభిమానులతో రజనీ చెప్పారు. రాజకీయాలంటే భయం లేదని, మీడియా అంటేనే భయమని నవ్వుతూ చెప్పారు.

'అధికారంలోకి వస్తున్న ప్రతీ పార్టీ దేశాన్ని దోచుకుంటోంది. రాజకీయాల్లో మార్పు తెచ్చేందుకు ఇదే సరైన తరుణం. నేను క్యాడర్లు కోరుకోవడం లేదు. సేవియర్లు కావాలి. స్వప్రయోజనాల కోసం పనిచేసే వాళ్లు కాదు. తప్పులను నిలదేసేవాళ్లు కావాలి. అలాంటి వాళ్లకు నేను ప్రతినిధిగా నిలుస్తాను. ఇప్పుడు నేను స్పందించకపోతే ఆ తర్వాత నేనే విచారపడాల్సి రావచ్చు. రాజకీయ వ్యవస్థను మొత్తం మార్చాలనుకుంటున్నాను. కుల, మతాల పట్టింపులేని రాజ కీయాలు కావాలి. ఆధ్యాత్మిక రాజకీయాల అవస రం ఉంది. రాజకీయాలు కళంకితమవుతున్నాయి. ప్రజాస్వామ్యం బలహీనమవుతోంది. తమిళనాడులో రాజకీయ వాతావరణం సిగ్గుతో తలవంచుకునేలా ఉన్నాయి. రాజకీయాల్లో పోటీ చేయడం, నెగ్గుకురావడం తేలికైన విషయం కాదని నాకు తెలుసు. అయితే భగవంతుడు, ప్రజల ఆశీస్సులు నాకు ఉంటాయని బలంగా నమ్ము తున్నాను. నేను డబ్బు కోసమో, పేరు కోసమే ఇక్కడ లేను. ఆ రెండూ నాకు తగినంత ఉన్నాయి. ఇక్కడి రాజకీయాలు కుళ్లుకంపు కొడుతున్నాయి.

ప్రజాస్వా మ్యం శిథిలావస్థకు చేరుతోంది. గత ఏడాదిగా జరుగుతున్న పరిణా మాలు తమిళనాడుకు ఉన్న పేరును చెడగొట్టాయి. రాజకీ యాల్లోకి వచ్చేందుకు ఇదే సరైన సమయం. అందుకే రాజకీయా ల్లోకి వస్తు న్నాను. పోరాటానికి సిద్ధంగా ఉన్నాను. సొంత పార్టీ పెడ తాను, ఎన్ని కల్లో పోటీ చేస్తాను. చో రామస్వామిని మిస్సయ్యాననే బాధ నాకుంది. ఈ సమయంలో ఆయన ఉండివుంటే, నా ప్రయాణా నికి సహాయం చేసేవారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ ప్రారం భిస్తాను. అప్పటి వరకూ రాజకీయాల గురించి మాట్లాడవద్దని నా అభిమానులను కోరుతున్నాను. జైహింద్..' అంటూ తన రజనీ తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం అభిమానులు రజనీ కాంత్‌తో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.

అభిమానుల సంబరాలు..

రజనీ రాజకీయ ఆరంగేట్ర ప్రకటనతో అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. ఒక్క తమిళనాటే కాదు.. యావత్ ప్రపంచంలోని ఆయన అభిమానులు ఆనంద డోలికల్లో తేలియాడారు. సమావేశం హాలు బయట వందలాది మంది కేరింతలతో హోరెత్తించారు. పరస్పరం మిఠాయిలు పంచిపెట్టుకున్నారు. ముంబైలోని మహారాష్ట్ర రజనీకాంత్ సంక్షేమ సంఘం భారీ ఎత్తున సంబరాలు జరిపింది. రాష్ట్రవ్యాప్తంగా 150 అభిమాన సంఘాలు ఉండగా, ఒక్క ముంబైలోనే 90 సంఘాలున్నాయి.



గైక్వాడ్ నుంచి రజనీకాంత్‌గా...

రజనీకాంత్ 1950 డిసెంబరు 12న జన్మించారు. ఆయన పూర్తి పేరు శివాజీ రావ్ గైక్వాడ్ తల్లిదండ్రులు మహారాష్ట్రకు చెందిన వారు. తండ్రి పోలీస్ కానిస్టేబుల్. బెంగళూరులో నివసించేవారు. శివాజీ ఐదేళ్ల ప్రాయంలో తల్లిని పోగొట్టుకున్నారు. అక్కడి నుంచి కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడింది. అదే సమయంలో శివాజీ పలు ఉద్యోగాలు చేశారు. ఓ స్టేజ్‌పై శివాజీ నటనను చూసిన దర్శకుడు కె.బాలచందర్ 'అపూర్వరాగంగళ్' చిత్రంలో తొలి అవకాశం ఇవ్వడమే కాదు.. మరో మూడు చిత్రాల్లో నటించేందుకు ఒప్పందం చేసుకున్నారు. అప్పుడు శివాజీగా ఉన్న పేరును రజనీకాంత్‌గా మార్చారు బాల చందర్. తొలినాళ్లలో ప్రతినాయకుడిగా రజనీ స్టైల్‌కు అభిమానులు ఫిదా అయిపోయారు. అక్కడి నుంచి కథానాయకుడిగా ఎదిగి, భారతీయ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్రవేశారు. 'దళపతి', 'ముత్తు', 'అరుణాచలం', 'నరసింహా', 'శివాజీ', 'రోబో' చిత్రాలు రజనీని అంతర్జాతీయ నటుడిని చేశాయి.

రాజకీయ అనుభవం..

✷ ఇదివరకు పలు రాజకీయ పార్టీలకు రజనీకాంత్ ఎన్నికల ప్రచారం చేశారు. వీటిలో కొన్ని సక్సెస్ అయ్యాయి. మరికొన్ని చేదు అనుభవాలను మిగిల్చాయి. 1996 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే-టీఎంసీ కూటమి తరఫున ప్రచారం నిర్వహించారు. నాటి ఎన్నికల్లో కూటమి విజయంలో కీలకపాత్ర పోషించారు. అప్పట్లో 'జయలలిత మళ్లీ ముఖ్యమంత్రి అయితే తమిళనాడును దేవుడు కూడా రక్షించలేడు' అనే ప్రకటన చేయడం ద్వారా రజనీకాంత్ ఎన్నికల ప్రచారంలో అన్నాడీఎంకేను చిత్తుగా ఓడిపోయేలా చేశారు.

✷ ఇంకోసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే - బీజేపీ కూటమి తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ఫలితాలు నిరాశకు గురిచేశాయి. 39 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగితే, కేవలం తొమ్మిది చోట్ల మాత్రమే ఈ కూటమి విజయం సాధించింది.

✷ 2004 లోక్‌సభ ఎన్నికల్లో పీఎంకేకు వ్యతిరేకంగా ఓట్లు వేయాలన్న రజనీ పిలుపును ప్రజలు పట్టించుకోలేదు. ఫలితం తలకిందులైంది. పీఎంకే పోటీ చేసిన అన్నిచోట్లా గెలుపొందింది.

అమ్మ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు: దినకరన్

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా కొత్తపార్టీ స్థాపిస్తానని వెల్లడించారు. రజనీ రాజకీయ రంగ ప్రవేశంపై శశికళ వర్గం నేత, ఇటీవల ఆర్కేనగర్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధిం చిన టీటీవీ దినకరన్ స్పందించారు. రాజకీయాల్లోకి ఎంత మంది వచ్చినా.. తమిళనాడులో అమ్మ(జయలలిత) స్థానాన్ని భర్తీ చేసేవా రు ఎవరూ ఉండరన్నారు. 'అమ్మ విశ్వసనీయత ముందు ఏ కొత్త ముఖం నిలవదు. తమిళనాడులో ఉన్నది ఒక 'అమ్మ', ఒక ఎంజీఆర్ మాత్రమే. వీరితో ఎవరినైనా పోల్చి చూసుకోవచ్చు' అని అన్నారు.

ప్రముఖుల శుభాకాంక్షలు...

☞ రజనీకాంత్ రాజకీయ ప్రవేశంపై కమల్‌హాసన్ స్పందించారు. రాజకీయాల్లోకి రజనీ రాకను స్వాగతిస్తున్నట్టు చెప్పారు. సొంతంగా కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్టు ప్రకటించిన 'తలైవా'కు అభినందనలు తెలిపారు. తన సోదరుడి సామాజిక చైతన్యాన్ని ప్రశంసించారు.

☞ రాజకీయ వ్యవస్థను రజనీకాంత్ ప్రక్షా ళన చేస్తారని అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారని సీనియర్ నటుడు కబీర్ బేడి ట్వీట్ చేశారు. రాజకీయాల్లో ఆయన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

☞ తమిళనాడు ప్రజలు రజనీకాంత్ వెంటే ఉంటారని, ఆయనకు తిరుగులేదని దర్శకుడు లింగుస్వామి ట్విటర్‌లో పేర్కొన్నారు.

☞ 'తమిళ సినీపరిశ్రమలో రజనీకాంత్ సూపర్‌స్టార్ అనడటంలో ఎటువంటి సందేహం లేదు. దేశ రాజకీయాల్లో మాత్రం తిరుగులేని సూపర్‌స్టార్ మోడీ ఒక్కరే. ఈ విషయం తలైవాకు బాగా తెలుసున'ని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎస్ నరసింహారావు ట్వీట్ చేశారు.

☞ తలైవా రాజకీయాల్లోకి రావడం 'ఈవెంట్ ఆఫ్ ది సెంచరీ' అని టాలీవుడ్ దర్శకుడు రాంగోపాల్ వర్మ అభివర్ణించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రజనీని ఆదర్శంగా తీసుకొని అన్నిస్థానాల్లో పోటీచేయాలని సూచించారు.

☞ తన సహ నటుడు రజనీకాంత్ రాజకీయాల్లో రాణించాలని కోరుకుంటున్నట్లు అమితాబ్ ట్వీట్ చేశారు.

☞ డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకే స్టాలిన్ కూడా శుభాకాంక్షలు తెలిపారు. సూపర్‌స్టార్ రజినీకాంత్‌ను రాజకీయాల్లోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు స్టాలిన్ చెప్పారు.

☞ ఆర్కే నగర్ ఎమ్మెల్యే దినకరన్ కూడా రజనీని రాజకీయాల్లోకి స్వాగతించారు. రాజకీయాల్లో సూపర్‌స్టార్‌ని చూడటం తనకెంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు.

☞ 'సంఘటిత ప్రజాస్వామ్యం, అభివృద్ధిపై రజనీకాంత్‌కు నమ్మకం ఉంది. ఆయన రాజకీయాల్లో విజయం సాధించాలని ఆశిస్తున్నాను' **- ఖుష్బూ**

☞ 'థ్యాంక్యూ లీడర్. మీరు రాజకీయాల్లోకి రావాలన్న మా అందరి కల ఇంకా గుర్తుంది. మంచి చేద్దాం, మంచి గురించే మాట్లాడదాం. అప్పుడే మంచి జరుగుతుంది' -రాఘవ లారెన్స్

☞ 'నా ప్రియమైన స్నేహితుడు రజనీకాంత్‌కి ఆల్ ది బెస్ట్. సమాజానికి కావాల్సిన మార్పు ఆయన నాయకత్వం ద్వారా వస్తుందన్న నమ్మకం నాకుంది' **- మోహన్‌బాబు**

చదువు రాదు.. అవినీతిపరుడు: స్వామి

రజనీకాంత్ రాజకీయ ప్రవేశంపై బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి తీవ్ర విమర్శలు చేశారు. సినిమా స్టార్ రాజకీయాల్లోకి వస్తున్నానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవినీతిపరుడైన రజనీకాంత్.. అవినీతిని ఆపుతారా? అని ప్రశ్నించారు. తమిళనాడు సమస్యలపై రజనీకాంత్‌కు కనీస అవగాహన లేదని దుయ్యబట్టారు. చదువు రాని రజనీకాంత్.. తమిళ ప్రజలకు ఏం నేర్పిస్తాడని సుబ్రమణ్యస్వామి విమర్శించారు. మీడియా హైప్ కోసమే రజనీకాంత్ ఇలా చేస్తున్నారని సుబ్రమణ్యస్వామి చెప్పారు. రజనీని వ్యతిరేకిస్తానని ఆయన తేల్చిచెప్పారు. శివాజీ గణేషన్ రజనీకాంత్ కంటే గొప్ప వ్యక్తి.. ఆయనే రాజకీయాల్లోకి వచ్చి ఏం చేయలేకపోయారని సుబ్రమణ్య స్వామి తెలిపారు.




జనవరి 31
సంపూర్ణ చంద్ర గ్రహణం

జూలై 27
సంపూర్ణ చంద్ర గ్రహణం. ప్రపంచంలోని అనేక ప్రదేశాలలో ఇది కనిపిస్తుంది.




ఫిబ్రవరి 15
పాక్షిక సూర్య గ్రహణం

జూలై 31
పాక్షిక సూర్యగ్రహణం. దక్షిణ ఆస్ట్రేలియా, అంటార్కిటికాలో కనిపిస్తుంది.



ఆగస్టు 17
శుక్ర గ్రహం తూర్పు భాగం అత్యంత పొడవుగా కనిపిస్తుంది.



అక్టోబర్ 23
వరుణ గ్రహం (యురేనస్) భూమికి అత్యంత సమీపంగా వెడుతుంది.




జులై 27
రోజున అంగారక గ్రహం భూమికి అత్యంత సమీపంగా వస్తుంది.

జూన్ 27
శనిగ్రహం భూమికి అత్యంత సమీపంలోకి వస్తుంది.









మార్చి 15
బుధ గ్రహం తూర్పు దిశగా అతి దీర్ఘంగా గోచరిస్తుంది.





మే 9న
గురు గ్రహం భూమికి అత్యంత సమీపంగా వస్తుంది.

సెప్టెంబర్ 7
నెప్ట్యూన్ గ్రహం భూమికి అతి సమీపంగా ప్రయాణిస్తుంది.





డిసెంబర్ 21
సంవత్సరంలో సుదీర్ఘమైన రాత్రి

జూన్ 21
సంవత్సరంలో అత్యంత దీర్ఘమైన పగలు



-సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి

అటల్ పెన్షన్ యోజనతో ఆధార్ లింక్

న్యూఢిల్లీ : అటల్ పెన్షన్ యోజన సర్వీస్ ప్రొవైడర్లు తమ సబ్‌స్క్రైబర్లు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయించాలని, దీనికిగాను కొత్త రకం ఫారాలను అందజేయాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ, డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ ఆర్‌డీఏ) సూచించింది. అటల్ పెన్షన్ యోజన అనేది పక్కా శాశ్వతంగా పెన్షన్ అందించే పథకం. ఆధార్‌తో అనుసంధానం విషయమై ఆర్థిక సర్వీస్ శాఖతో పాటు ఫైనాన్స్ మినిస్టర్‌తో పలు దఫాలుగా సమావేశం నిర్వహించినట్టు పీఎఫ్‌ఆర్‌డీఏ తెలిపింది.

తల్లిదండ్రుల్లో లింగవివక్ష తగదు

కోల్‌కతా: అమ్మాయి అయినా అబ్బాయి అయినా ఇరువురూ సమానమే అని తల్లిదండ్రుల్లో లింగవివక్ష తగదని బాలీవుడ్ సీనియర్ నటి షర్మిలా ఠాగూర్ వ్యాఖ్యానించారు. కోల్‌కతాలోని 11వ గ్లోబల్ డాక్టర్స్ సమ్మిట్ ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడ, మగ అనే లింగవివక్షను విడనాడితే వారి కుటుంబానికే కాదు సమాజానికి కూడా మేలు జరుగుతుందన్నారు. ప్రజలు తమ అభిప్రాయాన్ని మార్చుకోకపోతే ప్రభుత్వ లింగవివక్ష కు వ్యతిరేకంగా ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం ఆశించిన స్థాయిలో ఉండదన్నారు.

'జిగ్గి స్టార్'కి అరుదైన చికిత్స

సీల్ మెదడులోని ఎముకను అతికించిన వైద్యులు

వాషింగ్టన్ : శాస్త్రసాంకేతిక రంగం రోజురోజుకు ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఒకరి గుండెను ఒకరికి అమర్చడం వంటి ఎన్నో అత్యద్భుతమైన ఆపరేషన్లు చేసుకుంటూ వైద్యులు ఔరా అనిపించుకుంటున్నారు. కానీ న్యూరోసర్జికల్ బృందం ఈసారి బ్రెయిన్‌కు ఆపరేషన్ చేశారు. అది మనిషికి అయితే ఆశ్చర్యంలేదు కానీ జిగ్గి స్టార్ అనే ఓ సీల్‌కి చేయడం అందరినీ ఆశ్చర్యపర్చింది. నరాల పరిస్థితి చాలా విషమంగా ఉన్న సమయంలో ఆపరేషన్ చేశారు. అమెరికా,టఫ్ట్ యూనివర్సిటీలోని కమ్మింగ్స్ వెటర్నరీ మెడికల్ సెంటర్ దీనికి వేదికైంది. అత్యంత క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితిలో జిగ్గి స్టార్‌ను అధికారులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. కొన్నేళ్లుగా జిగ్గి మెదడు సంబంధమైన వ్యాధితో బాధపడుతున్నది. వైద్యులు ఎంఆర్ఐ తీయగా మెదడులోని సెరిబ్రల్‌లోని ఎముక విరిగినట్టు నిర్ధారించారు. దీన్ని హైడ్రోసిఫాలస్‌గా వైద్యులు పిలిచారు. నాలుగేళ్ల క్రితం మిస్టిక్ అక్వేరియం నుండి జిగ్గిని తీసుకొచ్చింది. మెదడులోని నరాల్లో సమతుల్యత లోపించడంతో జగ్గి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు మిస్టిక్ గుర్తించారు. ఎంతో శ్రమించి మెదడుకు శస్త్ర చికిత్స చేసిన తరువాత ప్రస్తుతం జిగ్గి ఆరోగ్య పరిస్థితి బాగుందని వైద్యులు తెలిపారు.

S & D



ఈ వారం మార్కెట్
ఆటో గణాంకాలు కీలకం

ముంబై: కొత్త సంవత్సరం మొదటి వారంలో స్టాక్ మార్కెట్లకు దశ దిశ చూపించే అంశాల విషయానికి వస్తే డిసెంబర్ నెల ఆటో అమ్మకాలతో పాటు డిసెంబర్‌తో మూడవ త్రైమాసికం పూర్తయిన నేపథ్యంలో మదుపరులు క్యూ3 ఫలితాల కోసం ఎదురుచూస్తారని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే చమురు ధరలతో పాటు ఫెడరల్ రిజర్వు వచ్చే ఏడాది (2018)లో వడ్డీరేట్లు పెంచుతాయా లేదా అనేది ప్రధానాంశంగా మారుతుంది. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం కాబట్టి ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు కూడా ఫిబ్రవరి నెలలో మొదలు కాబోతాయి. ప్రభుత్వం ఏ ఏ రంగాల్లో సంస్కరణలు తెబోతున్నాయో తెలిస్తే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులు ఆయా రంగాలపై పెట్టుబడులు పెడుతారని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ వారంలోనే తయారీరంగంతో పాటు సేవల రంగాల పర్చేజ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) విడుదల కానుంది. ఈ రెండు మార్కెట్లకు దశదిశ నిర్దేశిస్తుంది. సోమవారం నాడు డిసెంబర్ నెల ఆటో గణాంకాలు వెల్లడికానున్నాయి.. దీని ప్రభావం మార్కెట్లపై ఉంటుంది. 2018 సంవత్సరానికి మార్కెట్లపై ప్రభావం చూపించే అంశాల విషయానికి వస్తే త్రైమాసిక ఫలితాలు కీలకం కానున్నాయి. ప్రస్తుతం శాసనసభ ఎన్నికలు పూర్తయ్యాయి కాబట్టి అందరి దృష్టి బడ్జెట్ 2018పైనే ఉంటుంది. వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పెద్దపీట వేస్తుంది. ఎందుకంటే ఒక ఏడాది తిరిగే సరికి ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రభుత్వం కరువు కాటకాలతో సతమతమవుతున్న జిల్లాలపై ఎక్కువ దృష్టి పెడుతుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మొత్తానికి 2017 సంవత్సరం ఇన్వెస్టర్లకు లాభాల రుచిని చూపించి వెళ్లింది. బీఎస్ఈ 27.91 శాతం లేదా 7,430.37 పాయింట్లు లాభపడింది. మదుపరుల సొమ్ము సుమారు 47వేల కోట్ల వరకు పెరిగింది. ఇటీవల సంవత్సరాలతో పోల్చుకుంటే ఇదే అత్యుత్తమ ప్రదర్శనగా చెప్పుకోవచ్చు.

మొండి బకాయిలపైనే ఆర్‌బీఐ యుద్ధం

ముంబై : ఆర్‌బీఐపై వడ్డీరేట్లలో కోత విధించాలనే ఒత్తిడి 2017లో కొనసాగింది. 2018లో ఆర్‌బీఐ ముందు ఉన్న అతి పెద్ద సవాలు ద్రవ్యోల్బణం అదుపులో పెట్టడంతో పాటు బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండిబకాయిలపై దృష్టి పెట్టడం. సెప్టెంబర్ చివరి నాటికి బ్యాంకుల్లో ఎన్‌పీఏ లేదా మొండిబకాయిలు 10.2 శాతానికి ఎగబాకాయి. వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి ఇవి 11 శాతానికి ఎగబాకవచ్చునని బ్యాంకింగ్ రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభుత్వం ఇన్సాల్వెన్సీ బ్యాంక్‌రప్టసీ కోడ్‌ను తీసుకువచ్చింది. ఇప్పటి వరకు దీనిపై పెద్దగా ప్రయోజనం ఒనగూడలేదు. ప్రస్తుతం రూ.10 లక్షల కోట్ల వరకు బ్యాంకుల్లో మొండిబకాయిలు పేరుకుపోయాయి. వాటిలో సుమారు 40 అతి పెద్ద ఖాతాలే 40 శాతం మొండిబకాయిలను ఆక్రమించాయి. ప్రభుత్వంతో పాటు ఆర్‌బీఐ దానిపై ఫోకస్ పెడుతోంది. కొన్ని కీలకమైన ఖాతా లు జిందాల్ స్టీల్ అండ్ పవర్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ పై దృష్టి పెట్టనున్నాయి. పెరిగిపో తున్న మొండిబకాయిల నేపథ్యంలో ఆర్‌బీఐ 11 బ్యాంకులపై కొత్త రుణాల ఇవ్వడంపై నిబంధనలు విధించింది. వృద్ధిరేటు మందగించడంతో ప్రభుత్వం బ్యాంకులకు పెద్దమొత్తంలో రూ.2.11 లక్షల కోట్లు మూలధనం సమకూర్చాలని నిర్ణయించింది. ప్రభుత్వంతో కలిసి ఆర్‌బీఐ పనిచేస్తుంది.


విదేశీ పెట్టుబడులకు
అవినీతే అడ్డంకి!

● 20శాతం ఇన్వెస్టర్లు కంపెనీలు అందుకే దూరం ● క్రోల్ గ్లోబల్ ఫ్రాడ్ నివేదిక

న్యూఢిల్లీ : విదేశీ ఇన్వెస్టర్లు లేదా కంపెనీలు భారత్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టానికి ఎందుకు వెనకంజ వేస్తున్నారంటే.. దేశంలో విచ్చల విడిగా పెరిగిపోతున్న అవినీతి వల్లే. కార్పొరేట్ సుపరిపాల నతో పాటు తమ ఆస్తులకు భద్రతతో పాటు ఇతర అంశాల వల్ల భారత్ మార్కెట్లో గ్లోబల్ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టడానికి జంకుతున్నారని అమెరికా చెందిన రిస్క్ మేనేజ్‌మెంట్ సంస్థ క్రోల్ స్పష్టం చేసింది. 2014లో కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. కొత్త ప్రభుత్వంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు పరిస్థితుల్లో మార్పులు వస్తాయని ఆశించారు. కానీ పరిస్థితులు చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందని న్యూయా ర్కుకు చెంది న రిస్క్ కన్సెల్టెన్సీ తాజా నివేదికలో పేర్కొంది.

వెనక్కి తగ్గడా నికి కారణాలు:

గ్లో బల్ ఇన్వెస్టర్లు భారత్ మార్కెట్లో పెట్టుబ డులకు దూరంగా ఉండటానికి ప్రధాన కారణాలు పన్నులు, నిరుద్యోగ సమస్య వల్ల తలెత్తున్న అశాంతి, రాష్ట్రాల్లో జరిగే రాజకీయాలు, బ్యాంకింగ్ వ్యవస్థలో నెలకొన్ని ఇబ్బందులు. కాగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మార్పులు వచ్చా యా అన్న ప్రశ్నకు క్రోల్ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్ భాటియాను ప్రశ్నించ గా.. పరిస్థితుల్లో మార్పులు కనిస్తున్నా.. ఇంకా చాలా మార్పులు రావాల్సి ఉందన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పెద్దెత్తున హామీ లు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, దీంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు భారత్‌లో వ్యాపారం చేసుకోవడానికి అనుకూలమైన పరిస్థితులు వస్తాయని ఆశించారని.. దురదృష్టవశాత్తు.. ఆశించినంత ఏమీ లేదని భాటియా అన్నా రు. ఇప్పటికే పలు రకాల సంస్కరణలు ప్రవేశపెట్టారు. దీంతో ప్రభుత్వానికి బలమైన చిత్తశుద్ధి ఉందని భావించామని.. ఈ సంస్కరణలు ఇప్పటికి అమ లు కాలేదని భాటియా అన్నారు.



20 శాతం ఇన్వెస్టర్లు దూరం

క్రోల్ ఫ్రాడ్ నివేదిక ప్రకారం భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి 20 శాతం గ్లోబల్ ఇన్వెస్టర్లు దూరంగా ఉన్నారు. దీనికి ప్రధాన కారణం అవినీతి, ఆస్తులకు భద్రత ఉండదనే అభిప్రాయమే కారణమని స్పష్టం చేసింది. ట్రాన్స్‌పెరెన్సీ ఇంటర్నేషనల్ సర్వే నివేదిక ప్రకారం చూస్తే ఆసియా ఫసిపిక్ ప్రాంతాల్లో భారత్‌లోనే అత్యధికంగా అవినీతి తాండవిస్తోం దని తేల్చి చెప్పింది. జనాభాలో మూడో వంతు మంది ప్రజలు తమ పనులకు 'టీ డబ్బులు' ఇచ్చి చేసుకుంటున్నారని తేల్చి చెప్పింది. 69 శాతం మంది భారతీయులు తాము లంచం ఇచ్చామని చెబుతుంటే.. వియత్నాలో 65 శాతం, చైనాలో అతి తక్కువ 26 శాతం, పాకిస్తాన్‌లో 40 శాతమని తెలిపింది. ఇదిలా ఉండగా మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భారత్ 30 ర్యాంకులు ముందుకు జరిగి 100వ ర్యాంకును ఆక్రమించిందని ప్రకటించింది. ఈ రేటింగ్‌ను పలు గ్లోబల్ రేటింగ్ సంస్థలు సమర్థించడం లేదు. స్టాండర్డ్ అండ్ పూర్స్ సావరిన్ రేటింగ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. పెట్టుబడులకు అత్యల్ప రేటు బీబీబీ-గా ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన సంస్కరణలు బ్యాంక్‌రప్టసీ కోడ్ (ఐబీసీ) రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ యాక్ట్ (రెరా) గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జీఎస్టి), ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తదితర అంశాల వల్ల విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నా రు. అయితే అభివృద్ధి చెందిన మార్కెట్లతో పాటు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో పోల్చుకుం టే భారత్ పెట్టుబడులు పెడితే ఎక్కువ ఆదాయం వస్తుందన్న అంచనాతో విదేశీ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో పెట్టబడులు పెడుతున్నారని క్రోల్ నివేదిక పేర్కొంది.

దృష్టి పెట్టాల్సిన రంగాలు

ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాల్సిన రంగాల విషయానికి వస్తే భూమి, కార్మిక చట్టాలు, పన్ను సంస్కరణలతో పాటు విద్యపై దృష్టి కేంద్రీకరించాలని సూచించింది. విద్యావిధానంలో బలహీనంగా ఉండటంతో ఆగ్నేయాసియాతో పాటు తూర్పు యూరోపియన్ దేశాలతో పోల్చుకుంటే భారత్ బాగా వెనుకబడి పోయిందని భాటియా అన్నారు. దీంతో పాటు ఐటి, సైబర్ సెక్యూరిటి అండ్ ప్రైవసీలపై దృష్టి పెట్టాలని...ఈ రంగాలన్నీ రిస్కుతో కూడుకన్నవి కాబట్టి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని ఆయన భాటియా సూచించారు.

క్రోల్ అవినీతి నివేదిక


అవినీతి ప్రపంచబ్యాంకు ఇచ్చిన నివేదిక ప్రకారం... సంక్షేమ పథకాల్లో అర్హులకు దక్కాల్సిన లబ్ధి అనర్హులకు లభిస్తోందని... దీనికి ప్రధాన కారణం అధికారులు లంచగొండితనమేనని, అర్హులకు దక్కాల్సిన ఫలాలు ఆలస్యం అవుతున్నాయని వారిని ధ్రవపత్రాలు చూపించాలని వేధిస్తూ వారికి దక్కాల్సిన లబ్ధిని అధికారులు స్వాహా చేస్తున్నారని నివేదికలో వివరించింది. ప్రభుత్వం కొన్ని అంశాలపై ఉదాహరణకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పెద్దనోట్ల రద్దు, జీఎస్టి డిజిటలైజేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది.

ఈఏడాదీ స్టాక్ మార్కెట్లో
యాక్షన్ రీప్లే ఉంటుందా?



హైదరాబాద్ : స్టాక్ మార్కెట్లకు ఈ ఏడాది 2017 సంవత్సరం బాగా కలిసొచ్చింది. ఇన్వెస్టర్లకు 28-29 శాతం వరకు లాభాలను ఆర్జించి పెట్టి వెళ్లిపోయింది. అయితే ఈ ఏడాది 2018లో కూడా ఇదే జోరు కొనసాగుతుందా? అంటే మార్కెట్ నిపుణులు మాత్రం ఈ ఏడాది 2018 కూడా ఇన్వెస్టర్లకు అనుకూ లంగానే ఉంటుందని జోస్యం చెబుతున్నారు. దీనికి వారు చెబుతున్న ప్రధాన కారణాలు ఇలా ఉన్నాయి. పెద్దనోట్ల రద్దు ప్రభావం పూర్తిగా సమసిపోయింది. అలాగే వస్తు సేవల పన్ను (జీఎస్టి)నుంచి కూడా క్రమంగా బయటపడ్డాం. గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని సంస్కరణల ఫలాలు వచ్చే ఏడాది అంటే 2018లో అందుబా టులోకి వస్తాయని చెబుతున్నారు. అయితే ఇక్కడ ఒక్క అడ్డంకి మాత్రం ఇన్వెస్టర్లను వెంటాడుతుంది. అదేమంటే.. పెరిగిపోతున్న ముడి చమురు ధరలతో పాటు ద్రవ్యోల్బణం మళ్లీ కోరలు చాస్తోందా అనేది. ఈ రెండు ఇన్వెస్టర్లకు నిరాశ కలిగించే అంశాలు. ప్రస్తు తం మార్కెట్లు అత్యంత గరిష్ఠస్థాయికి ఎగబాకా యని, దీనికి కారణం గ్లోబల్ ఇన్వెస్టర్లతో పాటు దేశీయ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టడంతో వాస్తవ విలువకంటే కూడా షేర్ల ధరలు అమాంతం పెరిగిపోయాయని చెబుతున్నారు. 2017లో స్టాక్‌మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లకు మంచి లాభాలను వచ్చాయని.. 2018లో కూడా ఇదే జోరుకొ నసాగుతుందన్న అంచనాకు యాక్సిస్‌సెక్యూరిటీస్ సీఈవో, ఎండీ అరుణ్ ఠక్రాల్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాను క్లయింట్లకు ఇచ్చే సలహా ఏమిటంటే .. స్టాక్ మార్కెట్లో పెట్టబుడు లు పెట్టండి.. మార్కెట్లో కరెక్షన్ వచ్చినప్పుడు నాణ్యమైన షేర్లను కొనుగోలు చేసి లాభాలను ఆర్జించుకోవాలని సూచిస్తానని చెప్పారు.

ఆటో విడిభాగాలు



ఆటో విడిభాగాల షేర్ల విషయానికి వస్తే బ్రోకరేజీ సంస్థలు ఎన్‌డ్యూరెన్స్‌టెక్నాలజీస్, మథర్‌సన్‌సుమి సిస్టమ్స్, అపోలో టైర్స్, రానే బ్రేక్ లైనింగ్, రామకృష్ణ ఫోర్జింగ్ షేర్లను సూచిస్తున్నారు. మరి కొంత మంది బ్రోకర్లు వివిధ రంగాలకు చెందిన షేర్లను సూచిస్తున్నారు. వాటిలో మీడియాకు చెందిన షేర్ల విషయానికి వస్తే జాగ్రన్ ప్రకాశన్, జీ ఎం టర్‌టెయిన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, పౌర విమాన యాన రంగానికి వస్తే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, కన్స్యూమర్ రంగానికి చెందిన షేర్లలో గోద్రెజ్ అగ్రోవెట్, కెఆర్‌బీఎల్, మిర్జా ఇంటర్నేషనల్, డాబర్ ఇండి యాలున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్ల విషయా నికి వస్తే సౌత్ ఇండియా బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, ఎస్‌బీఐ లైఫ్ ఇన్స్యూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్స్యూరెన్స్, మణ్ణపురం ఫైనాన్స్, ఆదిత్యబిర్లా క్యాపిటల్, అపార్ ఇండస్ట్రీస్, గ్రీవ్స్‌కాటన్, కేపీఆర్ మిల్స్, ఆర్ఎస్‌డబ్ల్యుఎం, నాట్కోఫార్మా, స్ట్రయిడ్ సాషున్, నావ్‌కర్ కార్పొరేషన్, పెర్‌సిస్టెంట్ సిస్టమ్స్, టాటా స్పాంజ్, విసాకా ఇండస్ట్రీస్, టెక్ మహీంద్రా, ఎన్‌హెచ్‌పీఎస్, స్వరాజ్ ఇంజిన్స్, గతి లాంటి షేర్లపై ఒక లుక్కేయం డి. ఈ ఏడాది ఈ షర్లపై 15-33 శాతం వరకు రాబడి వచ్చే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

ఈ ఏడాది సిఫారసు చేసిన షేర్లు

వచ్చే ఏడాది ఏరంగానికి చెందిన షేర్లు కొనుగోలు చేయవచ్చో బ్రోకరేజీ కంపెనీలు తమ క్లయింట్లకు సలహాలు సూచనలు ఇస్తున్నారు. వారు ముఖ్యంగా హౌసింగ్ రంగానికి చెందిన షేర్లను సూచిస్తు న్నారు. తర్వాత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆటో విడిభాగాల కంపెనీల షేర్లను కొనుగోలు చేయవచ్చునని తమ క్లయింట్లక చెబుతు న్నారు. రియల్టీ రంగానికి చెందిన ఒబెరాయ్ రియల్టీకి చెందిన షేర్లు కొనుగోలు చేయవచ్చునని సూచిస్తున్నా రు. ఇతర కంపెనీల విషయానికి వస్తే ఏషియన్ గ్రానిటో ఇండియా, కజారియా సెరామిక్స్, నీల్‌కమల్, ఎవరెస్ట్ ఇండస్ట్రీ, సెంచురీ ఫ్లయిబోర్డ్స్‌లు జీఎస్టి ద్వారా లబ్ధి పొందుతాయని వారంటున్నా రు. దీంతో పాటు గృహాలకు రుణాలు ఇచ్చే కంపెనీల విషయానికి వస్తే కెన్‌ఫిన్ హోమ్స్‌తో పాటు నాన్‌బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లపై కూడా దృష్టి పెట్టవచ్చునంటున్నారుఒబెరాయ్‌కు పెద్దపీట వేస్తున్నారు.

స్టాక్ మార్కెట్లో
ఫండ్స్ పెట్టుబడి లక్ష కోట్లు

● 2018లో కూడా ఇదే జోరు కొనసాగేనా?

న్యూఢిల్లీ : దేశీయ మ్యూచువల్ ఫండ్స్‌లో 2017లో స్టాక్ మార్కెట్లో రూ.1,00,000 కోట్లు పెట్టబడులు పెట్టాయి. కొత్త సంవత్సరంలో కూడా ఇదే జోరును కొనసాగించి ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో లాభాలను పంచి పెడతాయన్న ఆశాభావాన్ని ఫడ్స్ మేనేజర్స్ వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి విడుదల చేసిన గణాంకాల ప్రకారం చూస్తే 2017లో మ్యూచువల్ ఫండ్స్ స్టాక్ మార్కెట్ లేదా ఈక్విటి మార్కెట్లో రూ.1.2 లక్షలకోట్లు పెట్టుబడులు పెట్టాయని, 2016తో పోల్చుకుంటే రూ.48,000కోట్లు ఎక్కువ పెట్టాయని.. 2015లో రూ.70,000కోట్ల వరకు ఎంఎఫ్‌లు స్టాక్ మార్కె ట్లో పెట్టుబడులు పెట్టాయని తాజా గణాంకాలు సూచిస్తు న్నాయి. తాజా పరిణామాలను బట్టి చూస్తే ఇన్వెస్టర్లు స్థిరాస్తులు రియల్ ఎస్టేట్, బంగారంపై కంటే కూడా స్టాక్ మార్కెట్లు, లేదా మ్యూచువల్ ఫండ్స్‌లలో పెట్టుబడులు పెట్టడా నికి మొగ్గుచూపుతున్నారని కొటక్ మ్యుచువల్ ఫండ్ సీఐఓ ఈక్విటీ హర్ష ఉపాధ్యా చెప్పారు. కాగా మ్యుచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల ద్వారా ఆదాయం ఎక్కువగా రావడంతో పాటు ఇన్వెస్టర్లకు ఎంఎఫ్‌లపై అవగాహన కూడా పెరగడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఇటీవల కాలంలో రిటైల్ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో ఎంఎఫ్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు. విదేశీ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో స్టాక్ మార్కెట్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టడంతో ఈక్విటీ మార్కెట్లు జోరందు కుంటున్నాయి. స్టాక్ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల కంటే కూడా మ్యుచువల్ ఫండ్ లో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టా యి.విదేశీపోర్టుపో లియో ఇన్వెస్టర్లు లేదా ఎఫ్‌పీఐల ఈ ఏడాది రూ. 50 వేల కోట్లు పెట్టుబ డులు పెడి తే క్రితం ఏడాది రూ.20,500 కోట్లు, 2015లో రూ.18,000 కోట్లు పెట్టుబడులు పెడితే 2014లో రూ.97,000 కోట్ల వరకు విదేశీ పెట్టుబడులు వచ్చాయి. ఈ ఏడాది విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లతో పోల్చుకుంటే దేశీయ ఇన్వెస్టర్లే పెద్దమొత్తంలో పెట్టుబడులుపెట్టాయి. విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులు ఉపసంహరించుకున్నా మార్కె ట్లు స్థిరంగా కొనసాగాయి. తాజా పరిణామాలను బట్టి చూస్తే ఇన్వెస్టర్లు సంప్రదాయమైన ఇస్తులు ఉదాహరణకు రియల్‌ఎస్టేట్, బంగారం కంటే షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లలో పెట్టుబడులు పెట్టి పెద్దమొత్తంలో ఆదాయం సమకూర్చుకోవచ్చునని నిర్ణయానికి వచ్చారు.



నూతన సంవత్సర వేడుకల్లో
బిట్‌కాయిన్ల చలామణి

ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన సింగపూర్ బార్

న్యూఢిల్లీ : స్టాక్ మార్కెట్ల గురించి తెలియని వారు కూడా ఈఏడాది బిట్‌కాయిన్ గురించి తెలుసుకునే ప్రయత్నం చేశారు. 2017 ఆరంభంలో దాదాపు వెయ్యి డాలర్ల వద్ద కదలాడిన ఈ క్రిప్టో కరెన్సీ.. ఏడాది చివరినాటికి ఏకంగా 20వేల డాలర్ల స్థాయికి దూసుకెళ్లి యావత్ ప్రపంచం నివ్వెర పోయేలా చేసింది. పెళ్లి, పార్టీ ఇలా ఎక్కడ చూసినా బిట్ కాయిన్లకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా న్యూఇయర్ వేడుకల్లో మునిగితేలుతున్నారు. అదే దశలో బిట్‌కాయిన్ ద్వారా బిల్లు పే కోసం సింగపూర్‌లోని ఓ బార్ ముందుకొచ్చింది. నూతన సంవత్సర ఈవెంట్ ప్యాకేజీతో ఈ ఆఫర్ తీసుకొచ్చింది. న్యూఇయర్ పార్టీకి వచ్చేవారిని ఈ బార్ కనువిందు చేయడానికి విలాసవంతమైన సౌకర్యాలు ఏర్పాటు చేసింది. 45వ అంతస్తులో ఈవెంట్ ప్యాకేజీకి బార్ తలుపులు తెరిచింది. బిట్‌కాయిన్‌తో పోలిస్తే.. తక్కువ ధరేం కాదు. కొన్నినెలలుగా బిట్‌కాయిన్ ధర చూస్తుంటే.. ఆదివారం దీని ధర 13వేల డాలర్లు పలికింది. ఈ పార్టీకి బియాంకో అనేపేరు పెట్టారు. ఎదురుగా నీరు.. అందరూ తెల్లని దుస్తువులు వేసుకుని.. డ్రింక్ చేస్తూ.. చిందులు వేస్తూ.. టపాసుల మోత మధ్య కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. బిట్‌కాయిన్ ద్వారా ప్యాకేజీని బుక్ చేయడం ఇదే మొదటి సారి అని, రాత్రంతా ఈ పార్టీ కొనసాగుతుందని, బిట్‌కాయిన్ లేనివారు డబ్బులు కట్టి కూడా న్యూఇయర్ పార్టీని ఎంజాయ్ చేయవచ్చని క్లబ్ నిర్వాహకులు సూచిస్తున్నారు. ఈ కొత్తతరహా ప్యాకేజీ తీసుకురావడానికి లోతుగా విశ్లేషించుకు న్నామని, కానీ దీనిపై ఎవరూ సంతకం చేయలేదని బార్ మేనేజర్ సుభేష్ రాజమాణిక్యం తెలిపారు. బిట్‌కాయిన్‌పై ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు సంపా దించుకుందని, దీన్ని ప్రచారం చేయడానికిగాను ఈతరహా ఆలోచన చేసినట్టు తెలిపారు. సాధారణంగా ఇథీరియం రూపంలో కస్టమర్లు డబ్బులు చెల్లిస్తారు.. కానీ బిట్‌కాయిన్‌లు తీసుకుని పార్టీ నిర్వహించిన ఘనత సింగపూర్ వ్యాప్తంగా తమ బార్‌కే దక్కిందని మేనేజర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ చాలా మంది ఇథీరియంలోనే డబ్బులు చెల్లిస్తుంటారు.

కొందరు మాత్రమే బిట్‌కాయిన్‌లు ఇచ్చి బిల్లు కడుతుంటారు. అస్థిరత, బిట్‌కాయిన్‌కు పెరుగుతున్న విలువే దీనికి కారణం. ప్రస్తుత తరుణంలో క్రిప్టో కరెన్సీ ద్వారా అల్కాహాల్ కొనుగోలు చేయడం అనేది చాలా ఖరీదైందని 47ఏళ్ల ఆర్థికా సలహాదారుడు స్పెన్సర్ క్యాంప్‌బెల్ అన్నారు.



ఈ-వేబిల్లులపై జీఎస్టీ

● ఫిబ్రవరి 1 నుండి అమల్లోకి ● 20శాతం రాబడి పెంచుకునే యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ : జీఎస్టీ రాబడి 20 శాతం పెంచుకోవడానికి కేంద్రం నిబంధనలు కొద్దిగా కఠినతరం చేస్తున్నది. ఫిబ్రవరి 1 నుండి ఎవరైతే అంతర్ రాష్ట్రాలకు ఈవే బిల్లు లేదా ఎలక్ట్రానిక్ వే బిల్లుల ద్వారా సరుకులు రవాణా చేస్తుంటారో వాటిపై జీఎస్టీ బాదనుంది. జులై 1 నుండి జీఎస్టీ అమలులోకి వచ్చిన అనతరం ఈ తరహా బిల్లులపై జీఎస్టీ వేయడానికి సాంకేతిక కారణాలు అడ్డువచ్చాయి. ఈ నేపథ్యంలో అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో చెక్‌పోస్టుల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. 17 రాష్ట్రాల్లో దీనికి సంబంధించి పనులు పూర్తయినట్టు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వివరించారు. ఇప్పటి వరకు జరిగిన లావాదేవీల విషయమై కొందరు డబ్బులు కూడా చెల్లించుకుండా సరుకులు రవాణా చేశారు. ఎప్పుడు అయితే ఈవే బిల్లు పద్ధతి అమలులోకి వస్తుందో జీఎస్టీ రాబడి పెరుగుతుందని ఆయన వివరించారు. రూ.50వేలకు పైన ఖరీదు చేసే సరుకుల రవాణా విషయంలో అమ్మకందారుడికి, కొనుగోలుదారుడికి మధ్య పొంతనలేకుండా ఉంటే పన్ను చెల్లించలేదనే విషయం తెరపైకి వస్తుందని అధికారి వివరించారు. డిసెంబర్ 16న నిర్వహించిన జీఎస్టి కౌన్సిల్ సమావేశంలో ఈ వే బిల్లుపై పన్ను విధించాలని తీర్మానించింది. జూన్ 1 కల్లా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో దీన్ని అమలు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఒకే రాష్ట్రంలో నిర్ణిత కి.మీలు దాటి సరుకులు రవాణా చేయాలనుకుంటే ఈవే బిల్లు అవసరం ఉంటుంది. అంతరాష్ట్ర బిల్లుపై పన్ను బాదుడు ఫిబ్రవరి 1 నుండి ప్రారంభించగా, జూన్ 1 నుండి ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి సంబంధించి విషయమై పన్ను వసూలు చేయనున్నారు. ఈవే బిల్లుపై జీఎస్టీ వసూలు ఎప్పటి నుండి వసూలు చేయాలనే నిర్ణయం రాష్ట్రాలపైనే వదిలేసినట్టు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా ఈవే బిల్లుపై పన్ను వసూలు ప్రక్రియ అనేది కర్నాటకలో అమలు చేయడం జరుగుతున్నదని, ఎంతో విజయవంతంగా ముందుకు సాగుతున్నదని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పన్ను వసూలు చేస్తున్నట్టు వివరించారు. జీఎస్‌టీఎన్ పోర్టల్ ఆధారంగా ఈవే బిల్లు విధానం తీసుకొచ్చారు. రూ.50,000, ఆపై ఖరీదు చేసే ఏ వస్తువు అయినా రిజిస్టర్ అయిన ఈవేబిల్లు లేనిపక్షంలో చెక్‌పోస్టు దాటే వీలుండదు. ఎస్ఎంఎస్‌తో కూడా ఈవే బిల్లును జనరేట్ చేయడం, రద్దు చేయవచ్చు. ఎప్పుడు అయితే ఈవేబిల్లు జనరేట్ అవుతుందో ఆ సమయంలో ఓ సంఖ్య వస్తుంది. ఆ నంబర్ అనేది సప్లయర్, ట్రాన్స్‌పోర్టర్ వద్దకు చేరుతుంది.



ప్రగతి నా ధ్యాస... సంక్షేమమే శ్వాస



నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం రాత్రి విజయవాడలోని పున్నమి ఘాట్‌లో ఐఏఎస్ అధికారుల కుటుంబాలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుటుంబం.

(మొదటిపేజీ తరువాయి)

ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే కృషిని ముమ్మరంగా సాగిస్తున్నాం. మునుపెన్నడూ లేనంతగా ఈ రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. భూసార పరీక్షలు జరిపించి, సూక్ష్మ పోషకాలు అందిస్తున్నాం. పంట కుంటలు, రెయిన్‌గన్లు, మొబైల్ లిఫ్ట్ వంటి వినూత్న పద్ధతుల ద్వారా సాగురంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. పెద్దఎత్తున వ్యవసాయ యాంత్రీకరణ చేపట్టాం. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నాం.

సేద్యంలో టెక్నాలజీ

సేద్యంలో సాంకేతికత అనివార్యం, అవశ్యం. ఈ దిశగా విశాఖలో అగ్రిటెక్ సదస్సు నిర్వహించాం. భూసార పరీక్షలు, విత్తనాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపై మిలిందా గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాం. సహజ వనరుల పరిరక్షణలో భాగంగా ఏరువాక, జలసిరికి హారతి కార్యక్రమాలతో పాటు ఇక ఏటా 'సూర్య ఆరాధన' నిర్వహిస్తాం. వరుసగా వచ్చిన గోదావరి, కృష్ణా పుష్కరాలను వైభవంగా నిర్వహించి ఈ పుణ్యనదులతో మనకున్న అనుబంధాన్ని చాటుకున్నాం.

రాష్ట్రాన్ని ఉద్యానకేంద్రంగా మార్చే ప్రణాళికల్ని అమలు చేస్తున్నాం. వ్యవసాయంలో వృద్ధిరేటు జాతీయస్థాయిలో 2.5 శాతం ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 20.6 శాతం నమోదవ్వడం విశేషం. అది కూడా రాష్ట్రంలో వర్షపాతం గత ఏడాది 30 శాతం ఈ సంవత్సరం 12.5 శాతం తక్కువగా ఉన్నా ఇలాంటి ఫలితాలు సాధించగలగడం మనకు మరింత ఉత్తేజాన్ని అందిస్తోంది. వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. 45 శాతం వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆక్వాహబ్‌గా నిలవడం మనందరికీ గర్వకారణం.

'పట్టిసీమ'తో కొత్త శకం

మన నేలను సంపూర్ణ కరవు రహిత మాగాణంగా మలచుకోవాలన్న మహత్తర లక్ష్యాన్ని ముందు పెట్టుకుని ముందుకు సాగుతున్నాం. జల వనరులను పెంపొందించడానికి ఈ మూడున్నరేళ్లు సాగిన ప్రయత్నం 'ఈ దశాబ్దపు గొప్ప ప్రజోద్యమం'గా పేరు తెచ్చుకుంది. భూమిపై పడే ప్రతి వర్షపుచుక్కను ఒడిసిపడుతున్నాం. నీటిపారుదల రంగంలో 'పట్టిసీమ'కు ముందు, పట్టిసీమ తరువాత అని చెప్పుకునేలా ఒక కొత్తశకాన్ని ఆరంభించాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ఫలాలను ఇంకాస్త ముందే అందుకోవాలన్న తపనతో చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకం నేడు కృష్ణా డెల్టా రైతాంగానికి వరప్రదాయినిగా మారింది. మూడేళ్లుగా ఎగువ కృష్ణా ప్రాజెక్టులనుంచి నీరు రాకపోయినా కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల్లో వరి పండించాం.

'పట్టిసీమ'తో కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం సాధించి 'పవిత్రసంగమం' సృష్టించాం. రెట్టించిన ఉత్సాహంతో రేపు గోదావరి, కృష్ణా, పెన్నా సహా రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం జరిపి 'మహాసంగమం' ఆవిష్కృతం చేయడానికి సన్నద్ధం అవుతున్నాం. దేశ సాగునీటిపారుదల చరిత్రలో ఒక అద్భుతంగా చెప్పతగ్గ పోలవరం ప్రాజెక్టును నిరంతర, నిశిత పర్యవేక్షణతో శరవేగంతో నిర్మిస్తున్నాం. ఇది రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి, వ్యవసాయ స్థిరీకరణకు దోహదపడుతుంది.

దేశంలోనే కాదు, ఈ భూప్రపంచంలోనే అత్యంత శోభాయమానమైన రాజధాని నిర్మాణానికి ఉపక్రమించాం. ప్రపంచ ప్రఖ్యాత రూపకర్తలు అందించిన పరిపాలన నగరపు ఆకృతులకు ఆమోదముద్ర వేశాం. కొత్త ఏడాది ఆరంభంలోనే నిర్మాణ పనులను ప్రారంభిస్తాం.

సామాన్యుడికి ఖరీదైన వైద్యం

ప్రజారోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మకసంస్కరణలు చేపట్టి ఎన్టీఆర్ ఆరోగ్యసేవ, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వంటి వినూత్న పథకాలను తీసుకొచ్చాం. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ప్రతి దశలోనూ అవసరమయ్యే వైద్య, ఆరోగ్య సంరక్షణ చర్యలన్నీ తీసుకుంటున్నాం. ఖరీదైన వైద్యాన్ని సామాన్య, మధ్య తరగతి వారికి అందుబాటులోకి తెచ్చాం. ఏపీని ఒక ఫార్మా హబ్‌గా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ప్రముఖ ఫార్మా కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించాయి.

నాలెడ్జ్ హబ్‌గా...

విద్యారంగంలో రాష్ట్రాన్ని మేటిగా నిలపాలన్నదే ధ్యేయం. ప్రపంచశ్రేణి అత్యుత్తమ విద్యకు ఏపీని గమ్యస్థానంగా తీర్చిదిద్దే కృషిలో నిమగ్నమయ్యాం. ఐఐటీ, ఎన్ఐటీ, ఐసర్, నల్సర్, ఎయిమ్స్ వంటి జాతీయస్థాయి అత్యున్నత విద్యా సంస్థల ఏర్పాటుతో నవ్యాంధ్రప్రదేశ్ నాలెడ్జ్ హబ్‌గా మారుతోంది. ప్రసిద్ధ వైద్య కళాశాలలు అమరావతికి వస్తున్నాయి. ఎస్ఆర్ఎమ్, విఐటి వంటి ప్రముఖ విద్యాసంస్థలు ఇప్పటికే తరగతులు ప్రారంభించాయి. పెట్రోలియం, మెరైన్, లాజిస్టిక్ యూనివర్శిటీలు రాబోతున్నాయి.

దిగ్గజాల రాక...

పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తున్నాం. వ్యాపార అనుకూలతలో ప్రపంచబ్యాంక్ ర్యాంకింగ్‌లో తొలిస్థానం సంపాదించాం. పెట్టుబడులకు స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పి ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలను ఆకర్షిస్తున్నాం. ఆటోమొబైల్ రంగంలో ఇసుజు, కియా, హీరో, అశోక్ లేల్యాండ్, అమరరాజా, అపోలో తదితర దిగ్గజ సంస్థలు వచ్చాయి. వ్యవసాయాధారిత, ఆహారశుద్ధి పరిశ్రమలు వస్తున్నాయి. గుడ్లు, పండ్లు, ఉద్యాన ఉత్పత్తులలో అగ్రగామిగా ఉండటం మాకు కలిసివచ్చే అంశం. వస్త్ర పరిశ్రమ, మొబైల్ పరిశ్రమలు రాష్ట్రానికి పెద్దఎత్తున వచ్చాయి. ఫాక్స్‌కాన్, ఎంఐ, జియోనీ ఇప్పటికే కొలువుదీరాయి. గూగుల్ ఎక్స్, హెచ్‌సీఎల్ వంటి మేటి ఐటీ సంస్థలు వస్తున్నాయి. విశాఖ, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలలో ఏరో స్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవకాశం వున్న టెక్స్‌టైల్స్, అపెరల్ రంగాలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. విశాఖలో రెండు పర్యాయాలు జరిపిన సీఐఐ భాగస్వామ్య సదస్సులలో పెట్టుబడులు పెద్దఎత్తున వచ్చాయి. ముచ్చటగా మూడోసారి ఫిబ్రవరి 24, 25, 26 తేదీలలో నిర్వహించబోయే భాగస్వామ్య సదస్సు అనూహ్య ఫలితాలను అందిస్తుందని ఆశిస్తున్నాం.

ముమ్మరంగా మౌలిక సదుపాయాలు

మౌలిక సదుపాయాల కల్పనలో చురుగ్గా పనిచేస్తున్నాం. పోర్టులు, ఎయిర్‌పోర్టులలో అద్భుతమైన పురోగతి కనిపిస్తోంది. ఇప్పటికే 6 పోర్టులలో పూర్తిస్థాయి కార్యకలాపాలు సాగుతున్నాయి. మరో 8 ఓడరేవులను అభివృద్ధి చేస్తున్నాం. సముద్ర ఆధారిత వాణిజ్యం పెంపొందించి మన ఆంధ్రప్రదేశ్‌ను 'తూర్పుతీరపు ముఖద్వారం'గా మార్చాలన్నదే ఆశయం. ప్రస్తుతం వున్న 6 విమానాశ్రయాలకు అదనంగా మరో 6 విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నాం. మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, ఒక కోస్టల్ ఎకనామిక్ జోన్ రానున్నాయి. విశాఖ-చెన్నై, బెంగళూరుచెన్నై, బెంగళూరు-కర్నూలు ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటుతో ఈ రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రం మారిపోనుంది.

రాష్ట్రంలో నగరీకరణ ముమ్మరంగా జరుగుతోంది. విశాఖ, అమరావతి, తిరుపతి నగరాలను 3 మెగా సిటీలుగా అభివృద్ధి చేస్తున్నాం. మరో 14 స్మార్ట్ నగరాలను రూపొందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఇంటికి 100 శాతం గ్యాస్, విద్యుత్ కనెక్షన్లను అందించాం. గ్రామాలలో 10,044 కిలోమీటర్ల మేర సిమెంట్ రహదారులను నిర్మించాం. మరో 3 వేల కి.మీ. సీసీ రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి.

మూడేళ్ల క్రితం 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటుతో మొదలైన మన ప్రయాణం ఇప్పుడు ఆ రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా మార్చింది. సౌర, ఇతర సంప్రదాయేతర విద్యుత్, ఇంధన సామర్థ్యం అంశాలలో భారతదేశానికే ఆదర్శంగా నిలిచాం. విద్యుత్ రంగంలో ఎన్ని పురస్కారాలు వుంటే అన్ని పురస్కారాలను కైవసం చేసుకున్నాం. కర్నూలులో ఏర్పాటు చేస్తున్న సౌర విద్యుత్ పార్క్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రాజెక్టు. త్వరలో 4,600 మెగావాట్ల సౌర, పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాం. యూనిట్ రెండు రూపాయిలకే సౌర విద్యుత్ అందించి 'సూర్యోదయ రాష్ట్ర'మనే పేరుకు సార్ధకత తీసుకొస్తాం. సౌర, ఇతర సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి రంగంలో అనేక అంతర్జాతీయ సంస్థలు ఏపీతో కలిసి పనిచేస్తుండటం సంతోషదాయకం.

ఈ-ప్రగతితో పారదర్శకత

'ఈ-ప్రగతి'తో పాలనలో పారదర్శకత తీసుకొచ్చాం. అన్ని ప్రభుత్వశాఖలను 100 శాతం కంప్యూటరీకరించాం. మూడవ పారిశ్రామిక విప్లవంలో ఆనాడు ఐటీని బాగా ప్రమోట్ చేశాం. ఇప్పుడు నాలుగో పారిశ్రామిక విప్లవం రోజుల్లో ఐవోటీని విస్తృతంగా వినియోగిస్తున్నాం. 15 ఏళ్ల పాటు ప్రతి ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించాలన్నదే లక్ష్యం. 80 శాతం ప్రజా సంతృప్తే అంతిమ ధ్యేయం. కుటుంబ వికాసం, సమాజ వికాసం ఇండికేటర్లుగా తీసుకున్నాం. సంతోష సూచికను ముందు పెట్టుకుని పనిచేస్తున్నాం. మహిళా సాధికారత సాధిస్తున్నాం. ప్రతి కుటుంబానికి నెలకు కనీసం రూ. 10 వేల ఆదాయం దక్కేలా సంకల్పించాం. రాష్ట్ర ప్రజలకు సామాజిక భద్రత, నీటి భద్రత, ఆహార భద్రత, ఆరోగ్య భద్రత, గ్యాస్ భద్రత కల్పిస్తున్నాం. 45 లక్షల పింఛన్లను ఇస్తున్నాం. పేదవాళ్లు కూడా పండగ చేసుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమైన పర్వదినాల్లో 'చంద్రన్న కానుక'లను అందిస్తున్నాం. 28 వేల చౌక ధరల దుకాణాలను 'చంద్రన్న మాల్స్'గా తీర్చిదిద్దుతున్నాం. ఇందులో 500కు పైగా వస్తువులను రాయితీపై అందిస్తాం. రాష్ట్ర ప్రజలకు ఇది నూతన సంవత్సర కానుక. 'చంద్రన్న బీమా'తో కార్మిక కుటుంబాలకు గుండె ధైర్యాన్ని ఇచ్చాం. ప్రభుత్వ ఉద్యోగులకు అండదండగా ఉన్నాం. పెద్దఎత్తున చేపట్టిన పట్టణ, గ్రామీణ గృహ నిర్మాణాలతో కొత్త ఏడాది గృహప్రవేశాలు చేయించబోతున్నాం.

ఓడీఎఫ్ రాష్ట్రంగా....

స్వచ్ఛాంధ్రప్రదేశ్ మిషన్ కింద రాష్ట్రంలో 16,36,713 మరుగుదొడ్లను నిర్మించాం. ఇప్పటివరకు 6 జిల్లాలను, 5,746 గ్రామాలను ఓడీఎఫ్‌గా ప్రకటించాం. ఈ ఏడాది మార్చి నాటికి మిగిలిన 7 జిల్లాలను ఓడీఎఫ్‌గా మార్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నాం. ఆంధ్రప్రదేశ్‌ను 2022 నాటికి దేశంలోని మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా, 2029కల్లా దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా, 2050 నాటికి అత్యున్నత ప్రమాణాలు గల ప్రపంచ గమ్యస్థానంగా మలచాలన్నది మన విజన్. కొండలను పిండి చేయగల శక్తి మన తెలుగువారికి ఉంది. ఆ శక్తియుక్తులతోనే ఏనాడో వారు ప్రపంచాన్ని గెలిచారు. ఇవాళ అమెరికా సిలికాన్ వ్యాలీలో నివసిస్తున్న తెలుగువారి తలసరి ఆదాయం అక్కడున్న అందరి కంటే ఎక్కువ.

మనకు ప్రకృతి ఎంతో ఇచ్చింది. మన పొలాలను సస్యశ్యామలం చేయగల అపారమైన జలరాశి ఈ నేలకు సిరి. సుమారు వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరం మన సొంతం. విస్తారమైన ఖనిజ సంపద మన ఆస్తి. విద్యాప్రావీణ్యులైన యువశక్తి మన సైన్యం. చురుకైన మహిళాశక్తి మన బలం. కష్టించి పనిచేసే రైతాంగం మన వారసత్వం. వ్యాపార, పారిశ్రామిక రంగాలలో అమితంగా రాణించగలిగే దక్షత మన స్వభావం. అన్నింటినీ మించి గొప్ప ఆత్మవిశ్వాసం మనకు నిజమైన సంపద. వీటన్నింటినీ సమర్థంగా అనుసంధానం చేసుకోగలిగితే రానున్న 50 ఏళ్లలో తెలుగువారికి ఇక తిరుగులేదు.

నేను కష్టజీవిని...

రాష్ట్రప్రగతే మంత్రంగా నాతోపాటు అడుగులు వేస్తూ మీరంతా ఈ ప్రగతి ప్రస్థానాన్ని ఇలాగే కొనసాగిస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. నేను కష్టజీవిని. మన రాష్ట్ర ప్రగతి, మీ అందరి పురోగతి నా నిరంతర ధ్యాస. అదే నా వ్రతం. మీ అందరి శ్రేయస్సుకు, సంక్షేమానికి, సర్వతోముఖ వికాసానికి నేను దీక్ష తీసుకున్నాను. మీకు భరోసాగా నిలుస్తాను. మీ భవితకు బావుటానవుతాను. నా జీవితంలో ప్రతి క్షణం మీకే అంకితం. ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్‌ను అత్యుత్తమ నమూనాగా నిలపాలన్నదే నా ఆకాంక్ష.

సంక్రాంతికి ముందే వచ్చే పెద్ద పండగ 'జన్మభూమి-మా ఊరు'. సంక్రాంతి ఊళ్లో జరుపుకునే పండగయితే, 'జన్మభూమి-మా ఊరు' ఊరికే పండగ. ఈ పండక్కి తెలుగువారు ఎక్కడున్నా రావాలి. వచ్చి సొంతఊళ్లో సంబరాలు జరుపుకోవాలి. సంతోషంగా ఉండాలి. సొంతగడ్డ రుణం తీర్చుకోవాలి. మీ ఇంటి పెద్దకొడుకుగా ఇది నేనిస్తున్న పిలుపు.

జై జన్మభూమి.. జైహింద్..

నారా చంద్రబాబునాయుడు

ఈ జన్మకిది చాలు

• 2020 జనవరి 12న రాజకీయాల నుంచి వైదొలుగుతున్నా • ప్రధాన మంత్రి పదవిపై ఆశలేదు.. నాకా అర్హత లేదు • ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ : మారుమూల పల్లెల్లో పుట్టిన తాను కృషి, పట్టుదల, అంకితభావం అనే మెట్లు ఎక్కి అంచెలంచెలుగా ఎదిగి ఈరోజున భారత దేశంలో రెండో స్థానంలో నిలిచానని, ఈ జన్మకు తనకు అది చాలని భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విజయవాడలో మీడియాతో మాటా-మంతీ అంటూ ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అనేక ఆసక్తికర విషయాలను చెప్పారు. తన అంతరంగాన్ని నర్మగర్భంగా ఆవిష్కరించారు. రైతు బిడ్డగా వ్యవసాయం అభివృద్ధి చెందితేనే భారత దేశం అభివృద్ధి చెందుతుందంటూ ఆయన వ్యవసాయ రంగంపై తనకున్న మక్కువను తెలియజేశారు. ఎన్నో ఉన్నత పదవులను అలంకరించినా తానెప్పుడూ ఒక తెలుగువాడినేనంటూ మాతృ భాషపట్ల తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. తాను 2020 జనవరి 12న రాజకీయాల నుండి పదవీ విరమణ పొందుతున్నట్లు నిష్కర్షగా చెప్పారు. ప్రధాన మంత్రి పదవిపై తనకెటువంటి ఆశ లేదని, ఆ పదవికి తనకెటువంటి అర్హత లేదంటూ చెప్పి తన నిరాడంబరతను తెలియజేశారు.


అనేక సంవత్సరాలుగా ప్రజా జీవితంలో ఉండి ప్రజా ఉద్యమాల్లో ఎదిగి, పెరిగి, అనేక విషయాలు తెలుసుకుని, ఇతరులకు తెలియజేసి రాజకీయాల్లోకి ప్రవేశించి, రాజకీయాల్లో వివిధ స్థాయిలోల ఎదిగి, ఒదిగి, దేశమంతా తిరిగి ఇలా పెరిగి ఈ రోజు ఈ స్థానానికి చేరుకున్నానని చెప్పారు. రాజకీయాల్లో తనకు ఇంతకన్నా కోరిక లేదన్నారు. తనకు ఇంతకన్నా ఏమి కావాలంటూ ప్రశ్నించారు. దీని తరువాతది ఏ పదవి ఉంటుందో తనకు తెలుసన్నారు. అది ప్రధాని పదవేనన్నారు. దానికి తనకు అర్హత లేదని, ఆసంగతి తనకు తెలుసని అన్నారు. ఇంక రాజకీయాల్లో తనకు ఏ కొరత గానీ, ఆ కోరిక తీరలేదని కానీ తన మనసులో లేదని చెప్పారు. అయితే, తనకొక కోరిక ఉందని, అది తీరలేదంటూ దాని గురించి తరువాత చెబుతాని పేర్కొన్నారు. తాను 2019 ఎన్నికల వరకు రాజకీయాల్లో ఉండి 2020 జనవరి 12న రాజకీయాల్లోనుండి విరమించుకుంటానని తెలిపారు. అనంతరం తాను సమాజసేవకు పునరంకితమవుతానని చెప్పారు.

తోటివారికి తోడ్పాటుతోనే జీవితానికి సార్థకత

సమాజంలో ప్రతి ఒక్కరూ తోటి వారికి ఎంతో కొంత తోడ్పాటును అందించినప్పుడే జీవితానికి సార్థకత చేకూరుతుందని , రానున్న నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఈ సూత్రాన్ని ఆచరించాలని భారత ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడ సమీపంలోని ఆత్కూరు స్వర్ణభారతి ట్రస్ట్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ సమాజానికి తమ వంతు సేవగా స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా ప్రయోజనకరమైన పనుల ద్వారా సమాజ సేవ అందించవచ్చుని , పత్రికలు కూడా దీనిని సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రజ ల్లో చైతన్యం వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో 2,300మందికి శిక్షణ అందించి వారి జీవితాల్లో స్థిరపడేవిధంగా తోడ్పాటును అందించామని ఈ సందర్భంగా ఎలిప్ సస్థకు చెందిన బ్రోచర్‌ను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్క రించారు. స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ర్యాంక్, వివిధ వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న వా రికి ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్, మచిలీపట్నం ఎంపి కొనకళ్ళ నారాయణ, స్వర్ణభారతి ట్రస్ట్‌సభ్యులు , ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాటలతో తప్ప రాతలతో బాధించలేదు!

• గురువులు, కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది • వీడ్కోలు కార్యక్రమంలో నండూరి



అమరావతి, ఆంధ్రప్రభ: 'ఉన్నతంతా తీర్చిదిద్దిన గురువులు..వెన్నంటి ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు..విధి నిర్వహణలో ప్రభుత్వ సహకారం, పోలీసు సిబ్బంది పనితీరు మరువలేను...' అంటూ డీజీపీగా పదవీ విరమణ చేసిన నండూరి సాంబశివరావు అన్నారు. 33 ఏళ్ల సర్వీసులో మాటలతో తప్ప రాతలతో ఏ ఒక్కరినీ నొప్పించలేదంటూ ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. రాష్ట్ర డీజీపీగా నండూరి సాంబశివరావు పదవీ విరమణ కార్యక్రమాన్ని పురస్కరించు కుని మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఆదివారం పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించింది. తొలుత రాష్ట్రంలోని ఏపీఎస్పీ బెటాలియన్ల కంటింజెన్సీ బృందాల గౌరవ వందనాన్ని స్వీకరించి, కవాతు పరిశీలించారు. ఈ సందర్భంగా నండూరి మాట్లాడుతూ హైస్కూలు స్థాయిలో అధ్యాపకులు బాలకృష్ణమూర్తి, రామకృష్ణారావు తనను ఉన్నతంగా తీర్చిదిద్దారంటూ వారికి పాదాభివందనం చేస్తున్నట్లు చెప్పారు. విధి నిర్వహణలో ఎదురైన అనేక ఒడిదుడుకులను అధిగమించేందుకు తల్లిదండ్రులు, భార్యాపిల్లలు అందించిన సహకారమే కారణమన్నారు. పోలీసు శాఖలో తన ప్రవేశం మొదలు సమాజ శాంతి స్థాపనలో అశువులు బాసిన అధికారులు, సిబ్బందిని స్మరించుకున్నారు. తాను 1987లో బెల్లంపల్లి ఎఎస్పీగా బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్రం ఎన్నో ఒడిదుడుకుల్లో ఉందన్నారు. తీవ్రవాద సమస్య తీవ్రంగా ఉండేదని చెపుతూ ఐపీఎస్ అధికారులు కె.ఎస్.వ్యాస్, ఉమేష్‌చంద్ర, పరదేశినాయుడు సహా 600 మంది సిబ్బంది ప్రాణ త్యాగం చేసి సమాజంలో శాంతికి కృషి చేసినట్లు చెప్పారు. అనేకసందర్భాల్లో తప్పులు చేసిన వారిని మందలించానే తప్ప శాఖాపరమైన చర్యలు తీసుకోలేదన్నారు. నాగపూర్ సివిల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్నప్పుడు ఓ పీఈటీ ఇచ్చిన సలహాను ఇప్పటికీ పాటించడం వలనే తప్పుచేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోలేదన్నారు. పద్దెనిమిది నెలల తన పదవీ కాలంలో సీఎం, హోంశాఖామంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఎంతగానో సహకరించారని, అందుకు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెపుతున్నానన్నారు. గత దశాబ్దకాలంగా నిర్వహించిన పదవులకు తాను అలంకారంగా మారానే తప్ప తనకు పదవులు ఎప్పుడూ అలంకారం కాలేదన్నారు. తనకు ఇంతటి గౌరవం ఇచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు చెపుతూ రానున్న రోజుల్లో వారి కుటుంబాలు ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన మాలకొండయ్య

శాంతి భద్రతలపై రాజీపడొద్దంటూ ఆదేశాలు



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ నూతన పోలీసు డైరెక్టర్ జనరల్(డీజీపీ)గా డాక్టర్ మన్నం మాలకొండయ్య బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 12.15గంటలకు నండూరి సాంబశివరావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. 1985 బ్యాచ్‌కి చెందిన మాలకొండయ్యను డీజీపీగా నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మాలకొండయ్య ఉమ్మడి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విధులు నిర్వహించారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన మాలకొండయ్యను విజయవాడ పోలీసు కమిషనర్ దామోదర గౌతమ్ సవాంగ్, ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఆర్.పి.ఠాకూర్, ఇంటిలిజెన్స్ చీఫ్ ఎ.బి.వెంకటేశ్వరరావు, సిఐడీ చీఫ్ సిహెచ్.ద్వారకా తిరుమల రావు, గ్రేహౌండ్స్ అధిపతి ఎన్.వి.సురేంద్రబాబు, శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ హరిష్ గుప్తా, ఐజీలు, రేంజ్ డీఐజీలు, సిఐడీ, ఇంటిలిజెన్స్ విభాగాల ఎస్పీలు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు.

యజ్ఞంలా ప్రకృతి సేద్యం

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. దీనివలన రైతుల పెట్టుబడులు పెరగడంతోపాటు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోలేక పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టాల బారిన పడుతున్నారని వివరించారు. వీటన్నింటికీ పరిష్కారం ప్రకృతి వ్యవసాయమే మార్గమని సీఎం సూచించారు.

నవ్యాంధ్రను ప్రకృతి సేద్య రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. అందులో భాగంగానే రైతులకు సంపూర్ణ అవగాహన కలిగేందుకు ఈ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జనవరి 8 వరకు శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని రాష్ట్రంలోని వివిధ జిల్లాల రైతులే కాకుండే ఇతర రాష్ట్రాల రైతులు కూడా ఈ శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు సీఎం తెలిపారు. అంతేకాకుండా వివిధ దేశాల నుంచి 300 మంది ఐటీ నిపుణులు ఆన్‌లైన్లో పేర్లు నమోదు చేసుకొని శిక్షణకు వచ్చేందుకు ఆసక్తి చూపడం విశేషమన్నారు. భవిష్యత్‌లో ఐటీ రంగ నిపుణులు తమ ఉద్యోగులు తమ ఉద్యోగాలను వీడి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపనున్నట్లు ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రస్తుత శిక్షణా కార్యక్రమాల్లో 13 జిల్లాల నుంచి 8 వేలమంది రైతులతోపాటు, తెలంగాణా నుంచి 5 వేల మంది రైతులు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకొందన్నారు.

ప్రకృతి సేద్యానికి పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ఆశాజ్యోతి, వెలుగురేఖ లాంటి వారని సీఎం ప్రశంసించారు.

రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ఇటీవల అమరావతి పర్యటనలో సచివాలయంలో ప్రకృతి సేద్యంతో పండించిన ఉత్పత్తులతో చేసిన వంటలతో విందునివ్వడం జరిగిందన్నారు.

రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాల్సిందిగా వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్‌ను ఆహ్వానించారు. యూనివర్శిటీ ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అంతేకాకుండా పాలేకర్‌ను రాష్ట్రప్రభుత్వ ప్రకృతి వ్యవసాయ సలహాదారుగా కూడా నియమించినట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. పైసా వేతనం తీసుకోకుండా పాలేకర్ వ్యవసాయ రంగానికి సలహాలు సూచనలు అందిస్తారన్నారు.

సభలో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సుమారు 700 కోట్ల వ్యయంతో 12.50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్య విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ 100 కోట్ల ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. దేశ విదేశ సంస్థలు కూడా ప్రకృతి సేద్య అమలుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో మారిషస్ హై కమిషనర్ జగదీశ్వర్ గోవర్ధన్, ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్, మేఘాలయ వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ , స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, శాసనమండలి విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆహార భద్రతా కమిషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్, మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, రావెల కిషోర్‌బాబు, ఎమ్మెల్సీ రామకృష్ణ, జడ్పీ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరి జవహర్‌లాల్, కలెక్టర్ కోన శశిధర్, జాయింట్ కలెక్టర్ ముంగా వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు విజయభారతి, వివిధ శాఖల అధికారులు, 13 జిల్లాల నుంచి వచ్చిన రైతులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ట్రాయ్‌పై గడ్కరీ అసంతృప్తి

(మొదటిపేజీ తరువాయి)

నేరుగా రాజమండ్రి చేరుకుని అక్కడి నుంచి పోలవరం ప్రాజెక్టును సందర్శించి, పనులను క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి పరిశీలిస్తారంటున్నారు. ట్రాన్స్‌స్ట్రాయ్ వ్యవహారం ముదురుపాకాన పడిన నేపథ్యంలో గడ్కరీ పోలవరం సందర్శనకు రావడం ప్రత్యేకత సంతరించుకుందంటున్నారు. ఈ విషయంలో నితిన్ గడ్కరీ ఒకింత ఆగ్రహంతో ఉన్నారని అంటున్నారు. కీలకమైన ప్రాజెక్టు పనులు చేస్తూ, బ్యాంకులకు రుణాలు ఎగవేతపై ఆయన మండిపడుతున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. పర్యటన సందర్భంగా ఆయన ప్రాజెక్టు క్షేత్రంలోనే సంబంధిత శాఖల ఉన్నతాధికారులు,ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషన్‌కుమార్, ఇతర ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో ప్రాజెక్టు క్షేత్రంలోనే ప్రత్యేకించి, సమావేశమవుతారని సమాచారం. ముఖ్యంగా ట్రాన్స్‌ట్రాయ్ వ్యవహారంపై సుదీర్ఘంగా చర్చిస్తారంటున్నారు. అంతేకాకుండా తీసుకున్న నెల రోజుల గడువులో ఇప్పటికే సగం రోజులు ముగిశాయి. గడ్కరీ పర్యటన నాటికి ట్రాన్స్‌ట్రాయ్ చేసిన హెడ్ వర్క్‌కు సంబంధించి చేసిన పనులపై పూర్తి స్థాయిలో సమీక్షిస్తారు. ఈమేరకు ఇప్పటికే ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ ప్రతినిధులకు కూడా సమాచారం పంపినట్లు తెలిసింది. టెండర్లు ఖరారైనప్పటి నుంచి ఇప్పటివరకు కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన పనుల పురోగతి, ఆధునిక యంత్ర సామాగ్రి, నిపుణత, తీసుకున్న అమౌంట్, పెండింగ్ బిల్లులు, పెరిగిన అంచనా వ్యయం తదితర వివరాలపై గడ్కరీ ట్రాన్స్‌ట్రాయ్ ప్రతినిధులతో చర్చించే అవకాశం ఉందంటున్నారు.ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నితిన్ గడ్కరీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించే అంశంపై కేంద్ర, రాష్ట్రఅధికారులతో సమీక్షిస్తారని తెలిసింది. గత నెల 13వ తేదీన ఢిల్లీ వెళ్లిన సీఎం చంద్రబాబునాయుడు నితిన్ గడ్కరీతో సమావేశమై ప్రాజెక్టు పనులపై చర్చించగా 22న పోలవరం ప్రాజెక్టు వద్దకు వస్తానని గడ్కరీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ లోపు పలు విధాలుగా సంబంధిత అధికారులను క్షేత్రస్థాయికి పంపించి, పనులు ఏ స్థాయిలో నడుస్తున్నాయో పరిశీలింపజేసి,నివేదికలు తెప్పించుకున్నారు. వాటిని అధ్యయనం చేసిన తర్వాతే సందర్శనకు వెళ్లాలనే ఉద్దేశంతో పర్యటనను వాయిదా వేసుకున్నారనే ప్రచారం కూడా ఉంది. అందులో భాగంగానే ఆయన ఈలోగా పోలవరం ప్రాజెక్టు పనులను తనిఖీ చేసి, నివేదికలు ఇచ్చేందుకు వ్యాప్కోస్ కమిటీ, తన సలహాదారు సంజయ్ పుల్కర్‌ను ప్రాజెక్టు వద్దకు పంపి.పనులు తనిఖీ చేయించారంటున్నారు. అందులో భాగంగానే మళ్లీ జనవరి 2 లేదా 3న కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్‌ను కూడా క్షేత్ర స్థాయి పరిశీలనకు పంపబోతున్నారని అంటున్నారు. అంతేకాకుండా ఆయన బీజేపీ ప్రజా ప్రతినిధుల నుంచి కూడా పోలవరం సమస్త సమాచారాన్ని ఢిల్లీకి తెప్పించుకున్నారని అంటున్నారు. అలాగే నిఘా వర్గాల నుంచి కూడా ఆయన పూర్తి సమాచారాన్ని స్వీకరించారని అంటున్నారు. ఇలా ఉంటే కాఫర్‌డ్యామ్ సాధ్యాసాధ్యాలు, ఇతర పనులను పరిశీలించి,వెళ్లిన జాతీయ విద్యుత్పాదన హైడల్ పవర్ కార్పొరేషన్ నిపుణుల కమిటీ (ఎన్‌హెచ్‌పీసీ) ఇచ్చిన నివేదికపై కూడా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తారంటున్నారు.కేంద్రం నియమించిన ఎన్‌హెచ్‌పీసీ నిపుణుల కమిటీ ఇటీవల పోలవరంపై నితిన్ గడ్కరీకి నివేదిక అందజేసిన సంగతి తెలిసిందే. అందులో కొన్ని పనుల పురోగతిపై నిపుణుల కమిటీ కొంత అసంతృప్తి వ్యక్తం చేసిందంటున్నారు. కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి అడ్డుచెప్పకుండానే తక్కువ ఖర్చుతో ఎలా.. ఎక్కడ,ఏ సందర్భంలో నిర్మించవచ్చనే విషయంపై కొన్ని సూచనలు చేసిందంటున్నారు. ముఖ్యంగా ప్రాజెక్టు హెడ్ వర్క్‌కు సంబంధించి స్పిల్‌వే,స్పిల్ చానల్ కాంక్రీట్ పనుల్లో అనుకున్నంత రీతిలో పురోగతి లేదని స్పష్టం చేసిందంటున్నారు. నదీ ప్రవాహాన్ని స్పిల్‌వే వైపునకు మళ్లించే అప్రోచ్ చానల్‌లో మట్టి తవ్వకం పనులతో పాటు స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులకు సంబంధించి లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు చేయాల్సి ఉందని,వీటిల్లో నిర్దేశిత లక్ష్యం మేరకు పనులు జరగడం లేదనే అంశాన్ని నిపుణుల కమిటీ నివేదికలో ప్రస్తావించిందంటున్నారు. స్పిల్‌చానల్‌కు సంబంధించిన కొండను తొలిచే పనులపై కూడా అసంతృప్తి వ్యక్తం చేసిందంటున్నారు. పైలెట్ చానల్‌లో ఇంకా 30 లక్షల క్యూబిక్ మీటర్లు, స్పిల్‌వే లో 8.41 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, 48గేట్లను బిగించే పనులు పూర్తి చేయాల్సి ఉంది. స్టిల్లింగ్ బేసిన్‌లో 3.46 లోల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు, స్పిల్ చానల్‌లో 18 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు మిగిలిపోయాయి. ఎర్త్‌కమ్‌రాక్‌ఫిల్ డ్యామ్ పునాది (డయాఫ్రమ్ వాల్) పనులు కేవలం 51.8 శాతమే (739.4 మీటర్లు), పూర్తయ్యాయంటున్నారు. కుడి,ఎడమ వైపున కాలువలకు నీళ్లందించేలా నిర్మిస్తున్న హెడ్ రెగ్యులేటర్, సొరంగాల పనుల్లో కూడా పెద్దగా పురోగతి లేదని నిపుణుల కమిటీ నివేదికలో స్పష్టం చేసిందంటున్నారు. ఈ పనులన్నీ పూర్తి చేయకుండానే 2018 జూన్ నాటికి గ్రావిటీ ద్వారా కాలువలకు, నీరు ఎలా సరఫరా చేయడం సాధ్యమవుతుందని కమిటీ తన నివేదికలో ప్రశ్నించిందంటున్నారు. ఈ క్రమంలో నితిన్ గడ్కరీ పర్యటనపై పెద్ద ఎత్తున అంచనాలు పెరిగాయి. ఈ అన్ని అంశాలపైనా ఆయన ఏ విధంగా స్పందిస్తారోనని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

S & D



రికార్డు స్థాయిలో
వైకుంఠద్వార దర్శనం

తిరుమల, ప్రభ న్యూస్: వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రెండు రోజులకు కలిపి రికార్డు స్థాయిలో 1.75 లక్షల మందికి టీటీడీ వైకుంఠ ద్వార దర్శనం కల్పించింది. డిసెంబర్ 29న వైకుంఠ ఏకాదశినాడు తిరుమల మొత్తం భక్తులతో నిండిపోయింది. ఏకాదశినాడు 74,012 మంది వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. ద్వాదశినాడు మొత్తం 1,01,246 మంది వైకుంఠద్వారంలో ప్రవేశించారు. ఈ రెండు రోజుల్లో 1,75,258 మంది భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించి టీటీడీ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించింది.

24న తిరుమల శ్రీవారి ఆలయంలో రథసప్తమి

తిరుమల, ప్రభ న్యూస్: సూర్యజయంతిని పురస్కరించుకుని జనవరి 24న తిరుమల శ్రీవారి ఆలయంలో రథసప్తమి ఉత్సవాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించనున్నది. రథసప్తమి పర్వదినాన స్వామివారు ఒకేరోజున ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగే కారణంగా, రథసప్తమిని ఒకరోజు బ్రహ్మోత్సవాలని కూడా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమంత వాహనాలతో పాటు చక్రస్నానం అనంతరం కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు దర్శన మిస్తారు.

నూతన సంవత్సరంలోనైనా వైసీపీ
సహకరించాలి

చంద్రబాబు విధానాలతోనే 11.70 శాతం వృద్ధి: దినకర్

అమరావతి, ఆంధ్రప్రభ: నూతన సంవత్సరంలోనైనా ప్రతిపక్షపార్టీ రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. ఆదివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గడిచిన సంవత్సరంలో ప్రతిపక్షనేత జగన్ వైసీపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకొని వారి హక్కులను కాలరాశారని మండి పడ్డారు. అదేవిధంగా కేంద్రానికి లేఖలు రాస్తూ, పోలవరాన్ని అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారని, ఉపాధి హామీపథకంపై కేంద్రానికి లేఖలు రాసి ఉపాధి కూలీల కడుపులు కొట్టారని ఆగ్రహించారు. 2017సంవత్సరాన్ని అభివృద్ధి-సంక్షేమం ప్రాధాన్యతతో దూసుకెళ్లే విధంగా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు 2018 సంవత్సరానికి దశ, దిశ నిర్దేశించారన్నారు.

జనవరి 8న విజయవాడలో
విద్యుత్ ఉద్యోగుల మహాసభ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జనవరి 8న విజయవాడలో విద్యుత్ ఉద్యోగుల మహాసభను నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ విద్యుత్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తాత్కాలిక కమిటీ ఏన్నుకున్నట్టు సంఘం నేతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా వీరభద్రయ్యను, ప్రధానకార్యదర్శిగా గణేష్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. పూర్తిస్థాయి కమిటీని జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకోవాలని నిర్ణయించినట్టు వారు తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో నారాయణరావు, శ్రీనివాసులు, రామకృష్ణ, రాంబాబు, చలపతి, శ్రీధర్, మురళీ, ప్రసాద్, శ్రీను, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. పాత కమిటీ అధ్యక్షులు పోలంకి శ్రీనివాసరావు కాపు రిజర్వేషన్‌ను సమర్ధిస్తూ కాపు ఉద్యమంలో పాల్గొంటున్నందున ఆయనను శాశ్వతంగా సంఘం నుంచి తొలగించినట్టు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. బీసీలకు ఉద్యోగాల నియామకంలో ఉన్న క్రిమీలేయర్‌ను ఎత్తేయాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల మహాసభలో సీక్రెట్ బ్యాలెట్ ద్వారా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకుంటామని స్పష్టం చేశారు.

మరో డ్రగ్స్ రాకెడ్ గుట్టు రట్టు
ఇద్దరు నైజీరియన్ల పట్టివేత


హైదరాబాద్, ఆంధ్రప్రభ: మరో డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టయింది. ముఠాలోని ముగ్గురు నైజీరియన్లలో ఇద్దరిని అగబ్బ్యా చిడిబబుచే చుక్యామా, సండే ప్రిస్కిలియా ఒలూచి ఉజున్వాలు పోలీసులకు చిక్కగా మూడో సభ్యుడైన బెంజామిన్ పరారీలో ఉన్నాడు. టోలిచౌక్ కేంద్రంగా వీరు డ్రగ్స్ సరఫరా, విక్రయాలకు పాల్పడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌వోటీ రాచకొండ, ఎల్బీనగర్ జోన్ టీమ్ సంయుక్తంగా దాడులు నిర్వహించి ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన నిందితుల వద్ద నుంచి రూ.16.70 లక్షల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 16 గ్రాముల కొకైన్, 23 గ్రాముల హెరాయిన్, 40 గ్రాముల అల్ర్పాజోలం, 15 గ్రాముల ఆంపిటమైన్, 7 ఎంకే జీహెచ్‌పీ స్టెరాయిడ్ ఒక కేజీ గంజాయి ఉన్నాయి. వీటితో పాటు స్విఫ్ట్ కారు (నెం.ఏపీ 05 ఏపీ-9282), ఐదు మొబైల్ ఫోన్‌లు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఎ1 నిందితుడి పాస్‌పోర్టుని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. న్యూ ఇయర్ వేడుకలను టార్గెట్‌గా చేసుకుని డ్రగ్స్ సరఫరా, విక్రయాలకు పాల్పడుతున్న డ్రగ్స్ ముఠాల పని పడుతున్నారు పోలీసులు. హైదరాబాద్‌లో కోటి విలువైన కొకైన్ పట్టుకోగా.. తాజాగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 16 లక్షల విలువ చేసే (కొకైన్‌తో సహా) డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ డ్రగ్స్ కేసులో డ్రగ్స్ మాఫియాలు ఏ విధంగా చెలరేగిపోయాయో వేర చెప్పనవసరం లేదు. ఆఖరికి 8,9 తరగతి చదివే విద్యార్థులను సైతం డ్రగ్స్‌కు బానిసలను చేశాయి. దీంతో కీలక వ్యక్తులైన కాల్విన్, మైక్ కమింగా, గాబ్రియేల్, లేడీ డాన్ సంగీతలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి ఫోన్ కాల్ డేటా ఆధారంగా 12 మంది సినీ స్టార్స్‌ను సైతం ఎక్సైజ్ సిట్ సుదీర్ఘ విచారణ జరిగింది. కాగా, ఆ కేసులో విచారించిన స్టార్స్‌లో కొందరి శాంపిల్స్ తీసుకుని ఎఫ్ఎస్ఎల్‌కు ఎక్సైజ్ సిట్ పంపింది.

తెలుగు ప్రజలకు ప్రముఖుల
నూతన సంవత్సర శుభాకాంక్షలు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కు ఉమ్మడి రాష్ట్రా ల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరం 2018 ప్రతి పౌరుడిని ఆనందోత్సాహాలతో నింపాలని ఆయన ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ సోమవారం రాజ్‌భ వన్‌లోని దర్బార్ హాలులో ప్రజలు, ప్రజాప్రతినిధులను కలుస్తారు. సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గవర్నర్ కార్యాలయం ప్రెస్ సెక్రెటరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గవర్నర్ అందుబాటులో ఉంటారు.

ప్రతి ఒక్కరికి విజయాలు చేకూరాలి: సీఎం చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ఎపీ సీఎం నారా చంద్రబాబునాయుడు నూతన సంవత్సరం 2018 శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరం ప్రతి కుటుంబంలో ఆనందం నింపాలని, ప్రతి ఒక్కరికి విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందంజలో ఉందని, అదే ఒరవడిని నూతన సంవత్సరంలో కూడా కొనసాగిస్తామని ఒక ప్రకటనలో చంద్రబాబు తెలిపారు. 2017 లో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకొనినూతన ఏడాదిలో మరింత పట్టుదల, కృషితో సవాళ్లను అధిగమించి విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి గెలుపునందించే సంవత్సరం కావాలని కోరుకున్నారు. చంద్రబాబుతో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ,ఎపి పంచాయతీరాజ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ , మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, పరిటాల సునీత, టీటీడీపీ అధ్యక్షులు ఎల్ రమణ, ఎపి పార్టీ అధ్యక్షులు , విద్యుత్ శాఖ మంత్రి కమిడి కళా వెంకట్రావు, పోలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖరరెడ్డి, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.

నేర రహిత రాష్ట్రానికి పోలీసు శాఖ కృషి: హోంమంత్రి చినరాజప్ప

అమరావతి, ఆంధ్రప్రభ: గత ఏడాది మాదిరిగానే శాంతి భద్రతలకు ప్రాధాన్యతనిస్తూ నేర రహిత రాష్ట్రంగా ఏపీని మొదటి స్థానంలో నిలిపేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంశాఖా మంత్రి నిమ్మకాయల చిన రాజప్ప పేర్కొన్నారు. దేశ, విదేశాల్లోని తెలుగు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెపుతూ తెలుగు ప్రజలు సుఖశాంతులు, సౌభాగ్యాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

సుఖ సంతోషాలు వెల్లివిరియాలి: ప్రతిపక్షనేత జగన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగు రాష్ట్రాల ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2018 సంవత్సరం ప్రతిఇంటా అభివృద్ధి, ఆనందాల సంవత్సరం కావాలన్నారు. తెలుగు ప్రజల జీవితాల్లో మంచి మార్పులకు నాంది కావాలని జగన్మోహన్ రెడ్డి ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజలకు నూతన సంతవత్సర శుభాకాంక్షలు: రామకృష్ణ

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2017లో ఆశించిన మేరకు రాష్ట్ర అభివృద్ధిగానీ, ప్రజలకు మేలుగానీ జరగలేదని, కేంద్రం ఏపీకి ప్రకటించిన ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీల అమలు కాకుండా మోసం చేసిందని ఎద్దేవా చేశారు. కనీసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ కూడా అమలుకు నోచుకోలేదని,. 2018వ సంవత్సరంలోనైనా రాష్ట్రప్రజలందరికీ మేలు జరగాలనీ, రాష్ట్రం అన్ని రంగాలలో పురోభివృద్ధిలో పయనించాలని రామకృష్ణ ఆకాంక్షించారు.

'జన్మభూమి - మా ఊరు' విజయవంతం చేయండి



● అధికారులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు

కర్నూలు, ప్రభ న్యూస్: జనవరి 2 నుంచి 11 వరకు నిర్వహించే 5వ విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఅండ్ పిఆర్, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ భవనంలో జన్మభూమి నిర్వహణ, ప్రభుత్వం అందించే పథకాలపై జిల్లా అధికారులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలలోని విస్తృతంగా తీసుకువెళ్లాలని, ప్రభుత్వ యంత్రాంగం జవాబుదారితనంతో పనిచేయాలని ఆయన సూచించారు. మూడున్నర సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని అందించిన సంక్షేమ పథకాలను ప్రజ లకు వివరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్, ఎమ్మెల్యేలు, ఎస్వీ మోహన్‌రెడ్డి, బుడ్డారాజశేఖర్‌రెడ్డి, మణిగాంధీ. జిల్లా కలెక్టర్ సత్యనారాయణ,జాయింట్ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి-2 రామస్వామి, డిఆర్ఓ శశిదేవిపాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి కార్యక్రమాలు : మంత్రి శిద్దా రాఘవరావు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర వ్యాప్తం గా 5వ విడత జన్మభూమి కార్యక్రమం జనవరి 2 నుండి 11 వరకు జరగనుం దని, ఈ కార్యక్రమాన్ని ప్రకా శం జిల్లా దర్శి నియో జకవర్గంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిం చనున్నట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖా మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివారం దర్శి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలు ఆంధ్ర ప్రదేశ్‌లో జరుగుతున్నాయని తెలిపారు. ప్రజాసమ స్యలు పరిష్కరించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రకాశం జి ల్లా కలెక్టర్ వినయ్ చంద్, మాజీ ఎమ్మెల్యే ఎన్. పాపారావు ఇతర అధికారులు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

బాబు మారాలి

కొత్త సంవత్సరంలోనైనా మేల్కోనాలి: బొత్స



విశాఖపట్నం , ప్రభ న్యూస్ : అన్ని విధాలుగా గెలిపించిన ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త సంవత్సరంలో అయినా మారాలని వైకాపా నేత బొత్స సత్యనారాయణ ఆశించారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీసం కొత్త సంవత్సరంలో అయినా చంద్రబాబు తీరు మారాలని ఆశించారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యాన్ని ఆయన గౌరవిస్తారని ఆశించారు. కనీ వినీ ఎరుగని రీతిలో2017 ఆసాంతం చంద్రబాబు ప్రజా స్వామ్యంను అపహాస్యం చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట సభల్లోనే చట్టాన్ని ఆయన భూ స్థాపితం చేసారని ఆరోపించారు. 23 మంది విపక్ష ఎమ్మెల్యేలను ఫిరాయింపు చేసి అందులో నలుగురికి మంత్రి పదవులు కూడా ఇచ్చారని బొత్స ఎద్దేవా చేశారు. వారి మీద చర్య తీసుకోకపోతే సభకు రానని ప్రతి పక్షం బహిష్కరించినా బేఖాతరుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని చెప్పారు. కేంద్ర భూ సేకరణ చట్టానికి తూట్లు పొడుస్తూ రాష్ట్రం చట్టం చేసి రైతన్న ఉసురు పోసుకున్నారని చంద్రబాబు ప్రభుత్వాన్ని ఆయన దుయ్యబట్టారు. మీడియా గొంతు నొక్కారని, అమరావతి నిర్మాణంలో అవినీతితో కూరుకుపోయారని ఆక్షేపించారు. ఫైబర్ గ్రిడ్‌లోనూ అంతులోని అవినీతి చోటు చేసుకుందన్నారు. అత్యంత కీలకమైన పోలవరం ప్రాజక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరించిందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు తైనాల విజయ్‌కుమార్, కరణం ధర్మశ్రీ, పక్కి దివాకర్, వి. కళ్యాణి, తిప్పల నాగిరెడ్డి, కోల గురువులు, గిరికన గౌరి, కె. చంద్రమౌళి, పసుపులేటి ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుట్రలు ఛేదిస్తాం..
పోలవరాన్ని పూర్తి చేస్తాం

వినూత్న రీతిలో జన్మభూమి: మంత్రి దేవినేని ఉమా



అమరావతి, ఆంధ్రప్రభ: ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా ఎట్టి పరిస్థితుల్లోను పోలవరం ప్రాజెక్టు ఆగదని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక జలవనరుల శాఖా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పోలవరాన్ని అడ్డుకోవాలని కొంతమంది పలు విధాలుగా కుట్రలు చేస్తున్నారని, ఈ క్రమంలో వైసీపీ చేయని ప్రయత్నం లేదని విమర్శించారు. పోలవరం పనులు దక్కించుకునేందుకు విఫలయత్నం చేసిన జగన్, తన తండ్రి చనిపోయిన రోజు ఆన్‌లైన్లో పోలవరం పనులకు సంబంధించిన ఈ టెండర్లను అప్‌లోడ్ చేశారో లేదో ఇప్పటికైనా ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను ఇదే విషయమై ఎన్నిసార్లు మాట్లాడినా జగన్‌లో ఎందుకు కదలిక రావడం లేదని ప్రశ్నించారు. సమాధానం చెప్పలేకనే మొహం చాటేస్తున్నారని అన్నారు. ఆనాడు కేంద్రంలోని పెద్దలతో బేరాలు కుదరకనే జగన్ పోలవరం పనులను దక్కించుకోలేకపోయన్నారు. దీంతో ప్రాజెక్టును ఆపేందుకు కుట్రలు చేస్తున్నారని, కొంతమంది కావాలని పార్లమెంట్‌లో పోలవరం అంశాన్ని లేవనెత్తి ప్రశ్నల మీద ప్రశ్నలు సంధిస్తూ, పక్క రాష్ట్రాలను మనపైకి ఉసికొల్పుతున్నారని అన్నారు. వీరంతా అభివృద్ధి నిరోధకులని విమర్శించారు. వీరికి ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు. జనవరి రెండో వారంలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారన్నారు. ట్రాన్‌స్ట్రాయ్ వ్యవహారాన్ని ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పో లవరం జాతీయ స్థాయి కమిటీ సూచనలు మేరకు పనులను పూర్తి చేసేందుకు ముందుకు పోతున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను 2018 జూన్ కల్లా తాత్కాలికంగా ప్రాజెక్టును పూర్తి చేసి,గ్రావిటీ ద్వారా నీరందించి, 2019 కల్లా ప్రాజెక్టును పూర్తిచేసి తీరుతామని మంత్రి దేవినేని ఉమా ధీమా వ్యక్తం చేశారు.

'ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమం'

అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే మరో ప్రక్క ప్రభుత్వ విద్యా పరిరక్షణకు ఏఐఎస్ఎఫ్ ఉద్యమిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి. సుబ్బారావు. జి. రంగన్న తెలిపారు. ఆదివారం దాసరి భవన్‌లో సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ సర్కార్ విద్యను బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు దూరం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని విమర్శించారు. విద్యార్థులు తక్కువ ఉన్నారనే సాకుతో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్‌ను మూసివేయడం దారుణమని అన్నారు. యూనివర్సిటీల విద్యాభివృద్ధి నిధులుకేటాయించకుండా రాష్ట్రంలోకి ప్రైవేట్ యూనివర్సిటిలను ఆహ్వానిస్తురని, దీనివలన ప్రభుత్వ యూనివర్సిటీలు కనుమరుగవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందిచకపోవడం చాలా బాధాకరమన్నారు.

మూడేళ్లుగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా పేద విద్యార్థులను ఉన్నత విద్యకు ప్రభుత్వం పరోక్షంగా దూరం చేస్తుందని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందక అనారోగ్యం భారిన పడుతున్నారన్నారు. వైద్య రంగం పూర్తిగా ప్రభుత్వ ఆజమాయిషీలోనే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని,విద్యాలయాల్లో వసతులు కల్పించి,సొంత భవనాలు నిర్మించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘ రాష్ట్ర కమిటీ సమావేశంలో తీర్మానాలను ఆమోదించామన్నారు.

'హాలుని గాథాసప్తశతి తొలి విజ్ఞాన సర్వస్వం'

కడప, ప్రభ న్యూస్: హాల శాతవాహన చక్రవర్తి రచించిన గాథాసప్తశతిని తొలి విజ్ఞాన సర్వస్వంగా అభివర్ణించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రముఖ కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, డా.అనుపాటి సుబ్బరాయుడు రచించిన గాథాసప్తశతి-సౌందర్యగాథ అనే సిద్ధాంత గ్రంథం ఆదివారం ఉదయం కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ అనుపాటి సుబ్బరాయుడు గాథాసప్తశతిపై పరిశోధనకు పూనుకుని ప్రతి ప్రాకృత కవి హృదయాన్ని విప్పి చదివి అంతరంగాన్ని సౌందర్య దృష్టితో బహిరంగం చేసే ప్రయత్నం చేశారన్నారు. గ్రంథాన్ని పాఠకుల అభిరుచికి అనువుగా తీర్చిదిద్దిన డా.అనుపాటి సుబ్బరాయుడు ప్రశంసనీయుడన్నారు. సభకు అధ్యక్షత వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రసిద్ధ విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మొదటి శతాబ్దం పూర్వభాగం



లోనే హాలుడు ప్రాకృతభాషలోని ఏడువందల సుందర గాథలను ఏర్చికూర్చి గాథాసప్తశతి పేరిట సంకలనం చేశారని, మహాభారతానికి ఎన్ని విశిష్ట లక్షణాలున్నాయో అన్ని లక్షణాలు ఈ గాథాసప్తశతికున్నా యని, ఇది తెలుగువారి గ్రామీణ జీవన భారతమన్నారు. ఈ గాథాసప్తశతిని పరిశోధన చేయడంలో డా.అనుపాటి సుబ్బరాయుడు అనేక కష్టాలను ఎదుర్కొన్నారని, దీన్ని ఒక ఉత్తమ పరిశోధన గ్రంథంగా తీర్చిదిద్దారన్నారు. సిపి బ్రౌన్ గ్రంథాలయ బాధ్యులు డా.మూల మల్లికార్జునరెడ్డి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దలందరినీ ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి విజయవాడలో
నవ్యాంధ్రా పుస్తక మహోత్సవం

ప్రారంభించనున్న ఉప రాష్ట్రపతి వెంకయ్య, సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్రా పుస్తక సంబరాల మహోత్సవం సోమవారం నుంచి విజయవాడలో ప్రారంభం కానున్నది. స్వరాజ్ మైదానంలో జనవరి1-11వతేదీవరకు జరగనున్న ఈ పుస్తక మహోత్సవాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. విజయవాడ బుక్ సొసైటీ, ఎన్టీఆర్ ట్రస్ట్, ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహోత్సవంలో ఎన్నో రకాల పుస్తకాలు పుస్తకప్రియులకు అందుబాటులోకి రానున్నాయి. మొదటి రోజైన సోమవారం సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు యుఎన్ యోగి సంస్మరణ సభ నిర్వహించిన అనంతరం ''నన్ను ప్రభావితం చేసిన పుస్తకం'' అంశంపై విశపు బాలసుబ్రమణ్యం కీలకోపన్యాసం చేయనున్నారు. అనంతరం సీపీఐ నాయకుడు కె. నారాయణ, సీపీఎం నాయకుడు మధు, వైసీపీ నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, బీజేపీ నాయకులు లక్ష్మీపతిరాజు, నవ్యాంధ్ర పార్టీ నాయకులు కత్తి పద్మారావు తదితరులు ప్రసంగించనున్నారు. 11రోజుల పాటు జరిగే ఈ మహోత్సవంలో ప్రతి రోజూ ఒక్కో అంశంపై పలువురు వక్తలు ప్రసంగించనున్నారు. ముఖ్యంగా తెలుగు భాష-వికాసం, సాహితీ సృజనలో స్త్రీలు, కథ, నవ్వుల పందిరి, నేటి నవలలు-విమర్శ, తీరుతెన్నులు, నేను-నాసృజన, తెలుగు కవిత్వం-మారుతున్న శిల్పం, కవిత్వంలో సామాజిక అంశాలు, కవిత్యంలో మానవ సంబంధాలు, మట్టివాసనలు తదితర అంశాలపై పలవురు వక్తలు ఉపన్యాసం ఇవ్వనున్నారు. ఈ పుస్తక మహోత్సవంపై ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఈ పుస్తక మహోత్సవం నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.50 లక్షల గ్రాంటు మంజూరు చేసిందన్నారు. ప్రతి సంవత్సరం అన్ని రకాల సంస్థల్లోని వ్యక్తులను భాగం చేయటమే లక్ష్యంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారని చెప్పారు. ఏపీ ప్రభుత్వం ఇది నిర్వహించడానికి భాష, సాంస్కృతిక శాఖ తరుపున నిధులు ఇచ్చారని, ఈమహోత్సవంలో శాస్త్ర, సాంకేతిక, సాహిత్య, రాజకీయ, సాంస్కృతిక, కళా రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై మాట్లాడతారని చెప్పారు. ఈపుస్తక మహోత్సవంలో న్యూఢిల్లీ, చెన్నై, ముంబై, హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన పుస్తక పబ్లిషర్స్ తమ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పోలవరం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

● ప్రత్యేక హోదాను ప్రాంతీయ పార్టీలు తీసుకురాలేవు ● జన్మభూమిలో అధికారులను నిలదీసి నిగ్గు తేల్చండి: రఘువీరారెడ్డి



కళ్యాణదుర్గం, ప్రభ న్యూస్: పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే కేవలం జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పీసీసీ అధ్యక్షుడు ఎన్ .రఘువీరారెడ్డి అరోపించారు.అయన అదివారం అనంతపురం జిల్లా శెట్టూరు మండలం ఐదుకల్లు. ములకలేడు. తినపనపల్లి. శెట్టూరుతో పాటు కళ్యాణదుర్గం మండలం గరుడాపురం దురదకుంట తదితర గ్రామాలలో ఇందిరమ్మ రాజ్యం ఇంటింట సౌబాగ్యం అనే కార్య క్రమంలో భాగంగా తన పర్యటనను కొనసాగించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రాంతీయ పార్టీలన పోలవరం పూర్తికాదని అంతేగాకుండా ప్రత్యేక హోదాను సాదించడంలో కూడా ఆ రెండు పార్టీలు వెనుకబడ్డాయని అదికూడా కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యపడుతోందన్నారు. గత ఎన్నికల సమయంలో సాధ్యంకాని అమలుకాని హామీలను ఓటర్లకు కుమ్మరించి మాయమాటలతో చంద్రబాబు ఓట్లేసుకొని గద్దెనెక్కిన పెద్దమనిషి నేడు ప్రజలను వంచనకు గురిచేశాడని తూర్పారబట్టారు. పచ్చచొక్కాలు వీరంగం చేసి అధికారులను.సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇలాంటి వారి భరతం పడతామన్నారు. అంతేగాకుండా రాష్ట్రంలో ప్రధానమైన రెండు సమస్యలు ప్రత్యే హోదా, పోలవరం రెండింటిని సాధించి ప్రజలవద్దకు వస్తామన్నారు. వీరు జన్మలో కూడా పోలవరాన్ని పూర్తి చేయరని, అందులో భాగంగా గడ్కరీని పోలవరం చూడడానికి తీసుకువచ్చినా అదిసాధ్యమయ్యే పనికాదన్నారు. ప్రచారంపై వున్నంత యావ అభివృద్ధిపై జరగలేదన్నారు. ప్రత్యేక హోదా విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో బిజెపి ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజల సమస్యలను తీర్చేంతవరకు అధికారులను పాలకులను గట్టిగా నిలదీయాలన్నారు. అనంతరం అయా గ్రామాల ప్రజలు పలు సమస్యలపై ఏకరువు పెట్టారు. నాయకులు బాలా నరేంద్రబాబు, సుదీర్, నాగరాజు అశోక్, రాంబూపాల్‌రెడ్డి, బాలా శ్రీనివాసులు. శివన్న యాదవ్, జోషఫ్‌కిసోర్. మండల కన్వీనర్లు వీరాంజినేయులు, లింగమయ్య, ఓబుళపతి శివన్న, వీరభద్రప్ప. సిద్దప్ప. తదితరులు పాల్గొన్నారు.

సంవత్సరాంతంలో విషాదం

అతి వేగానికి ముగ్గురు మృతి

జీపు, టెంపో ట్రాలీ ఢీ - ఏడుగురికి తీవ్ర గాయాలు



జీపుడ్రైవర్ షేక్ మస్తాన్‌వలి, పిట్టామంగమ్మ, గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహాలు

దుర్గి, ప్రభ న్యూస్: అతివేగానికి మూడు నిండు ప్రాణాలు బలికాగా, మరో ఏడుగురికి తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం జరిగింది. గుంటూరు జిల్లా దుర్గి మండల పరిధిలోని అడిగొప్పల గ్రామ సమీపాన వున్న ఎర్రవాగు బ్రిడ్జివద్ద ఈ సంఘటన జరిగింది. కారంపూడి మండలం కారంపూడి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి(45)కి చెందిన జీపులో 9 మంది ప్రయాణికులతో దుర్గి వైపు బయలుదేరాడు. అదే విధంగా దుర్గి పరిసర గ్రామాల్లోని చికెన్ షాపుల్లో కోళ్లు దిగుమతి చేసి కారంపూడి మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన అంజి ట్రాలీ వాహనంతో కారంపూడి వైపు వెళ్తున్నాడు. మార్గ మధ్యంలోని ఎర్రవాగు బ్రిడ్జి వద్దకు రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో జీపు డ్రైవరైన యజమాని మస్తాన్‌వలితో పాటు దుర్గి మండలం కాకిరాల గ్రామానికి చెందిన పిట్టామంగమ్మ(70), మరో గుర్తుతెలియని వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలంలో మృతదేహాలు జీపులో ఇరుక్కుపోవటంతో సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బత్తిన సుబ్బనాయుడు సిబ్బందితో హుటాహుటిన అక్కడకు చేరుకొని మృతదేహాలను బయటకు తీశారు. వీరితో పాటు తీవ్ర గాయాల పాలైన మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన పొదిలిసైదమ్మ, పొదిలి గురులక్ష్మీ, పొదిలి మంగమ్మ, మాచర్ల గ్రామానికి చెందిన కంకనాల పద్మ, కంకనాల మల్లేశ్వరి, అడిగొప్పల గ్రామానికి చెందిన ఆవుల పున్నయ్య, ట్రాలీ డ్రైవర్ అజయ్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని 108 అంబులెన్స్ ద్వారా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో మరో వృద్ధురాలి మృతదేహం ఆచూకీ తెలయరాలేదు. మృతదేహాలకు పోస్ట్ మార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘటనా స్థలాన్ని గురజాల డీఎస్పీ కెవీప్రసాద్, మాచర్ల రూరల్ సీఐ దిలీప్ కుమార్, కారంపూడి ఎస్ఐ మురళి సందర్శించారు. ప్రమాదం జరిగిన వివరాలను ఎస్ఐ సుబ్బనాయుడుని అడిగితెలుసుకున్నారు. ఈ ప్రదేశంలో రోడ్డు ప్రమాదాలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్వాగతం.. సుస్వాగతం

ముగిసిన ఏడాదికి వీడ్కోలు పలకడమే కాదు కొత్త ఏడాదికి స్వాగతం...సుస్వాగతం అంటూ ఆ సంబరాల్లో ప్రతీ ఏటా ప్రపంచమంతా మునిగి తేలడం పరిపాటి. అందులో భాగంగా నూతన ఏడాది 2018 ప్రారంభ వేడుకలను ప్రపంచ దేశాలన్నీ ఉత్సాహభరితంగా జరుపుకుంటున్నాయి. ఇక సినీతారలు కూడా అంగరంగ వైభవంగా ఈ వేడుకలను జరుపుకుంటూ తాము ఎక్కడున్నా అక్కడే తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు. తెలుగు తారలే కాదు బాలీవుడ్, కోలీవుడ్ ఇలా...భారతీయ సినీరంగంలోని తారలెందరో ప్రతీసారి కొత్త ఏడాదిని మహదానందంతో ఆహ్వానించడం వింటున్నదే..కంటున్నదే. ఈ నేపథ్యంలో నూతన సంవత్సరం తమకు మరింత గొప్పగా ఉండాలని, కెరీర్ పరంగా తాము మరిన్ని పాత్రలు, చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావాలని తారలంతా కోరుకుంటున్నారు. ఇదిలావుండగా...కొందరు తారలు నూతన ఏడాది రోజు వివిధ చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉంటుండగా...ఇంకొందరు తారలైతే ఆ వేడుకల్లో తమ డ్యాన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకోనున్నారు. ఇంకొందరైతే తమ ఊర్లో...తమ కుటుంబ సభ్యుల మధ్యన ఈ వేడుకలను జరుపుకోబోతున్నారు. టాలీవుడ్‌కు చెందిన కొందరు తారలు ప్రత్యేకించి గోవాలో ఈ వేడుకలను ఏర్పాటు చేసుకుని అక్కడ ఆనందంతో గడపనున్నారు. మహేష్‌బాబు, ప్రభాస్ వంటి కొందరు హీరోలు విదేశాలలో ఉండటం వల్ల నూతన ఏడాది వేడుకలను అక్కడే జరుపుకోనున్నట్లు పరిశ్రమ వర్గాల భోగట్టా. ఇక నూతన ఏడాదిని రకుల్‌ప్రీత్‌సింగ్ గోవాలో జరుపుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం హిందీ చిత్రం అయారేలో నటించిన రకుల్ ఇప్పుడు ఆ చిత్రం ప్రమోషన్‌లో పాల్గొంటోంది. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ వివిధ భాషల చిత్రాలను చేస్తున్న ఆమె స్నేహితులు ఢిల్లీలోను, హైదరాబాద్‌లోను ఉన్నప్పటికీ నూతన ఏడాది వేడుకలను ఆమె గోవాలో జరుపుకుంటోందట. ఇక మరో భామ ఆదాశర్మ విషయానికి వస్తే...న్యూఇయర్ పార్టీని ఎక్కడోచోట జరుపుకునేందుకు ఆమె అంతగా ఇష్టపడదట. అయితే తన ఇంట్లో మేడపైన ఒకప్పటి స్కూల్ ఫ్రెండ్స్‌తో కలిసి కొత్త ఏడాది వేడుకను సంతోషకరంగా జరుపుకోవడం ఆదాకు అలవాటు. ఇక ఇంకో తార రీతూవర్మ ఏమంటోందంటే...ప్రయాణం చేయడమంటే నాకు మహా ఇష్టం. గత ఏడాది సింగపూర్‌కు వెళ్లేందుకు కుదిరింది. అయితే ఈ నూతన ఏడాదిలో షూటింగ్ షెడ్యూల్స్ కారణంగా ద్వీప దేశానికి వెళ్లే అవకాశం కుదరడం లేదు. అయినా నూతన ఏడాది రోజు ఎక్కడ ఉన్నా ఆనందంతో ఉంటానని అంటోంది. వీరి సంగతి ఇలావుంటే హీరో నిఖిల్ ఈ నూతన ఏడాది వేడుకను వేగాస్‌లో జరుపుకుంటున్నారు. డిసెంబర్ 28 అక్కడికి వెళ్లిపోయి జనవరి 10 నాటికి తిరిగి హైదరాబాద్ చేరుకుంటానని చెప్పుకొచ్చారు. గత మూడు నెలలుగా తన కొత్త చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నానని, తాను నటించబోయే ఇంకో నూతన చిత్రం జనవరి 15న మొదలవుతుందని చెప్పుకొచ్చిన ఆయన మధ్యలో ఈ కొద్దిరోజులు బ్రేక్ తీసుకోవడం మనసుకెంతో ఉల్లాసంగా ఉంటుందని అంటున్నారు. రాధికఆప్టే తన సొంతఊరు పూనేకు చేరుకుని నూతన ఏడాది సంబరాల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనబోతోంది. అలాగే బిపాసబసు కూడా తన కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్యన ముంబాయిలో జరుపుకోనుంది. దీపికాపదుకొనె బెంగళూరులో తన సోదరితో కలిసి వేడుకలలో ఉత్సాహంగా పాల్గొననున్నట్లు సమాచారం. శ్రద్ధాకపూర్ కూడా నూతన ఏడాది రోజు సెలవు తీసుకుని కుటుంబ సభ్యులతో గడపనుంది. ఇక యామీగౌతమ్ చండీగఢ్‌లోని కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లిపోయి, అక్కడే నూతన ఏడాదికి స్వాగతం పలకనుందట. కంగనారనౌత్ న్యూఇయర్ వేడుకలను సంతోషంగా ఆహ్వానిస్తూనే తాను నటిస్తున్న మణికర్ణిక షూటింగ్‌తో బిజీగా ఉండనుందట. మొత్తం మీద తారలెందరో ఇలా నూతన ఏడాది వేడుకల్లో ఆనందంగా పాలుపంచుకుంటున్నారు. నూతన ఏడాది భారతీయ సినిరంగానికంతటికీ మరింత మంచి జరగాలని సినీజీవులు ఆకాంక్షిస్తున్నారు.


రీతూవర్మ


ఆదాశర్మ


రాధికాఆప్టే


యామీగౌతమ్


శ్రద్ధాకపూర్


దీపికా పదుకొనే


కంగనారనౌత్
రకుల్‌ప్రీత్‌సింగ్

Happy New Year 2018

జోరుగా... హుషారుగా

మంచి జోరుమీదున్నారు రానా. బాహుబలి-2, ఘాజి, నేనే రాజు..నేనే మంత్రి వంటి చిత్రాలు వరుస హిట్లను అందుకున్న ఆయన నూతన ఏడాదిలో కూడా అదే స్పీడ్‌ను, అదే ఉత్సాహాన్ని కొనసాగించాలని కాంక్షిస్తున్నారు. విభిన్న, వైవిధ్యమైన చిత్రాలను చేయాలని కోరుకునే ఆయన ప్రస్తుతం 1945 చిత్రంలో నటిస్తున్నారు. అలాగే తాను చేయబోయే మరో చిత్రాన్ని కూడా ఆయన లైన్‌లో పెట్టడమే కాదు ఇటీవల తన పుట్టినరోజు సందర్భంగా ఆ చిత్రం టైటిల్ లోగోను కూడా విడుదలచేశారు. 1971లో రాజేష్‌ఖన్నా కథానాయకుడిగా వచ్చిన హాథీ మేరే సాథీ చిత్రం అప్పట్లో విజయం సాధించింది. అయితే అ చిత్రానికి రీమేక్ కాకుండా టైటిల్‌ను మాత్రమే తీసుకుని తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రానా ఈ చిత్రం చేయబోతున్నట్లు సమాచారం. ఓ ఏనుగుకు, మనిషికి మధ్య సాగే ఇతివృత్తంతో ఈ చిత్ర కథాంశం ఉంటుందని అంటున్నారు. నూతన ఏడాది రోజు ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తారని చెబుతున్నారు. ఇదిలావుండగా...తెలుగులో ఈ చిత్రానికి అడవిరాముడు టైటిల్ పెట్టే అవకాశం ఉందన్న మాటలు పరిశ్రమలో వినిపిస్తున్నాయి. సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేయించడమే ఈ ఊహాగానాలకు బలాన్నిస్తోంది. ఒకప్పుడు ఎన్టీఆర్ కథానాయకుడిగా అడవిరాముడు, ఆ తర్వాత ప్రభాస్ కథానాయకుడిగా అదే పేరుతో వేరొక చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే.


రానా

ఆరంభంలోనే

ప్రారంభాల సందడి

ఆశావహ చిత్ర పరిశ్రమలో ఎన్నో ఆశలతో కొత్త ఏడాది వచ్చేసింది. గతేడాదంతా తీరిక లేకుండా గడిచింది. అద్భుత విజయాలను అందించింది. చిత్ర పరిశ్రమ ఎన్నడూ లేనంత కళకళలాడింది. నోట్ల రద్దు అడ్డంకిని అధిగమించి...రికార్డు స్థాయి చిత్రాల నిర్మాణంతో పరిశ్రమ బలాన్ని చాటింది. ఇన్ని ఘనతల పాత ఏడాది వెళ్లిపోయి...కొత్త సంవత్సరానికి కావాల్సినంత స్ఫూర్తిని అందజేసింది. ఈ నేపథ్యంలో మొదటి నెలలోనే ఆసక్తికరమైన చిత్రాలు ప్రారంభోత్సవాలు జరుపుకోనున్నాయి. ఆ సినిమాల సంగతులు తెలుసుకుంటే....

రాజా కొత్త సినిమా జనవరి 5న : దర్శకుడు శ్రీనువైట్ల తొలి చిత్రం నీకోసం. ఈ సినిమా నుంచే రవితేజతో దర్శకుడి ప్రయాణం మొదలైంది. ఆ తర్వాత వెంకీ, దుబాయ్ శీను లాంటి చిత్రాలతో హిట్ కాంబినేషన్‌గా పేరు తెచ్చుకుంది. వీళ్లు కలిసి చేసిన సినిమాలన్నీ ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని పంచాయి. కొంత విరామం వచ్చినా...మళ్లీ శ్రీనువైట్ల రవితేజ కలిసి సినిమా చేస్తున్నారు. మైత్రీ మూవీస్ నిర్మాణంలో రూపకల్పన జరగనున్న ఈ చిత్రంలో మాళవిక శర్మ అనే కొత్త నాయిక నటించబోతోంది. జనవరి 5న ఈ చిత్రం ప్రారంభోత్సవం జరుపుకోనుంది. రాజా ది గ్రేట్ హిట్‌తో ఫామ్‌లోకి వచ్చిన రవితేజ, త్వరలో టచ్ చేసి చూడు అనే ఖాకీ కథలో కనిపించబోతున్నారు.

అఖిల్ మూడో సినిమా... : అఖిల్, హలో చిత్రాలతో ఆకట్టుకున్నారు యువ కథానాయకుడు అఖిల్. రెండో చిత్రం హలోతో యువతకు దగ్గరయ్యారు. ఇటీవలే విడుదలైన హలో మంచి విజయాన్నందుకుంది. దీంతో మూడో సినిమా కోసం ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు అఖిల్. వంశీ పైడిపల్లి, సురేందర్ రెడ్డి, కొరటాల శివ ఇలా కొంతమంది దర్శకుల పేర్లు వినిపిస్తున్నా...యువ కథానాయకుడు ఏ విషయాన్ని స్పష్టం చేయలేదు. అయితే తన మూడో చిత్ర వివరాలను అఖిల్ జనవరి 10న ప్రకటించబోతున్నాడు.


ఈ నెలలోనే సుడిగాడు సీక్వెల్ ...? : అల్లరి నరేష్ నట ప్రయాణంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం సుడిగాడు. వంద చిత్రాలను కలిపి ఒకే సినిమాలో చూడండి అనే ప్రచారంతో ఆకట్టుకున్న సుడిగాడు అన్నట్లుగానే స్టార్ హీరోల సినిమాలన్నింటి అనుకరణలను చూపించింది. ఆద్యంతం నవ్వించిన ఈ సినిమా ఘన విజయాన్ని అందుకుంది. దర్శకుడు భీమినేని శ్రీనివాసరావు అల్లరి నరేష్ కలిసి మరో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రం సుడిగాడి సీక్వెల్ అనుకుంటున్నారు. జనవరి రెండో వారంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరుపుకోనుంది.

బోయపాటి - చరణ్ సిద్ధం... : టాలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన సినిమా త్వరలో సెట్స్ మీదకు వెళ్లబోతోంది. మెగా హీరో రామ్ చరణ్, మాస్ దర్శకుడు బోయపాటి కాంబినేషన్‌లో సినిమా రాబోతోంది. డీవీవీ దానయ్య నిర్మాణ బాధ్యతలు వహిస్తున్నారు. ఇప్పటిదాకా రామ్ చరణ్ పూర్తి స్థాయి మాస్ సినిమా చేయలేదు. ఇప్పుడా ప్రయత్నం బోయపాటి దర్శకత్వంలో జరగనుంది. జనవరి 19న చరణ్ - బోయపాటి సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తంగా నిర్ణయించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నాయిక కైరా అద్వానీ నాయికగా నటించనుంది. తొలుత అనూ ఇమ్మాన్యుయేల్‌ను హీరోయిన్‌గా అనుకున్నా...చివరలో కైరాను ఎంచుకున్నారు. ఈ బాలీవుడ్ సుందరి ప్రస్తుతం మహేష్‌బాబు సరసన భరత్ అనే నేను చిత్రంలో నటిస్తోంది.

నిఖిల్ తమిళ రీమేక్... : కథలే సినిమాకు ప్రాణం అని తెలుసుకున్న నిఖిల్...ఇక అదే దారిలో వెళుతున్నారు. ఈ క్రమంలో పరభాషా చిత్రాలనూ తెలుగులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం కన్నడ రీమేక్ కిరిక్ పార్టీలో నటిస్తున్నారీ యువహీరో. కిరిక్ పార్టీ చిత్రీకరణ జరుపుకుంటోంది. నిఖిల్ త్వరలో కనితన్ అనే తమిళ చిత్ర రీమేక్‌లో నటించబోతున్నారు. మాతృకను రూపొందించిన దర్శకుడు సంతోష్ ఈ సినిమాకూ దర్శకత్వం వహించబోతున్నారు. ఠాగూర్ మధు నిర్మాతగా వ్యవహరించనున్నారు. జనవరి 19న కనితన్ తెలుగు పునర్నిమాన చిత్రం ప్రారంభోత్సవం జరుపుకోనుంది.

జనవరి 20న సెట్స్‌లోకి శర్వానంద్... : దర్శకుడు హను రాఘవపూడి కొత్త సినిమా ఇటీవలే ప్రారంభోత్సవం జరుపుకుంది. శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో సాయి పల్లవిని నాయికగా ఎంచుకున్నారు. సరికొత్త ప్రేమ కథగా సినిమా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ జనవరి 20 నుంచి ప్రారంభం కాబోతోంది.


కైరాఅద్వానీ


రవితేజ


రామ్‌చరణ్


మాళవిక శర్మ


సాయిపల్లవి


అల్లరినరేష్


శర్వానంద్


నిఖిల్


అఖిల్

S & D

వెల్‌కమ్ 2018

క్రీడాప్రభ

ఆశల పల్లకిలో...



ఆంధ్రప్రభ, క్రీడావిభాగం

2018... ఎన్నో ఆశల్ని మోసుకొచ్చింది. 2017 భారత క్రీడారంగంలో కొత్త ఊపిరూలింది. కొంగ్రొత్త ఆశలు రేకెత్తించింది. ఆ ఏడాది చిరస్మరణీయ విజయాలు సాధించిన భారత క్రీడాకారులు నూతన సంవత్సరంలోనూ అలాంటి మధు ర స్మృతుల్ని పదిల పరచుకోవాలని కోరుకోవడం సహజం! ప్రత్యేకించి క్రికెట్‌లో గత సంవత్సరం భారత జట్టుకు ఎదు రే లేకపోయింది. అప్రతిహత విజయాలతో దూసుకుపోయింది. ఆటగాళ్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ఆరేళ్ల తర్వాత టీమ్‌ఇండియా టెస్టుల్లో తిరిగి నెంబర్ వన్ స్థానాన్ని వశం చేసుకుంది. వన్డేల్లోనూ అగ్రపీఠం అధిరోహించింది. విరాట్, పుజారా పరుగుల వరద పారించారు. ఇవన్నీ సొంతగడ్డపై... బలహీనమైన వెస్టిండీస్, శ్రీలంకలపై వారి జట్లపై! మరి 2018... కోహ్లి సేన సత్తాకు అసలుసిసలు ప రీక్ష పెట్టనుంది. అందుకు నాంది... దక్షిణాఫ్రికా పర్యటన. కఠినమైన సిరీస్ అనంతరం.. మరిన్ని కఠోర పరీక్షలు ఎదుం ు కానున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ పర్యటనల రూపంలో అవి భారత జట్టు ప్రతిభను, సహనాన్ని, దృక ్పథాన్ని పరీక్షించనున్నాయి. టెస్టుల్లో అగ్రపీఠం నిలవాలంటే... ఈ ఫార్మాట్లో తనకు తానే సాటి అని నిరూపి ంచుకోవాలంటే... టీమ్‌ఇండియా శ్రమించాల్సిందే! ప్రపంచ ర్యాంకుల్ని మెరుగు పరచుకోవడానికి, దక్కించుక ున్న స్థానాల్ని పదిల పరచుకో వడాకి ఆటగాళ్లు సైతం కష్టపడాలి. ప్రపంచ కప్‌లో సంచలన రీతిలో ఫైనల్ చేరిన భారత మహిళల జట్టుకు కూడా పెను సవాలు ఎదురు చూస్తోంది. ఆ సవాలును అమ్మాయిలు ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరం. భారత క్రీడా రంగంలో కొత్త ఆశలు ఇవేనా? ఇంకా చాలా ఉన్నాయి. 2017లో భారత్‌ను అంతెత్తున నిలబెట్టిన బ్యాడ్మింటన్లోనూ మన ఆట గాళ్లకు కఠిన సవాళ్లు ఎదురు కానున్నాయి. 2017 మనకు రెండు ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలు.. ఆరు సూపర్ సిరీస్ టైటిళ్లు... ఇంకా మరెన్నో రికార్డులు అందించిన సంవ త్సరం. 2018లో అంతకుమించి ఆశలున్నాయి. నెంబర్ వన్ ర్యాంకులు... సూపర్ సిరీస్ టైటిళ్లు... చిరకాల ప్రత్యర్థులపై ప్రతీకారం... ఇలా ఎన్నో.. ఎన్నెన్నో! హాకీలో పురుషుల జట్టు ప్రపంచ కప్ ఆడబోతోంది. గత ఏడాది వరల్డ్ హాకీ లీగ్ ఫైనల్స్‌లో కాం స్యంతో ప్రపంచకప్‌కు నేరుగా ప్రవేశం దక్కించుకున్నా.. మెగా టోర్నీ టీమ్‌ఇండియాకు అగ్ని పరీక్షే. టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, షూటింగ్, చెస్, ఆర్చరీ, బాక్సింగ్, బిలియర్డ్స్‌లలో మన ఆటగాళ్లు అపురూప విజ యాల్ని సొంతం చేసుకున్నా రు. 2018లో కూడా చిరస్మరణీయ విజయాల్ని సాధించాలని వీరంతా కృతనిశ్చయంతో ఉన్నారు. రెజ్లింగ్‌లో సుశీల్, ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో విజేందర్ ఆశలు రేకెత్తిస్తున్నారు. అటు అంతర్జాతీయ క్రీడల్లోనూ మేటి క్రీడాకారులు కొత్త సంవత్సరాన్ని చిరస్మరణీయం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్, మట్టికోట మహారాజు రఫెల్ నాదల్, ఇంగ్లండ్‌కు వింబుల్డన్ టైటిల్ కరువు తీర్చిన ఆండీ ముర్రే... బిడ్డకు జన్మనిచ్చి తిరిగి టెన్నిస్ బరిలోకి దిగిన సెరెనా విలి యమ్స్, ఫు ట్‌బాల్‌లో క్రిస్టియానో రొనాల్డో, మెసీ... ఫార్ములా వన్‌లో హమిల్టన్.. కొత్త సంవత్సరం ఇలా ఎందరికో ఆశలు మో సుకెత్తనుంది. కొత్త సంవత్సరంలో అపూర్వ విజయాలు సాధించాలని వీరందరికీ శుభాకాంక్షలు చెబుదాం!

టెస్టుల్లో నెంబర్ వన్ నిలిచేనా!

వరుసగా 9 సిరీస్ విజయాలు... ద్వైపాక్షిక సిరీస్‌లలో ఎదురులేని టీమ్‌ఇండియా.. ఇదంతా గతం! అసలు సిసలు పరీక్ష జనవరి 5న ఆరంభం కానుంది. ఆ రోజు దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు ఆరంభం కానుంది. భారత జట్టు ఇంతవరకు దక్షిణాఫ్రికాలో సిరీస్ గెలవడం మాట అటుంచి... ప్రదర్శన అంతంత మాత్రం. రెండు జట్లు ఈ సారి మూడు టెస్టుల సిరీస్ ఆడబోతున్నాయి. ఆ దేశంలో పిచ్‌లు సాధారణంగా పేస్‌కు అనుకూలంగా ఉంటాయి. కానీ టీమ్‌ఇండియా గత ఏడాది అంతా పేలవ పిచ్‌లపై ఆడింది. ఈడెన్ గార్డెన్స్ మైదానంలో పేస్ వికెట్‌ను పరీక్షించింది. కానీ వ్యూహం బెడిసి కొట్టింది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా పిచ్‌లపై భారత జట్టు ఎలా నెగ్గుకొస్తుందో చూడాలి. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ ఇపుడు 124 పాయింట్లతో అగ్రస్తానంలో ఉంది. దక్షిణాఫ్రికా 111 పాయింట్లతో ఆ వెనుకే ఉంది. ఈ సిరీస్ చేజారితే మాత్రం టీమ్‌ఇండియా ఆ పీఠం నుంచి దిగాల్సి వస్తుంది. ఈ ఏడాదంతా టీమ్‌ఇండియాకు టెస్టు క్రికెట్లో కఠిన పరీక్షలే ఎదురుకానున్నాయి. మార్చి, ఏప్రిల్‌లో ఐపీఎల్ తర్వాత ఇంగ్లండ్‌తో వారి గడ్డపై టెస్టు సిరీస్ ఉంటుంది. పొట్టి క్రికెట్‌లో దంచుడుకు అలవాటు పడిన వెంటనే సుదీర్ఘ ఫార్మాట్లో వెంటనే దృక్పథాన్ని మార్చుకొని.. అదీ మన ఆటగాళ్లకు ఏ మాత్రం అనుకూలించని ఇంగ్లండ్ వాతావరణంలో ఏ విధంగా ఆడతారన్నది ఆసక్తికరం!. దీని వెంటనే విండీస్‌తో సిరీస్ ఉన్నా.. అది సొంతగడ్డపైనే కాబట్టి పెద్దగా ఆందోళన చెందాల్సిన పని లేదు. కానీ ఏడాది చివర్లో మరో కఠిన పర్యటన. అది.. ఆసీస్‌తో వారి దేశంలో సిరీస్. ఇలాంటి అగ్ని గుండాల్ని దాటుకొని ఏడాది ముగిసేసరికి టీమ్‌ఇండియా ప్రపంచ ర్యాంకుల్లో అగ్రపీఠంపై నిలుస్తుందా?

2018లో టీమ్ ఇండియా ఆడనున్న టెస్టు సీరీస్‌లు


- **జనవరి-ఫిబ్రవరి:** దక్షిణాఫ్రికాతో వారి దేశంలో 3 టెస్టులు
- **జూన్-ఆగస్టు:** ఇంగ్లండ్‌తో ఆ దేశంలో 5 టెస్టులు
- **అక్టోబరు:** వెస్టిండీస్‌తో స్వదేశంలో 3 టెస్టులు
- **నవంబరు-జనవరి** 2019: ఆస్ట్రేలియాతో వారి దేశంలో 4 టెస్టులు

ధోని.. ఏం చేస్తాడో?




టెస్టుల నుంచి రిటైరైన మాజీ సారథి మహేంద్రసింగ్ ధోని.. గత ఏడాది పరిమిత ఓవర్ల క్రికె ట్లో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజ యాల్లో తన వంతు పాత్ర పోషిం చాడు. భారత్‌ను తొలి టీ20 ప్రపంచకప్‌లోనే విజేతగా నిలిపి న దక్షిణాఫ్రికా గడ్డపై వెటరన్‌గా అడుగుపెట్టా డు. వారి జట్టుతో భారత్ 6 వన్డేలు.. 3 టీ20ల్లో తలపడుతుంది. వయసు మీద పడుతున్న ధోనీకి ఈ సిరీస్ ఓ విధంగా కఠిన పరీక్షే. 2019 ప్రపంచ కప్ వరకు జట్టులో ఉం టాడని చీఫ్ సెలెక్టర్ ప్ర సాద్ నుంచి భరోసా లభించినా... ధోని ఈ పర్యట నలో రాణించడాన్ని బట్టే అతని భవిష్యత్ ఆధారపడి ఉంటుంది.

విరాట్... పరుగులు పోటెత్తేనా!



గత ఏడాది పరుగుల సాధనలో కోహ్లి.. విరాట్ రూపం దాల్చాడు. ఆరు డబుల్ సెంచరీ లతో ప్రపంచ కెప్టెన్లలో ముందు వరుసలో నిలబడ్డాడు. 2017లో ఏకంగా మూడు ద్విశతకాలు సాధించా డు. ఇవన్నీ ఎక్కువగా స్వదేశంలో సాధించనవే. రాన్నున్నవన్నీ విదేశీ సిరీస్‌లే. అందునా పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై. దక్షిణాఫ్రి కా, ఇంగ్లండ్‌లలో అతని రికార్డు చెప్పుకోద గ్గంత మెరుగ్గా లేదు. యాషెస్ సిరీస్ ముందు వరకు కెప్టెన్లలో విరాట్‌దే పైచేయి. ర్యాంకుల్లోనూ అతనే నెంబర్ వన్. కానీ యాషెస్‌లో ఆసీస్ కెప్టెన్ స్మిత్ దుమ్ము దులిపి పరుగుల వరద పారించాడు. 1305 పరుగులతో కొత్త ఏడాదికి బెంచ్‌మార్క్‌ను నిర్దేశించాడు. నెంబర్‌వన్ ర్యాంకును దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో విరాట్‌కు, డివిలియర్స్‌కు పోటీ ఉంటుంది. ఏడాది చివర్లో ఆసీస్ పర్యటనలో మాత్రం స్మిత్, విరాట్ మధ్య పరుగుల పోటీ రసవత్తరంగా ఉండడం ఖాయం!

సైనా సాధించేనా!



సైనా నెహ్వాల్,... ఎన్నో ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగిడుతోంది. గత ఏడాది పెద్దగా కలిసి రాకున్నా.. 2018లో తన చిరకాల వాంఛ ఆల్ ఇంగ్లాండ్ టోర్నీని గెలుచుకోవాలని ఆశతో ఉంది. 10 సార్లు ఆ టోర్నీలో ఆడినా ఆమెకు రజతమే లభించింది. ఈ ఏడాది సూపర్ సిరీస్ టైటిళ్లతో పాటు.. ఆల్ ఇంగ్లండ్ పసిడి సైనా లక్ష్యం.

సింధును ఊరిస్తున్న పసిడి



కొత్త సంవత్సరంలో పీవీ సింధు లక్ష్యం.. నెంబర్ వన్. గత ఏడాది రెండో స్థానానికి ఎగబాకి మూడుకు చేరుకున్న సింధు... కొత్త సంవత్సరంలో అగ్రపీఠంపై గురిపెట్టింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి కూడా సింధును ఊరిస్తోంది. సూపర్ సిరీస్‌లతో పాటు కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు సింధు ముందున్న అవకాశాలు. జపాన్ క్రీడాకారిణి ఒకుహర.. సింధుకు కొరకరాని కొయ్యగా మారింది. ఆమెపై రికార్డును సింధు మెరుగుపరచుకోవాల్సివుంది. ఏడాది చివర్లో తన ఆటతీరును బాగా మార్చుకున్న తెలుగుతేజం... 2018లో కలిసి వచ్చే అవకాశాలున్నాయి.

శ్రీకాంత్ లక్ష్యం.. నెంబర్ వన్

2017లో వరుసగా నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచి జోరుమీ దున్న శ్రీకాంత్‌కు ఏడాది చివర్లో త్రుటిలో నెంబర్ వన్ చేజారింది. నెంబర్ వన్ అక్సెల్సెన్ (డెన్మార్క్)తో పోటీ పడుతున్న శ్రీకాంత్.. ఆల్ ఇంగ్లండ్ లేదా సూప ర్ సిరీస్ టైటిల్ గెలిస్తే అగ్రపీఠం వశమవుతుంది.

రంజీ ట్రోఫీ చేరువలో విదర్భ



అక్షయ్ వాడ్కర్

ఇండోర్: రంజీ ట్రోఫీలో విదర్భ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీని సొంతం చేసుకోనుంది. అక్షయ్ వాడ్కర్ (133 బ్యాటింగ్, 243 బంతుల్లో, 16 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించడంతో ఆ జట్టు రంజీ ట్రోఫీకి చేరువలో నిలిచింది. కెరీర్ మొదటి సీజన్‌లో ఐదో మ్యాచ్ ఆడుతున్న వాడ్కర్‌కు ఇదే తొలి ఫస్ట్‌క్లాస్ సెంచరీ. ఆదివారం మూడో రోజు ఆఖరుకు విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 528 పరుగుల భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 295 స్కోరు చేసిన ఢిల్లీపై ఇప్పటికి 233 పరుగుల ఆధిక్యం సంపాదించింది. చివరి సెషన్లో సిద్దేశ్ నెరాల్ బౌండరీలతో ప్రేక్షకులను అలరించాడు. అతను 92 బంతుల్లో నాలుగు బౌండరీలు, నాలుగు సిక్స్‌లతో 56 పరుగులతో అజేయంగా నిలిచాడు. వాడ్కర్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 113 పరుగులు జోడించా డు. అంతకుముందు ఉదయం ఓవర్ నైట్ స్కోరు 206-4తో విదర్భ ఇన్నింగ్స్ కొనసాగించింది.

ఢిల్లీ తొలి ఇన్నింగ్స్: 295

విదర్భ తొలి ఇన్నింగ్స్: ఫజల్ (సి) పంత్ (బి) ఆకాశ్ 67, సంజయ్ (బి) ఆకాశ్ 31, జాఫర్ (ఎల్బీ) (బి) సైని 78, గణేశ్ సతీష్ (ఎల్బీ) (బి) సైని 12, వాంఖడే (సి) పంత్ (బి) ఖెజ్రోలియా 28, వఖారే (సి) పంత్ (బి) సైని 17, అక్షయ్ వాడ్కర్ బ్యాటింగ్ 133, సర్వటే (సి) పంత్ (బి) రాణా 79, నెరాల్ బ్యాటింగ్ 56, ఎక్స్‌ట్రాలు 27, మొత్తం (156 ఓవర్లలో 7 వికెట్లకు) 528

వికెట్ల పతనం: 1-96, 2-107, 3-133, 4-206, 5-237, 6-246, 7-415

బౌలింగ్: ఆకాశ్ 27-3-102-2, సైని 32.5-4-126-3, రాణా 13.1-1-32-1, ఖెజ్రోలి యా 35-5-122-1, వికాశ్ మిశ్రా 38-6-102-0, షోరే 10-1-27-0.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.